www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 237 | శుక్రవారం | 16 ఫిబ్రవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

హామీలు నెరవేర్చండి



ఎయిమ్స్, ఐఐఎంలను మంజూరు చేయండి



- వెనుకబడిన జిల్లాలకు నిధులు విడుదల చేయండి
- పాత తొమ్మిది జిల్లాలను బ్యాక్‌వర్డ్‌గా గుర్తించినందుకు కృతజ్ఞతలు
- పెంచిన ఎఫ్ఆర్‌బిఎం పరిమితిని కొనసాగించండి
- ఢిల్లీలో కేంద్ర ఆర్థికమంత్రితో భేటీలో ముఖ్యమంత్రి కెసిఆర్
- అడిగిన వాటికి సుముఖంగా స్పందించిన అరుణ్ జైట్లీ

మన తెలంగాణ/ న్యూఢిల్లీ: తెలంగాణకు కేంద్రం గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ముఖ్యమంత్రి కెసిఆర్ గురువారం నాడు ఢిల్లీలో కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీని కలుసుకొని కోరారు. రాష్ట్రానికి ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని, అందుకు తగిన నిధులు విడుదల చేయాలని, అదే విధంగా గతంలో కేంద్రమంత్రి స్మృతి ఇరానీ మాట ఇచ్చిన మేరకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)ను మంజూరు చేయాలని, అలాగే పెంచిన రుణపరిమితి (ఎఫ్ఆర్‌బిఎం)ని 3.5 శాతం వద్దనే కొనసాగించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. 2014 నుండి 2017 వరకు మూడు ఆర్థిక సంవత్సరాలకు రూ. 450 కోట్ల చొప్పున మొత్తం రూ.1350 కోట్ల నిధులు కేంద్రం విడుదల చేసిందని చెబుతూ 2017–18 సంవత్సరానికి వెనుకబడిన జిల్లాలకు ఇంకా తరువాయి 6లో

మీకు గాఢాభిమానిని

- రైతులకు నగదు పథకం భేష్
- ముఖ్యమంత్రి కెసిఆర్‌కు కేంద్ర ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రహ్మణ్యం ప్రశంసలు

తెలంగాణలో రైతులకు పెట్టుబడి ప్రోత్సాహం కింద నగదు ఇచ్చే పథకం బాగుందని కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రహ్మణ్యం ముఖ్యమంత్రి కెసిఆర్‌ను ప్రశంసించారు. నేను మీకు పెద్ద అభిమానిని అని అన్నారు. సిఎం కోరిక మేరకు సోమవారం నాడు హైదరాబాదులో లంచ్‌కు వస్తానని చెప్పారు.

నదీ బోర్డులపై ప్రతిష్టంభన

- కృష్ణ, గోదావరి బోర్డుల పరిధిని తక్షణమే నోటిఫై చేయడానికి అంగీకరించిన ఎపి
- నీటి కేటాయింపుల తరువాతే చేయాలని పట్టుబట్టిన తెలంగాణ
- తెలంగాణలో మైనర్ ఇరిగేషన్ జలాల వినియోగంపై భిన్నాభిప్రాయాలు



మన తెలంగాణ / న్యూఢిల్లీ


కృష్ణా, గోదావరి నదీ బోర్డుల పరిధిని ప్రకటించే విషయంపై తెలంగాణ, ఎపిలు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేశాయి. గురువారం నాడు ఢిల్లీలోని జల వనరుల మంత్రిత్వశాఖ కార్యాలయంలో ఆ శాఖ కార్యదర్శి యుపి సింగ్ ఆధ్వర్యాన జరిగిన సమావేశంలో రెండు రాష్ట్రాలూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశాయి. సమావేశంలో రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి హరీశ్ రావు, ఎంపి మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, రెండు రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పంపకాలకు అనుగుణంగా నీటి విడుదల బాధ్యతను కృష్ణా బోర్డుకు అప్పగించే అంశంపై ప్రధానంగా చర్చ జరిగింది. రెండు నదుల బోర్డుల పరిధిని తక్షణమే నోటిఫై చేయడానికి పర్యవేక్షణ సంస్థ సుముఖతను వ్యక్తం చేసింది. ఎపి కూడా దానినే కోరింది. కానీ, తెలంగాణ అభ్యంతరం చెప్పింది. ముందుగా నీటి కేటాయింపులు జరగాలని, ఆ తరువాతనే పరిధులపై నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ అభిప్రాయపడింది.
హరీశ్‌రావు వివరణ : బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ అవార్డు తర్వాతనే కెఆర్ఎంబి పరిధిలోకి ప్రాజెక్టులను తీసుకురావాలని మంత్రి హరీశ్ రావు కోరారు. అప్పుడే రాష్ట్రాలకు కేటాయించిన నీటిని తరువాయి 6లో



రక్తపాఠశాల

ఫ్లోరిడా సమీప స్కూల్‌లో దుండగ విద్యార్థి బుల్లెట్ల వర్షం

17 మంది దుర్మరణం



- గాయాలపాలైన మరి పెక్కుమంది విద్యార్థులు
- తుంటరి ప్రవర్తనకు సస్పెండ్ చేశారన్న కక్షతో ఫైర్ ఆలార్మ్ మోగించి మరీ సాటి వారిపై కాల్పులు

పార్క్‌ల్యాండ్ : అమెరికాలో మరోసారి తుపాకీ హింస చెలరేగింది. ఫ్లోరిడా సమీప పార్క్‌ల్యాండ్‌లోని మర్జోరీ స్టోన్‌మన్ డగ్లస్ పాఠశాలలో జరిగిన కాల్పుల ఘటనలో 17మంది విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు. పదుల సంఖ్యలో విద్యార్థులు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రుల్లో ఒక ఇండియన్ అమెరికన్ విద్యార్థి కూడా ఉన్నాడు. ఈ స్కూల్‌లో భారత సంతతి విద్యార్థులు ఎక్కువ మంది ఉంటారని సమాచారం. కాల్పుల తరువాయి 6లో

ఆజాద్ ఎన్‌కౌంటర్ కేసులో

29 మంది పోలీసులపై న్యాయ విచారణ

ఆదిలాబాద్ జిల్లా కోర్టు ఆదేశం



మన తెలంగాణ/ ఆదిలాబాద్ : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వాంకిడి మండలం సర్కపల్లి అటవీ ప్రాంతంలో ఎనిమిదేళ్ల క్రితం జరిగిన మావోయిస్టు అగ్రనేత చెరుకూరి రాజ్‌కుమార్ అలియాస్ ఆజాద్, జర్నలిస్ట్ హేమచంద్రపాండేల ఎన్‌కౌంటర్ కేసు కీలక మలుపు తిరిగింది. ఈ కేసుపై గురువారం జిల్లా కోర్టులో వాదనలు కొనసాగాయి. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులను న్యాయ విచారణకు ఆదేశించాలని ఆజాద్ భార్య పద్మ తరపు న్యాయవాదులు న్యాయమూర్తిని కోరారు. సానుకూలంగా స్పందించిన న్యాయమూర్తి భరత లక్ష్మి ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న 29 మంది పోలీసులపై న్యాయ విచారణకు అనుమతినిస్తూ తీర్పు ఇచ్చారు. సర్కపెల్లి అటవీ ప్రాంతంలో 2010, జులై 2న మావోయిస్టులకు, పోలీసుల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో మావోయిస్టు అగ్రనేత చెరుకూరి రాజ్‌కుమార్ అలియాస్ ఆజాద్, జర్నలిస్ట్ హేమచంద్ర పాండేలు మృతి చెందారు. కాగా ఈ ఎన్‌కౌంటర్ బూటకమని పోలీసులు తమ ఉనికిని కాపాడుకోవడానికే వీరిని అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి కాల్చి చంపారని, ఎన్‌కౌంటర్‌కు బాధ్యులైన పోలీసులపై కేసులు నమోదు చేసి న్యాయం తరువాయి 6లో



ఇరాన్ అధ్యక్షుడు

రోహనీకి ఘనస్వాగతం

- నేడు కుతుబ్‌షాహీ టూంబ్స్ సందర్శన
- మక్కామసీదు ప్రార్థనల్లో పాల్గొని ప్రసంగించనున్న ఇరాన్ అధినేత 2లో

దక్షిణాఫ్రికా అధ్యక్షుడు

జుమా రాజీనామా



- అవినీతి కుంభకోణాల నేపథ్యంలో ఎఎన్‌సి మద్దతు ఉపసంహరణ
- కొత్త అధ్యక్షుడిగా సిరిల్ రామ్‌పోసా 11లో

కుంచెపోటు



లోన్ కావాలా..? నువ్వేమైనా నీరవ్ మోడీవా, విజయ్ మాల్యావా, కనీసం లోకల్ ఫ్రాడ్‌వి కూడా కాదు.. పో..పో..!

శ్రీరామ్‌పూర్ ఓపెన్ కాస్ట్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ 10

3 ఎసిబి వలలో పంచాయతీరాజ్ డిఇఇ చంద్ర ప్రకాశ్

రూ.5,100 కోట్ల నీరవ్ మోడీ ఆస్తులు స్వాధీనం 9

- జనవరిలోనే దేశం వీడిన నీరవ్, కుటుంబం



బిజెపిని దించడానికి ఒకే దేశవ్యాప్త వ్యూహం అసాధ్యం

- ఆయా రాష్ట్రాల నేపథ్యంలో భిన్న ఎత్తుగడలే శరణ్యం
- ఫాసిస్టు వ్యతిరేక ప్రతిఘటన, వామపక్ష ఐక్యత పరస్పర విరుద్ధం కాదు : సిపిఐ రాజకీయ తీర్మాన ముసాయిదా 3లో


మార్క్‌ఫెడ్ ద్వారా ఎర్రజొన్నల కొనుగోలు

- 19 నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- క్వింటాకు రూ. 2300 వంతున ఆఖరి బస్తా వరకు కొంటాం : పోచారం



మన తెలంగాణ/ హైదరాబాద్ : ఎర్ర జొన్నలను రాష్ట్ర ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ఈ నెల 19వ తేదీ నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి క్వింటా రూ. 2300 చొప్పున ఆఖరి బస్తా వరకు కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. సాగు నమోదైన నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల్ మూడు జిల్లాల్లో అవసరం మేరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు తరువాయి 6లో

బఫర్ గోదాముల తనిఖీలకు ప్రత్యేక బృందాలు



మనతెలంగాణ/హైదరాబాద్ : బఫర్ గోదాముల వద్ద రీసైక్లింగ్ బియ్యానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశామని పౌరసరఫరాల శాఖ కమిషనర్, పౌరసరఫరాల సంస్థ ఎండి సి.వి.ఆనంద్ తెలిపారు. రాష్ట్రంలో ప్రజాపంపిణీ పథకం కింద రీసైక్లింగ్ బియ్యం పంపిణీ కాకుండా నిరోధించడానికి ముందు జాగ్రత్తగా అవసరమైన బృందాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశామని, ఈ కమిటీలో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్లతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, జిల్లా తూనికలు, కొలతల విభాగం నుంచి ఒక్కొక్కరిని సభ్యులుగా నియమించామని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక తనిఖీ బృందాలను తూనికలు, కొలతల శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కూడిన బృందం పనితీరును పరిశీలిస్తుందన్నారు. ఈ బృందం ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆయా జిల్లాలకు వెళ్లి ప్రత్యేకంగా పర్యవేక్షిస్తుందని చెప్పారు. ఈ కమిటీ సభ్యులు తమకు కేటాయించిన బఫర్ గోదాముల్లో ప్రతినెలా 1వ తేదీ నుంచి తనిఖీలు నిర్వహించి 15వ తేదీ లోగా కార్పోరేషన్ ప్రధాన కార్యాలయానికి నివేదికలు అందజేయాలని పేరొన్నారు. ఈ బృందాలను అంతర్గతంగా నెలవారీగా ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు మారుస్తూ ప్రధాన కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ చేస్తామన్నారు. మిల్లర్లతో కుమ్మక్కై రీసైకిల్డ్ బియ్యాన్ని అనుమతించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

డిపిఆర్‌ల కాలయాపనపై తుమ్మల ఆగ్రహం

● **వాటిని త్వరగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశం**

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రతిపాదిత జాతీయ రహదారి పనులకు డిపిఆర్‌ల తయారీ నెపంతో తీవ్ర కాలయాపన జరుగుతుండడం పట్ల అధికారులపై రోడ్లు భవనాలశాఖ మంత్రి తుమ్మల ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ రహదారుల కోసం భూసేకరణకు జరుగుతున్న అడ్డంకులపైనా మంత్రి తుమ్మల ఉన్నతాధికారులను వివరణ కోరారు. ఆర్ అండ్ బి ఇంజనీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో ఇఎన్‌సి గణపతి రెడ్డి, ఎన్‌హెచ్ఎఐ అధికారులు రాష్ట్ర ఎన్‌హెచ్ అధికారులతో మంత్రి తుమ్మల గురువారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో చేపట్టిన జాతీయ రహదారి పనులు, ఇతర భవన నిర్మాణాల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఈ నెల 6 న ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని కలిసిన సందర్భంగా రాష్ట్రంలో వివిధ హైవే రోడ్లు పనుల నిధులను మంజూరు చేయాల్సిందిగా కోరినట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. అంతే కాకుండా అంతర్రాష్ట్ర అనుసంధాన రోడ్ల నిర్మాణం కోసం రూ. 190 కోట్ల డిపిఆర్‌లను సిద్దం చేసి కేంద్ర మంత్రి గడ్కరీకి అందజేశారు. ఈ అనుసంధాన రోడ్లలో నిర్మల్ జిల్లా భైంసా– పెద్ద పల్లి రోడ్డు (రూ.59కోట్లు), భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో లక్ష్మి నగరం– లక్ష్మి పురం రోడ్డు (రూ.51 కోట్లు), ఖమ్మం జిల్లా ఖానాపురం–గన్నవరం రోడ్డు (రూ. 12.40 కోట్లు), ఖమ్మం జిల్లాలోనే మిట్టపల్లి– ఉట్కూర్ వయా పెద్ద కోరికొండ వరకు (రూ. 33 కోట్లు), భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ములకలపల్లి– వెంకటాపురం రోడ్లు (రూ. 34.70 కోట్లు) ఉన్నట్లు తుమ్మల ఈ సందర్భంగా తెలిపారు. అటవీ శాఖ అనుమతుల జాప్యం కారణంగా నిలిచి పోయిన నకిరేకల్– మల్లంపల్లి జాతీయరహదారి పనుల అంశాన్ని కూడా నితిన్ గడ్కరీ వివరించినట్లు తుమ్మల తెలిపారు. అలాగే రాజధాని హైదరాబాద్ నగరం చుట్టూ ప్రాంతీయ బాహ్య వలయ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు కొరకు కేంద్రాన్ని నిధులు అడిగినట్లు తుమ్మల వెల్లడించారు.

ఇరాన్ అధ్యక్షుడికి ఘనస్వాగతం

● **రెండు రోజుల పాటు నగరంలో బస**

● **చారిత్రక ప్రాంతాలను సందర్శించనున్న రోహానీ**



మన తెలంగాణ/హైదరాబాద్ : ఇరాన్ అధ్యక్షులు డాక్టర్ హసన్ రౌహాని గురువారం సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్‌కు చేరుకున్నారు. భారత్‌లో మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. అందుల్లో భాగంగా తొలి రెండు రోజులు హైదరాబాద్‌లో గడపనున్నారు. హైదరాబాద్‌కు వచ్చిన డాక్టర్ హసన్ రోహనీకి బేగంపేట విమానాశ్రయంలో రాష్ట్ర గవర్నర్ ఇ.ఎస్.ఎల్.నరసింహన్, కేంద్ర విద్యుత్, ఇంధన మంత్రి ఆర్.పి.సింగ్ ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మహమ్మద్ అలీ, జిఎడి ముఖ్య కార్యదర్శి అధర్ సిన్హా, డిజిపి ఎం.మహేందర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజి నవీన్‌చంద్, నగర పోలీసు కమిషనర్ వి.వి.శ్రీనివాస్‌రావు, ప్రోటోకాల్ డైరెక్టర్ అర్విందర్‌సింగ్, రీజినల్ పాస్‌పోర్టు అధికారి ఇ.విష్ణువర్ధన్‌రెడ్డిలు పాల్గొన్నారు. హైదరాబాద్‌కు చేరుకున్నంతరం తాజ్‌కృష్ణ హోటల్‌లో ఆయన మత పెద్దలతో సమావేశమయ్యారు. సుమారు గంటన్నరపాటు ఈ సమావేశం కొనసాగింది. హోటల్ తాజ్ కృష్ణలో బస చేసిన ఆయన శుక్రవారం సాలార్‌జంగ్ మ్యూజియం, గోల్కొండ కోట, ఖుతుబ్ షాహి ట్యూంబ్, మక్కా మసీదును సందర్శిస్తారు.ఈ ప్రాంతాలలో ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మక్కా మసీదులో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలలో ఆయన పాల్గొంటు న్నారు. ఈ సందర్భంగా చార్మినార్ పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ ఆంక్షలతో పాటు కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ప్రార్థనలకు వచ్చే వారందర్నీ మెటల్ డిటెక్టర్ డోర్ ద్వారానే పంపించాలని పోలీసులు నిర్ణయించారు. సాయంత్రం 4 గంటలకు నగరంలో స్థిరపడ్డ ఇరాన్ వాసులతో తాజ్‌కృష్ణలో సమావేశమవుతారు. ఆ తరువాత 5.30 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్తారు.

లక్షల్లో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలు

● **బిల్లులు చెల్లించని ప్రధాన ఉద్యోగ సంఘాల కార్యాలయాలు, కన్నెత్తి చూడని డిస్కంలు**

● **ఆందోళన చెందుతున్న అధికారులు**

మన తెలంగాణ/హైదరాబాద్ : సచివాలయానికి, టిఎస్ ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న ప్రధాన ఉద్యోగ సంఘాల (యూనియన్) కార్యాయాల బిల్లులు లక్షల్లో పేరుకుపోయాయి. మింట్ కాంపౌండ్‌లోని '1104 వర్కర్ యూనియన్' కార్యాలయం విద్యుత్ బిల్లుల బకాయి జనవరి నాటికి రూ. 48,05,177కు చేరుకుంది. దీనికి సమీపంలోనే ఉన్న '327 యూనియన్' కార్యాలయం బిల్లుల బకాయి రూ. 9 లక్షలు. మరో నాలుగు యూనియన్ల కార్యాలయాల కరెంటు బిల్లుల బకాయిలను కూడా కలుపుకుంటే మొత్తం దాదాపు రూ. 68.72 లక్షలు. దీనికి తోడు జిల్లాలు, రెవెన్యూ డివిజనల్ కేంద్రాలు, ప్రధాన పట్టణాల్లో ఉన్న కార్యాలయాల బకాయిలు కలిపితే కోట్లల్లోనే ఉంటుందని సమాచారం.

కొన్ని జిల్లాల్లోని యూనియన్ కార్యాలయాలకు అసలు విద్యుత్ మీటర్లే లేవు. సిబ్బంది సంక్షేమం, అభివృద్ధి, ప్రయోజనాలు ధ్యేయంగా పని చేయాల్సిన యూనియన్లే కరెంటు బిల్లులు చెల్లించకుండా డిస్కంలకు చుక్కలు చూపుతున్నాయి. డిస్కంలు సైతం విద్యుత్ ఉద్యోగుల యూనియన్ల కార్యాలయాల వైపు కన్నెత్తి కూడా చూడవు. లక్షల్లో బిల్లులు పేరుకుపోతున్నా పట్టించుకోవు. ఆదర్శంగా ఉండాల్సిన గుర్తింపు పొందిన యూనియన్లే ఈ విధంగా చేయడంపై డిస్కంల అధికారులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. యూనియన్ ఆఫీసుల కరెంటు బిల్లుల్ని చెల్లించడాన్ని మర్చిపోయిన ఉద్యోగులు జీతాలను పెంచుకోవడం కోసం వేతనాల సవరణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి ఐదేళ్ళకోసారి సవరణ సంఘం సిఫారసులు చేస్తూ ఉంటే విద్యుత్ ఉద్యోగులకు మాత్రం నాలుగేళ్ళకోసారి ఉంటుంది. ఇన్ని సౌకర్యాలు పొందుతున్నా స్వంత సంస్థకు సహకరించడం, ఆదర్శంగా ఉండడానికి బదులుగా ఎగ్గొట్టేవారిలో ముందు వరుసలో ఉండడం కొన్ని యూనియన్లకే చెల్లింది.



ట్యాంక్‌బండ్‌పై ఆ ఐదుగురి కాంస్య విగ్రహాలు

మన తెలంగాణ/హైదరాబాద్: సమాజ హితం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, కొండలక్ష్మణ్ బాపూజీ, దొడ్డి కొమరయ్య, బొమ్మగాని ధర్మబిక్షం, చాకలి ఐలమ్మల కాంస్య విగ్రహాలను హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద నెలకొల్పాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని బిసి భవన్‌లో మాజీ ఎంపి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు బొమ్మగాని ధర్మబిక్షం 96వ జయంతిని పురస్కరించుకుని గురువారం బిసి సంఘం నేతలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ నీతి నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం బొమ్మగాని ధర్మబిక్షమని, ఆయన చరిత్ర చిరస్థాయిగా నిలిచేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. . సూర్యాపేట జిల్లాకు ధర్మబిక్షం పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి నేతలు ఇ.నిరంజన్, కుల్కచర్ల శ్రీనివాస్, కనకాల శ్యామ్, జాజుల లింగంగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే దేశవ్యాప్త వ్యూహం అసాధ్యం

• బిజెపిని దించడానికి రాష్ట్రాలవారీగా భిన్న ఎత్తుగడలు • సిపిఐ రాజకీయ తీర్మాన ముసాయిదా



మనతెలంగాణ/న్యూఢిల్లీ: మోడీ ప్రభుత్వం, దాని సైద్ధాంతిక ప్రదాత ఆర్‌ఎస్‌ఎస్ సాగిస్తున్న మితవాద–మతోన్మాద, ఫాసిస్టు తరహా దాడికి వ్యతిరేకంగా చేసే బృహత్తర ప్రతిఘటనా ప్రయత్నాలు, మరో వైపు వామపక్ష ఐక్యత పరస్పరం విరుద్ధం కాదని సిపిఐ ప్రకటించింది. జాతీయత పేరుతో అవి సాగిస్తున్న హిందుత్వ ప్రచారం, రాజకీయ ,సైద్ధాంతిక వాతావరణాన్ని విషతుల్యం చేస్తున్నాయని విమర్శించింది. కేరళలో జరిగే పార్టీ 23వ జాతీయ మహాసభలకు రూపొందించిన రాజకీయ తీర్మానం ముసాయిదాను పార్టీ వివిధ స్థాయిల్లో చర్చకు సిపిఐ ప్రధాన కార్యదర్శి ఎస్.సుధాకర్‌రెడ్డి అజయ్‌భవన్‌లో గురువారం ఒక పత్రికా గోష్ఠిలో విడుదల చేశారు. పార్టీ ఉప ప్రధాన కార్యదర్శి గురుదాస్ దాస్‌గుప్తా, కార్యదర్శులు ఎంపి డి.రాజా, అతుల్‌కుమార్ అంజాన్, కె.నారాయణ, షమీమ్ ఫైజీ, అమర్‌జీత్ కౌర్‌లు కూడా గోష్ఠికి హాజరయ్యారు. ఎన్నికల ఎత్తుగడ, మితవాద–మతవాద ఫాసిస్టు పోకడలకు వ్యతిరేకంగా సాగించే పోరాటం భిన్నమైదని సుధాకర్‌రెడ్డి చెప్పారు. ప్రస్తుత సంక్లిష్ట పరిస్థితులలో బిజెపిని గద్దెదించడానికి దేశవ్యాపితంగా ఒకే రాజకీయ ఎత్తుగడ అసాధ్యమని, ఆయా రాష్ట్రాల భిన్నమైన రాజకీయ పరిస్థితుల కనుగుణంగా ఎత్తుగడలు ఉంటాయని ఆయన వివరించారు. గతంలో పాండిచ్చేరి మహాసభలో అప్పుడే అధికారంలోకి వచ్చిన, నరేంద్ర మోడీ ప్రభుత్వం పట్ల ఒక నిర్వచనం చేసిందని, సాధారణంగా ఎన్నికలలో ఒక బూర్జువా పార్టీ నుండి మరో బూర్జువా పార్టీకి అధికారం బదిలీ అవడమే కాకుండా, అత్యంత మితవాద, ఫాసిస్టు అనకూల, కార్పొరేటు అనకూల, మతోన్మాద ప్రభుత్వం నరేంద్ర మోడీదని, ఈ ప్రభుత్వం ఫాసిస్టు అనుకూల పద్ధతిలో పోయే ప్రమాదం ఉందని, ఆరోజు మా పార్టీ హెచ్చరిక చేసిందన్నారు. ఈ మూడున్నర సంవత్సరాల కాలంలో దేశ వ్యాప్తంగా జరిగిన పరిణామాలు మా పార్టీ చేసిన నిర్వచనం సరియైనదేనని నిరూపించాయని అన్నారు. ఆర్థిక వ్యవస్థలోనే కాకుండా అన్ని రంగాలలో మితవాద పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఆర్థిక రంగంలో నయా ఆర్థిక ఉదారవాద విధానాన్ని నరేంద్ర మోడీ ప్రభుత్వం సంపూర్ణంగా కొనసాగించే ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు. దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నం చేస్తున్నదని, దేశాన్ని, ప్రజలను విభజించడానికి ప్రయత్నం చేస్తున్నదని బిజెపి పై విమర్శనాస్త్రాలు సంధించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, సెక్యులరిజం ఇవన్నీ తీవ్రమైన ప్రమాదంలో పడ్డాయన్నారు. మరింత నియంతృత్వ పద్ధతులలో దేశంలో పరిపాలన సాగుతున్నదని, వీటిని ప్రతిఘటించడానికి దేశ వ్యాప్తంగా సెక్యులర్, ప్రజాతంత్ర, వామపక్ష శక్తులు, సంస్థలు, ప్రజా సంఘాలు, మేధావులు అందరితో కలసినటువంటి ఒక విస్తృతమైన వేదిక ప్రతిఘటనా పోరాటాన్ని చేయడానికి దేశంలో అవసరమని సిపిఐ తీర్మానించిందని అన్నారు. దీన్ని ఎన్నికలలో ఒక ఎత్తుగడలో భాగంగా, ఎన్నికలకు సంబంధం ఉన్నదిగా భావించకూడదని సురవరం అన్నారు. సిపిఐ పార్టీ ఈ రెండింటిని వేరువేరుగా చూస్తుందని తెలిపారు. దేశ, అంతర్జాతీయ పరిస్థితులను బట్టి వామపక్షాల ఐక్యత, వామపక్షాల ప్రత్యామ్నాయం ఇవి దేశంలో ప్రధానమైనటువంటిదన్నారు. దాన్ని కొనసాగించాలని, అదే సమయంలో ప్రతిఘటనా ఉద్యమానికి సంబంధించినటువంటి అంశాన్ని, వామపక్ష పోరాట ఉద్యమాన్ని పరస్పర విరుద్ధంగా భావించకూడదని సిపిఐ భావిస్తుందని వివరించారు. దేశ వ్యాప్తంగా ఆర్‌ఎస్‌ఎస్, వారి నాయకత్వం కింద నడుస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని అధికారంలోంచి తొలగించడమనేది ఒక ప్రధాన లక్ష్యంగా ఉన్నదనేది మా పార్టీ భావిస్తున్నదని ఆయన తెలిపారు. ఈ అంశాలన్నింటిని రాబోయే పార్టీ మహాసభలలో చర్చిస్తామని ఆయన వెల్లడించారు. ఆయా రాష్ట్రాలలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలకు, ప్రతిపక్షంలో ఉన్న పార్టీలకు ఆర్థిక సమస్యల మీద, ప్రజా సమస్యల మీద వైరుధ్యాలుంటాయి, ఉద్యమాలు ,పోరాటాలు నడుస్తాయి. వామపక్షాల ఐక్యత దేశ వ్యాప్తంగా, రాష్ట్రాలలోనూ కొనసాగాలని మాపార్టీ కోరుకుంటోంది. ఎన్నికల ఎత్తుగడలకు సంబంధించిన అంశాలను ఎన్నికలు వచ్చినప్పుడు మాపార్టీ నిర్ణయిస్తుందని సురవరం పేర్కొన్నారు. ఎన్నికల ఎత్తుగడలకు పార్టీ మహాసభలకు సంబంధం లేదు, ఎన్నికల ఎత్తుగడలను ఏ పార్టీ కూడా మహాసభలలో చర్చించదు అని కొంతమంది మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సురవరం సమాధానం చెప్పారు.

మూసీ సుందరీకరణకు మాస్టర్ ప్లాన్

చెరువుల అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళిక : మంత్రి కెటిఆర్



మన తెలంగాణ/హైదరాబాద్: డ్రోన్ లాంటి అత్యాధునిక సాంకేతికతను వినియోగించడం ద్వారా మూసీనదిని సర్వే చేసి మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేయాలని మున్సిపల్ శాఖ మంత్రి కె.తారకరామారావు అధికారులను ఆదేశించారు. మూసీ నదిఅభివృద్ధి, సుందరీకరణ తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని శాటిలైట్ మ్యాపులతో ప్రస్తుత పరిస్థితులను అధ్యయనం చేయాలని సూచించారు. బేగంపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో హైదరాబాద్ నగరంలోని మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యక్రమాలపై మంత్రి కెటిఆర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ ఛైర్మన్ ప్రేమ్‌సింగ్ రాథోడ్, మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్,జిహెచ్‌ఎంసి కమిషనర్ డాక్టర్ జనార్దన్ రెడ్డి, హెచ్‌ఎండిఎ కమిషనర్ చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.ఈసందర్భంగా మూసీనది అభివృద్ధి అంశాలపై మంత్రి చర్చించారు. ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉన్న మూసీ నది వెంట రోడ్లు, నదికి ఇరువైపులా రోడ్లు, ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ వే, రెండింటికీ కలయికతో కూడిన ప్రణాళికలు తదితర అంశాలపై మంత్రి సమీక్షించారు. దీనికి అయ్యే ఖర్చులు, సాధ్యాసాధ్యాలను కూడా అధ్యయనం చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. రోడ్లకు అనుబంధం గా రూపకల్పన చేస్తున్న బ్రిడ్జీల డిజైన్లు, నిర్మాణం సైతం చారిత్రక సంస్కృతికి అద్దంపట్టేలా ఉండాలన్నారు. నగర పరిధిలోని చెరువుల అభివృద్ధి ప్రణాళికలపై కూడా చర్చించారు. అవుటర్‌రింగ్ రోడ్డు లోపల ఉన్న చెరువుల అభివృద్ధికి దీర్ఘకాలికప్రణాళికలను రూపొందించుకుని,దశలవారీగా అభివృద్ధి చేస్తామన్నారు. వర్షకాలం నాటికి కనీసం 50 చెరువులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి కెటిఆర్ అన్నారు. చెరువుల అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే 20 చెరువులకు సందరీకరణ ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని అధికారులు మంత్రి కెటిఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దుర్గం చెరువు సుందరీకరణ వేగంగా సాగుతుందని వారు వివరించారు. వర్షకాలం నాటికి ఆయా చెరువుల్లో గుర్రపు డెక్కను తొలగించడంతోపాటు వాటి అభివృద్ధి పనులను ప్రారంభించాలని మంత్రి కెటిఆర్ అధికారులకు సూచించారు. చెరువులను అభివృద్ధి చేసేవరకు ఆ స్థలాలు కబ్జా కాకుండా తగిన చర్యలు తీసుకునేలా జిల్లా కలెక్టర్లతో మాట్లాడాలని మంత్రి వారికి సూచించారు.

'కాకతీయ' 4వ దశలో 111 చెరువులు

మన తెలంగాణ/హైదరాబాద్: మిషన్ కాకతీయ నాలుగవ దశలో 111 చెరువుల పనులకు అనుమతులిస్తూ 13 జిఒలు గురువారం జారీ అయ్యాయి. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, భూపాలపల్లి, జనగామ, సిద్ధిపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన 111 చెరువులకు 32.13 కోట్లకు పరిపాలనా అనుమతులు జారీ చేశారు. ఇప్పటిదాకా మిషన్ కాకతీయ నాలుగవ దశలో 31 జిల్లాల్లో మొత్తం 3,020 చెరువుల పునరుద్ధరణకు పరిపాలనా అనుమతులు ఇవ్వగా, 2,695 చెరువుల పునరుద్ధరణకు టెండర్లు పిలిచారు. 1,569 చెరువుల పనులు కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్లు కుదుర్చుకొని పనులు ప్రారంభించారు. నాలుగో దశలో మొత్తం 6,000 చెరువులు పునరుద్ధరించి, నాలుగు లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. పరిపాలనా అనుమతులు వచ్చిన చెరువులకు వెంటనే టెండర్లు పిలిచి, పనులు ప్రారంభించాలని ఇరిగేషన్ శాఖ మంత్రి టి.హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. వీటితో పాటు 147 ఆర్‌ఆర్‌ఆర్ పనులకు కూడా ప్రభుత్వం రూ.28.90 కోట్లతో అనుమతులు జారీచేసింది. ఇవి కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టే పనులు కనుక వీటిని వెంటనే టెండర్లు పిలవాలని సిఇలకు మంత్రి సూచించారు.

23 నుంచి సర్పంచ్‌ల సమ్మేళనాలు

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్ సమ్మేళనాల నిర్వహణకు సన్నాహాలు చేస్తుంది. రాష్ట్రంలోని 31 జిల్లాలో ఉన్న సర్పంచ్‌లకు మూడు దఫాలుగా సమ్మేళనాలను నిర్వహించాలని పంచాయతీరాజ్ శాఖ నిర్ణయించింది. మొదటి సమ్మేళనాన్ని ఈ నెల 23న మహబూబ్‌నగర్‌లో, 27న వరంగల్‌లో,చివరి సమావేశాన్ని మార్చి 5న నిజామాబాద్‌లో నిర్వహించనుంది. ప్రతి జిల్లా నుంచి వంద మంది చొప్పున సర్పంచ్‌లను ఆహ్వానించాలని, ఇందులో ఉత్తమ పంచాయతీలుగా గుర్తింపు పొందిన సర్పంచ్‌లతో వారి అనుభవాలను పంచుకునే విధంగా కార్యక్రమాలను రూపొందించింది. వందశాతం మరుగుదొడ్ల నిర్మాణం, పన్నుల వసూలు,ఎల్‌ఈడీ లైట్ల వినియోగం, నీటి సంరక్షణ, ఉపాధి హామీ లాంటి కార్యక్రమాల్లో ఎలాంటి ఉత్తమ ఫలితాలను సాధించారో వివరిస్తూ ఇతర సర్పంచ్‌లను ఆ దిశగా ప్రభావితం చేసేలా టీసీ పార్డ్ (పంచాయతీరాజ్ విభాగం)ఏర్పాట్లు చేస్తోంది. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఆయా జిల్లాల ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొంటారని అధికారులు తెలిపారు.

అధునాతన టెక్నాలజీతో ట్రైబల్ వర్సిటీ



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో అత్యంత అధునాతన వసతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తెలంగాణలో ట్రైబల్ యూనివర్సిటీ నెలకొల్పుతామని ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని అమర్‌కాంతక్‌లో ఇందిరాగాంధీ నేషనల్ ట్రైబల్ యూనివర్సిటీని సందర్శించిన ఆయన అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ట్రైబల్ వర్సిటీ ఏర్పాటులో, అభివృద్ధిలో తమ సహకరించాలని కోరారు. తెలంగాణలో విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొస్తున్నామని, పేద, మధ్యతరగతి వర్గాలకు ఉచితంగా నాణ్యమైన విద్య అందించేందుకు దేశంలోని ఎక్కడా లేని విధంగా గడచిన మూడేళ్లలో 540 గురుకులాలు ప్రారంభించామని తెలిపారు. అలాగే కెజిబివిలు, మోడల్ స్కూళ్లు, కళాశాలలను పూర్తి స్థాయిలో పటిష్టం చేశామని, యూనివర్సిటీలను బలోపేతం చేసేందుకు త్వరలోనే 1,551 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వర్సిటీలలో మౌలిక వసతుల కల్పనకు రూ.420 కోట్లు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో వర్సిటీ విసి టి.వి.కట్టిమణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి విద్య, వసతులపై వర్సిటీ సిబ్బంది, విద్యార్థులతో డిప్యూటీ సిఎం కడియం శ్రీహరి, ఎంపి సీతారాం నాయక్ చర్చించారు.

ఎసిబి వలలో పంచాయతీరాజ్ డిఇఇ



మన తెలంగాణ/చేర్యాల : సిద్దిపేట జిల్లా, చేర్యాల సబ్ డివిజన్ పంచాయతీరాజ్ డిఇఇ చంద్రప్రకాష్ కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటు ఎసిబికి దొరికిపోయాడు. ఎసిబి మెదక్ రేంజ్ డిఎస్పి ఆధ్వర్యంలో ఆ శాఖ ఎస్‌ఐలు గంగాధర్, మురళీమోహన్, విజయ్‌కుమార్ డిఇఇ ఇంటిలోనే గురువారం రెడ్‌హ్యాండ్‌గాపట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పి ప్రతాప్ మాట్లాడుతూ.. చేర్యాల పట్టణానికి చెందిన సివిల్ కాంట్రాక్టర్ ఎండి రహీం,తాను మద్దూర్ మండలం, నర్సాయెపల్లి మెయిన్ రోడ్డు నుంచి చేర్యాల గ్రామపంచాయతీ పరిధిలోని రోళ్లబండ వరకు చేస్తున్న రోడ్డు నిర్మాణపు పనులకుగాను డిఇఇ చంద్రప్రకాష్ రూ.లక్షాపదివేలు లంచం ఇవ్వాలని వేధిస్తున్నాడంటు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాము పథకం ప్రకారం పట్టుకున్నామని తెలిపారు. అందుకుగాను రహీం రూ .85 వేల నోట్లను డిఇఇ ఇంటిలోనే నేరుగా ఇస్తుండగా పట్టుకున్నామని, కేసును నమోదు చేసి అవినీతికి పాల్పడ్డ డిఇఇని హైదరాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టులో హాజరు పర్చనున్నట్టు డిఎస్పి ప్రతాప్‌కుమార్ తెలిపారు.

మంత్రుల్లోనే అవగాహన లేమి!

ఇప్పటి వరకు 8 జిల్లాలకే రైతు సమన్వయ సమితులు

మన తెలంగాణ/హైదరాబాద్ : జిల్లా రైతు సమన్వయ సమితులను సిఎం కె. చంద్రశేఖర్‌రావు చూసి ఓకె చేశాకే వాటికి ఆమోదం లభించనుంది. రాష్ట్ర రైతు సమన్వయ సమితి(రైతు కార్పొరేషన్)తో పాటు జిల్లా సమితులు బలంగా ఉంటేనే క్షేత్రస్థాయిలోని గ్రామ, మండల రైతు సమితులు పటిష్టంగా పనిచేస్తాయని, అందులో భాగంగానే సిఎం దృష్టికి వెళ్లాకే వీటికి ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు తెలిసింది. వాస్తవానికి ఈ నెల 15లోపు జిల్లా సమితులు ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ భావించింది. అయితే సంబంధిత జిల్లా ఇంచార్జి మంత్రులు మండల రైతు సమన్వయ సమితుల్లో నుంచి సభ్యులను ఎంపిక చేయడంతో తాత్సారం చేయడం ఆలస్యానికి కారణంగా తెలిసింది. కొంతమంది మంత్రులకు జిల్లా సమితిలో ఎంత మంది సభ్యులు ఉండాలో కూడా తెలియకపోవడం గమనార్హం. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 24 మంది ఉండాలి, అయితే ఒక మంత్రి 23 మంది పేర్లను మాత్రమే సూచించి ఇంతమంది చాలు అని చెప్పారని ఒక అధికారి 'మన తెలంగాణ'తో వాపోయారు. ఇప్పటి వరకు 8 జిల్లాల నుంచి మాత్రమే సభ్యుల జాబితా అందినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఇందులో సిరిసిల్ల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, ఖమ్మం, వికారాబాద్, నిర్మల్, మహబూబాబాద్ జిల్లాలు ఉన్నాయి. మండల సమితుల నుంచి సభ్యులను ఎంపిక చేస్తున్నందున వారికి మండలంలో పార్టీపై ఏ మేరకు పట్టు ఉంది, ఇంతకు ముందు ఏ పార్టీలో పనిచేశాడు వంటివి చూస్తున్నారు. ఈ క్రమంలో సభ్యుల ఎంపికపై ఆచితూచి వ్యవహరిస్తున్నారు. అలాగే ఎంఎల్‌ఎల నుంచి కూడా ఒత్తిడి వస్తుండటంతో జాబితాను సిద్ధం చేయడంతో మంత్రులు సతమతం అవుతున్నట్లు తెలిసింది.

కదం తొక్కిన ఎర్రజొన్న రైతులు

● పోలీసుల ఆంక్షలు బేఖాతర్
● ఆర్మూర్‌లో ఉద్రిక్త వాతావరణం



మన తెలంగాణ/ నిజామాబాద్‌బ్యూరో : ఆర్మూర్ ప్రాంత ఎర్రజొన్న రైతులు మద్దతు ధర కోసం పోలీసుల ఆంక్షలను కాదని ఆందోళన బాటపట్టారు. గురువారం ఉదయం 6 గంటల నుండే 144 సెక్షన్ అమలులో ఉన్నప్పటికీ ఆర్మూర్ నియోజక వర్గంలోని వివిధ గ్రామాల నుండి వేలాదిగా రైతులు ఆర్మూర్ పట్టణానికి చేరుకున్నారు. ఎర్రజొన్న, పసుపు పంటలకు మద్దతు ధర కల్పించాలని నినాదాలు చేస్తూ పోరుబాట పట్టారు. సుమారు 500 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, ఆర్మూర్‌కు చేరకుండా రైతులను అడ్డుకున్నప్పటికీ తాము ముందుగా ప్రకటించిన విధంగా రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో, ఎర్రజొన్న పంట సాగయ్యే 110 గ్రామాలకు చెందిన రైతులు ఆమరణ నిరాహార దీక్ష శిబిరానికి చేరుకున్నారు. 50 వేల ఎకరాల్లో పండుతున్న తమ పంటను సిండికేట్‌గా మారిన దళారీ సీడ్ వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నందున, మార్క్‌ఫెడ్, హాకా సంస్థల ద్వారా కొనుగోలు చేయాలని గత కొంతకాలంగా రైతులు చేస్తున్న డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని, ఆరోపిస్తూ రైతన్నలు ఉద్యమబాటపట్టారు. విత్తన వ్యాపారులు క్వింటాల్‌కు 1800 మించి కొనుగోలు చేయడం లేదని, దీంతో తమకు కనీస పెట్టుబడులు కూడా రావడం లేదని కనీస గిట్టుబాటు ధర ఎర్రజొన్నకు రూ.4500, పసుపుకు రూ.15వేలు చెల్లించాలని ప్రభుత్వా న్ని డిమాండ్ చేస్తున్నారు.

దీక్షలకు ప్రతిపక్షం మద్దతు

రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న రైతు ఆందోళన కార్యక్రమానికి కాంగ్రెస్, బిజెపి, వామపక్ష పార్టీలు, రైతు సంఘాల నేతలు మద్దతు ప్రకటించి ఆందోళనలో పాల్గొన్నారు. ఆర్మూర్‌లోని మామిడిపల్లి చౌరస్తాలో పోలీసు ఆంక్షల మధ్య ఎర్రజొన్న రైతులు అమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. నిరాహార దీక్షలో యువ రైతు మంథని నవీన్‌రెడ్డి బైఠాయించి నిరసన ప్రారంభించారు. ఆయనకు మద్దతుగా బాల్కొండ, ఆర్మూర్ ప్రాంత రైతులు నిజామాబాద్ జెఎసి నేతలు నిరాహార దీక్షలో పాల్గొన్నారు.

రూ.2300లు మాకు గిట్టుబాటు కాదు

మన తెలంగాణ/నిజామాబాద్: ప్రభుత్వం ఎర్రజొన్నలకు ప్రకటించినరూ.2,300 తమ ఏ మాత్రం గిట్టుబాటు కాదని, తాము డిమాండ్ చేస్తున్న క్వింటాలుకు రూ.4,500లు చెల్లించే వరకు తమ పోరాటం ఆపబోమని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ నేత, మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్ ధర్నా వేదిక నుంచి 'మన తెలంగాణ' ప్రతినిధితో ఫోన్‌లో మాట్లాడుతూ స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించిన రూ.2,300 లు తమకు ఏమాత్రం గిట్టుబాటు కాదని పేర్కొన్నారు. ఉద్యమకాలంలో రైతులకు ప్రత్యేకంగా నిధి ఏర్పాటు చేసి ప్రతి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పిన ముఖ్యమంత్రి కెసిఆర్ తమ ఉద్యమం పట్ల కనీసం సానుభూతి ప్రకటించక పోగా తమకు గిట్టుబాటు కాని ధరను ఇవ్వజూపుతున్నారని అన్నారు. పసుపు పంటకు కూడా వెంటనే ధర నిర్ణయించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఫారిన్ సర్వీస్ డాక్టర్లకు ఊరట

విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

మన తెలంగాణ /హైదరాబాద్: కుటుంబ, వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో నియామకమై వైద్య విధాన పరిషత్‌లో 'ఫారిన్ సర్వీసెస్' ప్రాతిపదికన సేవలను అందిస్తున్న వైద్యులను విలీనం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పదేళ్లకు పైబడి సేవలు అందిస్తున్న స్పెషలిస్టులతో పాటు కొత్తవారిని కూడా 2008 నాటి ఆర్డినెన్స్ ప్రకారం విలీనం చేస్తున్నట్లు ప్రభుత్వం గురువారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. 'ఫారిన్ సర్వీసెస్' పేరుతో పదేళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న ఈ వైద్యులు తాజా నిర్ణయంతో పదోన్నతులు పొందే అవకాశమేర్పడింది. వైద్య విధాన పరిషత్‌లో స్పెషలిస్టు డాక్టర్ల విలీనానికి 2000 సంవత్సరంలో జీవో విడుదలైనా సూపర్ స్పెషాలిటీ సేవలకు మాత్రం వర్తించలేదు. ఆ ప్రకారం 2008లో ఒకసారి స్పెషలిస్టు వైద్యుల విలీనం జరిగింది. ఆ తర్వాత వివిధ కారణాలతో నిలిచిపోయిన ఈ ప్రక్రియపై వైద్యుల నుంచి వచ్చిన విజ్ఞప్తిని దృష్టిలో పెట్టుకున్న మంత్రి లక్ష్మారెడ్డి చొరవ తీసుకుని సిఎంతో మాట్లాడి విలీనం చేసే నిర్ణయాన్ని తీసుకున్నారు. ఈ నిర్ణయం పట్ల తెలంగాణ డాక్టర్ల సంఘం సిఎం కెసిఆర్‌కు, మంత్రి లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది. ఇదో చారిత్రాత్మక నిర్ణయమని,విలీన నిర్ణయం వల్ల గ్రామీణ ప్రాంత పేదలకు స్పెషాలిటీ, సూపర్ స్పె షాలిటీ సేవలు అందుబాటులోకి వస్తాయనిసం ఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పల్లం ప్రవీణ్,ఉపాధ్యక్షులు డాక్టర్ నరహరి, కోశాధికారి డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్‌లు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ వైద్య, విధాన పరిషత్‌లో పనిచేస్తున్న డాక్టర్లకు ట్రెజరీ జీతాలతో పాటు హెల్త్ కార్డులను అందించాలని విజ్ఞప్తి చేశారు.

లాటరీ విధానంలో స్కూళ్లలో ప్రవేశాలు!

• ప్రైవేట్‌తోపాటు డిమాండ్ ఉన్న ప్రభుత్వ స్కూళ్లలో అమలు • పరిశీలిస్తున్న పాఠశాల విద్యాశాఖ



మనతెలంగాణ/హైదరాబాద్ : పాఠశాలల్లో లాటరీ విధానంలో ప్రవేశాలు చేపట్టే అంశాన్ని పాఠశాల విద్యాశాఖ పరిశీలిస్తోంది. ప్రైవేట్ స్కూళ్లతోపాటు డిమాండ్ ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఇదే విధానం ద్వారా ప్రవేశాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. డిమాండ్ ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో ప్రవేశాలకు అధిక సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నా సీట్ల కేటాయింపులో సరైన విధానం లేకపోవడంతో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలకు కోరుకున్న పాఠశాలల్లో సీట్లు పొందలేకపోతున్నారు. ఈ తరహా సమస్యలను అధిగమించేందుకు లాటరీ విధానం ప్రవేశపెట్టాలని విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.

ప్రవేశాల ప్రకటనను పట్టించుకోని యాజమాన్యాలు

రాష్ట్రంలో 11,737 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా, వాటిలో సుమారు 31 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వం నుంచి అడ్మిషన్ నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ప్రైవేట్ స్కూళ్ల ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించాలి. కానీ నోటిఫికేషన్‌తో సంబంధం లేకుండానే సుమారు ఆరు నెలల ముందుగానే యాజమాన్యాలు ప్రవేశాలు చేపడుతున్నాయి. షెడ్యూల్ వెలువడిన తర్వాత అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులు స్కూళ్లను సంప్రదిస్తే అప్పటికే సీట్లు భర్తీ అయ్యాయని చెబుతున్నారు.

ముందస్తు ప్రవేశాలు నిర్వహించవద్దని విద్యాశాఖ ఆదేశించినా యాజమాన్యాల వైఖరిలో అంతగా మార్పు రాలేదు. దాంతో విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి, అన్ని పాఠశాలలు లాటరీ విధానంలో సీట్లు కేటాయించేలా నిబంధనలు తీసుకురావాలని యోచిస్తున్నట్లు సమాచారం. అయితే ఒకే కుటుంబానికి చెందిన పిల్లలకు కూడా ఈ లాటరీ విధానాన్ని అమలు చేస్తే తమ పిల్లలకు ఒకే పాఠశాలలో సీటు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుందని తల్లిదండ్రులు, యాజమాన్యాలు అభ్యంతరం తెలిపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇలాంటి విషయాలకు మినహాంపు ఇచ్చి లాటరీ విధానం అమలు చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది.

"అభివృద్ధి చెందిన దేశాలో 2030 నాటికి ప్రతి 10మంది శ్రమజీవుల్లో 5గురు 65ఏళ్ల పైబడినవారే వుంటారని అంతర్జాతీయ కార్మికసంస్థ (ఐయల్ఓ) ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం వారు 10మందిలో 3.5శాతంగా ఉన్నారు."

అతిపెద్ద బ్యాంకింగ్ స్కాం

సంపాదకీయం

తమ ముంబయి బ్రాంచిలో రూ.11,346 కోట్లు దగా జరిగిందని కనుగొన్నట్లు పంజాబ్ నేషనల్ బ్యాంక్ చేసిన ప్రకటన దేశ ప్రజలను నివ్వెరపరిచింది. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఎస్‌బిఐ తర్వాత ఇదే అతిపెద్ద బ్యాంక్. బ్యాంకుల నిరర్థక ఆస్తులు(ఎన్‌పిఎలు–మొండిబాకీలు) రూ.10లక్షల కోట్లకు చేరి బ్యాంకింగ్ వ్యవస్థ దివాలా అంచుకు చేరిన దశలో ఈ కుంభకోణం మరింత దిగ్భ్రాంతికరం. వేలకోట్లకు పడగలెత్తిన వజ్రాలవ్యాపారి నీరవ్ మోడీ ప్రధాన నిందితుడు కాగా పిఎన్‌బి సీనియర్ అధికారులు కొందరికి కూడా ఇందులో పాత్ర ఉంది. దేశ, విదేశాల్లో వజ్రాభరణాల వ్యాపారం చేస్తున్న ఈ మోడీ కంపెనీలు పిఎన్‌బి బ్రాంచిలో కరెంట్ అక్కౌంట్లు మాత్రమే కలిగి ఉన్నాయి. అయితే ఆ కంపెనీల తరఫున లోపాయికారి పద్ధతుల్లో వారు లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (పూచీకత్తు పత్రం) సంపాదించారు. ఇది బ్యాంకులో డబ్బు జమచేయకుండా డిడి సంపాదించి దాని ఆధారంగా విదేశాల్లోని వివిధ బ్యాంకు బ్రాంచీలనుంచి నగదు తీసుకోవటం లాంటిది. ఆ లేఖ ఆధారంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అలహాబాద్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ విదేశీ బ్రాంచీలు నీరవ్ మోడీకి రుణాలు ఇచ్చాయట. ఆ పూచీకత్తు లేఖ ఇచ్చిన అధికారి రిటైర్మెంట్ తదుపరి అవే కంపెనీలు కొత్త పూచీకత్తు పత్రాలకై బ్యాంకును సంప్రదించినపుడు ఈ లోపాయికారి భాగోతం బయటపడింది. బ్యాంక్ అధికారుల ఫిర్యాదుపై సిబిఐ, ఇడి రంగంలో దిగాయి. పర్యవసానంగా నాలుగు ప్రసిద్ధ వజ్రవ్యాపార కంపెనీలు – గీతాంజలి, గిన్నీ, నక్షత్ర, నీరవ్‌మోడీ దర్యాప్తు ఎదుర్కొంటున్నట్లు చెప్పబడుతున్నది.

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో గత ఆరేళ్లుగా ఇటువంటి లోపాయికారి వ్యవహారాలు జరుగుతున్నాయట. అధికారులతో కుమ్మక్కుతో ఇలాంటి రుణం పొందినవారు సకాలంలో తిరిగి చెల్లిస్తుంటే ఆ భాగోతం మరుగున ఉంటుంది. అధికారులు వారి కమిషన్‌తో సంతోషపడుతుంటారు. నీరవ్ మోడీ తమ వంతు 10శాతం మార్జిన్ మనీ చెల్లించటంలో విఫలం కావటంతో ఈ కుంభకోణం వెలుగుచూసింది. ఇది అతనిపై 10 రోజుల్లో రెండవ కేసు. 2017లో రూ.280కోట్ల 70లక్షలకు మరో పిఎన్‌బి బ్రాంచిని దగా చేసిన కేసును సిబిఐ దర్యాప్తు చేస్తోంది. మరో ప్రభుత్వరంగ బ్యాంక్ –బ్యాంక్ ఆఫ్ బరోడా ఇద్దరు ఢిల్లీ వ్యాపారులు తమ బ్యాంకును రూ.6వేలకోట్లకు దగాచేసిన కేసును 2015లో వెలుగులోకి తెచ్చింది. దిగుమతులకు ముందుగా చెల్లింపుల నిమిత్తం వ్యాపారులు, బ్యాంక్ అధికారుల కుమ్మక్కుతో ఇటువంటి విదేశీ మారక ద్రవ్య లావాదేవీలు జరుగుతుంటాయట! 2.3 బిలియన్ డాలర్లతో ఫైర్‌స్టార్ డైమండ్ కంపెనీ వ్యవస్థాపకుడైన నీరవ్‌మోడీ మూడు ఖండాల్లో – లండన్, న్యూయార్క్, లాస్‌వెగాస్, హవాయి, సింగపూర్, బీజింగ్, మకావ్, భారత్‌లో ముంబయి, ఢిల్లీలో దుకాణాలు నడుపుతున్నాడు. తాజా దగాకోరు వ్యవహారం బయటపడ్డాక, రూ.5వేలు కోట్లు చెల్లించటానికి సిద్ధంగా ఉన్నానని మోడీ చెప్పినట్లు వార్తలొచ్చాయి.

2017 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.230కోట్ల 11లక్షల లాభం ప్రకటించిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఈ మోసకారి భాగోతం బయటపడటంతో నష్టాల్లోకి జారుకుంటుంది. పిఎన్‌బితోపాటు ఇండియన్ బ్యాంక్, కెనరాబ్యాంక్, బరోడా, విజయా బ్యాంకులు మాత్రమే ఎంతో కొంత లాభం ప్రకటించాయి. ఎస్‌బిఐ సహా మిగతా 16ప్రభుత్వ రంగ బ్యాంకులు మొత్తంమీద రూ.18,947కోట్ల 59లక్షల నష్టం ప్రకటించాయి. ట్రెజరీ ఆపరేషన్స్ నుంచి ఈసారి లాభాలు రాకపోవటం ఇందుకొక కారణంకాగా, మొండి బాకీల రద్దు కొరకు అధిక కేటాయింపు ప్రధాన కారణం.

కింగ్‌ఫిషర్ అధినేత విజయమాల్యాకు ఎస్‌బిఐ నాయకత్వంలో బ్యాంకుల కన్సార్టియం రూ.9వేల కోట్ల రుణమిచ్చిన కేసుకు ఈ వజ్రాల వ్యాపారి కేసు పూర్తిగా భిన్నమైంది. అది ప్రత్యక్ష రుణం కాగా ఇది లోపాయికారి భాగోతం. బ్యాంకుల నిర్వహణను కట్టుదిట్టం చేసేందుకు ఎన్ని వ్యూహాలు అమలు జరుపుతున్నా ఇటువంటి మోసాలు జరుగుతున్నాయంటే లొసుగులు ఇంకా చాలానే ఉన్నాయని విదితమవుతున్నది. బ్యాంకర్ల ప్రతాపమంతా సామాన్యులపైనే. కార్పొరేట్లు ఎగనామం పెడుతున్న లక్షల కోట్ల భారం మోయవలసిందీ పన్ను చెల్లింపుదారులే!

బసవ ఓటుపై కాంగ్రెస్ ఆశలు


చూపు

త్వరలో ఎన్నికలు జరుగనున్న కర్నాటకలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఇటీవల అనేక ప్రార్థనా మందిరాలను సందర్శించారు. అయితే అన్నిటికంటె లింగాయత్ వర్గానికి చెందిన మఠాల సందర్శన ఎక్కువగా సంచలనం రేపింది. ఆ వర్గం వారిని హిందువులుగా పరిగణించే ఆచారం ఎప్పటినుంచో ఉంది. అయితే ఆ వర్గంలో కొందరు 12వ శతాబ్దానికి చెందిన సంఘ సంస్కర్త బసవన్న నెలకొల్పిన మతాన్ని తాము అనుసరిస్తున్నట్లు చెప్పుకొంటారు. అది హిందూమతానికి సంబంధం లేనిదని, ఆ మతానికి విరుద్ధమైనదని కూడా వారు అంటారు. ఈ విషయంపై చర్చలలో పాల్గొన్న మేధావులు మాత్రమే తమది స్వతంత్ర మతంగా గుర్తించాలని గతంలో డిమాండ్ చేసేవారు. కానీ గత ఏడాది ఆ అంశాన్ని అనేక బహిరంగ సభలలో లేవనెత్తడం జరిగాక అది రాజకీయ ప్రాముఖ్యాన్ని సంతరించుకొంది.

ఆ సభలకు పెద్ద సంఖ్యలో జనం హాజరయ్యారు. కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య లింగాయత్ వర్గం డిమాండ్‌ను కేంద్రం దృష్టికి తెస్తానని హామీ ఇచ్చారు. ఇది రాజకీయంగా పెద్ద ఎత్తుగడగా చాలా మంది రాజకీయ పరిశీలకులు భావించారు. లింగాయత్‌లు భారతీయ జనతా పార్టీ మద్దతుదార్లుగా పేరుబడ్డారు. ప్రత్యేక మతంగా గుర్తించాలన్న వారి డిమాండ్‌ను బలపరచడం ద్వారా కాంగ్రెస్ పార్టీ ఆ వర్గం వారి ఓట్లను తన్నుకుపోవచ్చని ఊహాగానాలు వ్యాపిస్తున్నాయి. రాహుల్ ఇటీవల లింగాయత్‌ల మఠాలను, ఆశ్రమాలను సందర్శించడం కూడా ఈ వ్యూహంలో భాగమని భావిస్తున్నారు. తమను తాము లింగాత్‌లుగా భావించుకొనే జనంలో వైరుధ్యాలని అటువంటి ఊహాగానాలు విస్మరిస్తున్నాయి. లింగాయత్‌లలో కూలీనాలీ జనాన్ని హిందువులు కాదని ఒప్పించడం లోని సంక్లిష్టతను కూడా వారు గుర్తించడం లేదు.

ఉత్తర కర్నాటకలోని ధార్వాడ్ జిల్లా కిరాసూర్ గ్రామానికి చెందిన ఒక లింగాయత్ (పేరు చంద్ర శేఖర్ బసవరాజ్ హెబ్బల్)ను 'ఏ మతానికి చెందుతారు మీరు' అని అడుగగా 'నేను హిందూ లింగాయత్‌ను' అని జవాబు వచ్చింది. తమది వేరే మతంగా గుర్తించాలని ఆందోళన సాగుతున్న విషయం అతనికి తెలియదు. పొరుగున ఉన్న గడగ్ జిల్లాలో మరో లింగాయత్ కుటుంబాన్ని ప్రశ్నిస్తే ఇదే మాదిరిగా జవాబులు వచ్చాయి. లింగాయత్‌లు హిందువులు కారా అని అడుగగా, ఆ కుటుంబ సభ్యులు లింగాయత్‌ల పూజనీయుడు బసవ పటం పక్కన హిందూ దేవతలు విఠల్, రుక్మిణి చిత్రపటాలను చూపించారు. తమ మతం అపమార్గం పట్టడానికి హిందూ లాంఛనాలను పాటించడం నిదర్శనమని హుబ్బలి– ధార్వాడ్ నగరంలో లింగాయత్ పండితుల బృందం ఒకటి భావిస్తోంది. అక్కడ ఆ వర్గంవారు అధికంగా నివసిస్తున్నారు.

తాము బసవ వచనాలు లేదా శ్లోకాల పునరుద్ధరణ కృషి సాగిస్తున్నామని వారు తెలిపారు. బసవ కేంద్ర పేరుతో 1999లో ఇందుకు ఒక కేంద్రాన్నివారు నెలకొల్పారు. ఆ కేంద్రంలో ప్రతి ఆదివారం సమావేశాలు జరుగుతాయి. ఈ సమావేశాలకు ఆతిథ్యం ఇచ్చేవారు దొరకడం కొత్తలో కష్టంగా ఉండేది. ఇప్పుడు అది తొలగినట్లు గోకుల్ రోడ్‌లోని బసవ కేంద్ర అధ్యక్షులు బివి షిరూర్ చెప్పారు. లింగాయత్‌లలో చాలా మంది గ్రామీణ ప్రాంతాల లో నివసిస్తున్నారు. వారిని హిందువులం కాదని ఒప్పించడం ఎంతో కష్టంగా ఉన్నట్లు ఆ వర్గం నేతలు చెప్పారు. గ్రామాలలోనివారు ఆలయాలను సందర్శించి. విగ్రహారాధన ఆచరిస్తారు. 'మనం హిందూస్థాన్‌లో నివసిస్తున్నందు వల్లే హిందువులం తప్ప మన మతం హిందూ కాదు– మనం లింగయత్‌లం' అని చెబితే వారు వినటంలేదు అని నేతలు వాపోయారు.



లింగాయత్‌లలో అధిక శాతం మంది తాము హిందువులుగానే భావిస్తున్నప్పుడు ప్రత్యేక మతంగా గుర్తించాలని కోరుతూ గత ఏడాది జరిగిన బహిరంగ సభలకు ఆ వర్గం వారు ఎక్కువగా హాజరవడం వెనుక కారణం ఏమిటి అన్నది పరిశీలకులను ఆలోచింపచేస్తోంది. లింగాయత్‌లను ఆధ్యాత్మిక, సామాజిక సంస్కరణ దృష్టితో కాకుండా అంతకుమించిన ప్రయోజనాల కోసం సమీకరిస్తున్నామని ఆ జనాలను సభలకు ప్రేరేపించిన లింగాయత్ నాయకులు చెబుతున్నారు. లింగాయత్ లకు మైనారిటీ హోదాతో వేరే మతంగా గుర్తింపు లభిస్తే రిజర్వేషన్ల విషయంలో జరుగుతున్న అన్యాయం తొలగిపోతుందని ఆ వర్గం నాయకులు అంటున్నారు. అదే జరిగితే లింగాయత్‌లు నడుపుతున్న విద్యాసంస్థలలో రిజర్వేషన్ల కోటాను పాటించకుండా అధికంగా సీట్లను లింగాయత్ విద్యార్థులకే కేటాయించవచ్చు. 2013లో అన్ని పార్టీలకు చెందిన లింగాయత్ రాజకీయవాదులు కేంద్రానికి ఒక అర్జీ పెట్టుకున్నారు. తమను ప్రత్యేక మతస్థులుగా గుర్తించాలన్నది ఆ అర్జీ. ఈ పిటిషన్ కేవలం కర్నాటక లింగాయత్‌లే కాకుండా ఇరుగుపొరుగు రాష్ట్రాల నుంచి కూడా ఆ వర్గంవారు పెట్టుకున్నారు. ఆ అర్జీపై మాజీ ముఖ్యమంత్రి, బిజెపి నాయకుడు బి.ఎస్.ఎడ్యూరప్ప కూడా సంతకం చేశారు. లింగాయత్‌లను ప్రత్యేక మతస్తులుగా గుర్తించాలన్న ఆందోళనను ముందుండి నడుపుతున్నవారిలో జనతాదళ్(ఎస్)కు చెందిన బసవ రాజు కురాట్టీ ముఖ్యులు.

1940లోనే లింగాయత్‌లను స్వతంత్ర మతస్థులుగా గుర్తించాలన్న డిమాండ్ మొదలైంది. అయితే అప్పట్లో ఆ ఉద్యమం ఫలించలేదు. అఖిల భారత వీరశైవ మహాసభ బ్యానర్‌కింద సాగడంతో ఆ ఉద్యమం విఫలమైందని బసవకేంద్ర నాయకులు చెప్పారు. లింగాయత్, వీరశైవ పదాలను ఒకదానికొకటి బదులుగా వాడే సాంప్రదాయం ఉంది. అయితే ఆ రెండింటిమధ్య ఎంతో భేదం ఉంది. వీరశైవులు ఆంధ్రప్రదేశ్‌కి చెందిన ఉపకులస్తులు కాగా లింగాయత్‌లు ప్రత్యేక మతంవారని, వారి పూజ్య గురువు బసవ అని చర్చోపచర్చలు ఎన్నో జరిగాయి. అయితే ఆంధ్రాకి చెందిన వీరశైవులు లింగాయత్‌లకు అనుయాయులుగా మారడంతో రెండింటిమధ్య భేదం లేదని అభిప్రాయం బలపడింది. పంచాచార్య సన్యాసులు అనే మరో తెగ ఉంది. వారు ఐదుగురని వీరశైవులు చెబుతారు. ఏడాది నుండి ఈ చర్చలు మరింత తీవ్రత సంతరించుకున్నాయి. ఈ వాదనల్లోని ఆధ్యాత్మికత, సాంస్కృతిక, రాజకీయ దృక్పథాలను వివరించే వ్యాసాలు పుంఖానుపుంఖాలుగా స్థానిక కన్నడ వార్తా పత్రికలలో వస్తున్నాయి. ఇంత మీమాంస ఈ అంశంపై సాగుతున్నా భారతీయ జనతాపార్టీ(బిజెపి) మౌనం వహించింది. ఒక లింగాయత్ ఎంఎల్‌ఏ తాను ర్యాలీలకు హాజరు కావటం లేదని చెప్పారు. చాలామంది బిజెపి నాయకులు ఈ అంశాన్ని దాటవేస్తున్నారు. ప్రత్యేక మతస్థులుగా లింగాయత్‌లను గుర్తించాలని డిమాండ్ చేస్తున్నవారిని వదులుకోవడం ఆ పార్టీకి ఇష్టంలేక మౌనం పాటిస్తోంది. ప్రస్తుతానికి బిజెపి ముఖ్యమంత్రి అభ్యర్థి ఎడ్యూరప్ప క్షేమకరమైన వైఖరిని ప్రకటించారు. తాను వీరశైవులు, లింగాయత్‌లు ఒకరే అన్న అఖిలభారత వీరశైవ మహాసభ అభిప్రాయాన్ని మన్నిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కాంగ్రెస్ మంత్రి ఎంబి పాటిల్ మహాసభ అభిప్రాయాన్ని సవాలు చేశారు.

* సుప్రియ శర్మ

కాశ్మీర్ నెహ్రూ మానస పుత్రిక !



అహ్మద్ మొహియుద్దీన్ ఖాన్ యజ్దానీ(డానీ)
(సీనియర్ పాత్రికేయులు, సమాజ విశ్లేషకులు)
9010757776

పట్టించుకోవాల్సిన కీలక విషయాలను మనం తరచుగా పట్టించుకోము; పట్టించుకోవాల్సిన అవసరం(అంతగా)లేని అంశాలను మాత్రం చాలా తీవ్రంగా పట్టించుకుంటాము. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఫిబ్రవరి 7న రాజ్యసభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తున్నపుడు కాంగ్రెస్ సభ్యురాలు రేణుకా చౌదరి గట్టిగా నవ్వడం మీద చాలా పెద్ద చర్చ జరిగింది. ఈ వ్యవహారం సభా హక్కుల తీర్మానం వరకు వెళ్ళింది.

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014లోని హామీల అమలుకు నిధుల కేటాయింపు కోరుతూ తెలుగుదేశం, వైయస్ఆర్‌సిపి సభ్యులు ఉభయసభల్లో విభిన్న పద్ధతుల్లో నిరసన తెలుపుతున్న సందర్భం అది. వాళ్ల నిరసనకు కాంగ్రెస్, టిఆర్ఎస్ కూడా మద్దతు పలుకుతున్న సమయం అది. ఆ రోజు కేంద్రప్రభుత్వం ఎపి కి ప్రత్యేక నిధులు, ప్యాకేజీలు ప్రకటిస్తుందని ఎదురుచూస్తుండగా ప్రధాని మైకు అందుకున్నారు. వారు తన ప్రసంగంలో అనేకానేక అంశాలను ప్రస్తావించారు; ఎపికి కొత్తగా నిధుల కేటాయింపు గురించి తప్ప!

రేణుకా చౌదరి నవ్వుకు కారణమైన ఆధార్ కార్డ్ ప్రస్తావనకన్నా ఎన్నో రెట్లు కీలకమైన అంశాలు ఆ రోజు ప్రధాని ప్రసంగంలో వున్నాయి. బుద్ధుని దమ్మపథం, బసవేశ్వరుని అనుభవ మంటపం, దేశవిభజన, కాశ్మీర్, పాకిస్థాన్, నెహ్రూ, పటేల్ వగైరాలు అందులో వున్నాయి. గాంధీజీ, అంబేడ్కర్, భారత రాజ్యాంగాల ప్రస్తావన నేరుగా లేకపోయినా వాటి మీద కూడా ప్రధాని ప్రసంగంలో పరోక్ష వ్యాఖ్యలున్నాయి. ఇప్పుడు ఆలోచనాపరులు చర్చించాల్సింది వాటి గురించి.

సర్దార్ వల్లభ్ భాయి పటేల్ భారత తొలి ప్రధాని అయ్యుంటే కాశ్మీరానికి చెందిన ఆ భాగం ఈ రోజు పాకిస్తాన్ చేతుల్లో వుండేదికాదు అని స్వతంత్ర భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ మీద మోదీజీ ఒక తీవ్ర వ్యాఖ్యానం చేశారు. కాశ్మీరానికి చెందిన మొత్తం భూభాగం భారత్ చేతుల్లో వుండేదని దాని అర్థం.

భారతదేశానికి దక్షిణాన కన్యాకుమారి, ఉత్తరాన కాశ్మీరం సరిహద్దులు అని పాఠాలు చదువుకుని ఉత్తేజితులైన వారికి మోదీజీ ఉపన్యాసం మరింత ఉత్సాహాన్ని ఇచ్చివుండవచ్చు. మోదీజీ లక్ష్యం కూడా అలాంటి సమూహాలను ఉత్తేజ పరచడమే. అయితే, చారిత్రక వాస్తవ సంఘటనలు ప్రభుత్వాలు సిలబస్‌గా పెట్టే పాఠ్యాంశాలకు అనువుగా వుండవు. బ్రిటీష్ వాడు పోతూపోతూ భారత ఉపఖండాన్ని భారత్, పాకిస్తాన్ అనే రెండు దేశాలుగా విడగొట్టి రెండింటి మధ్య చిచ్చుపెట్టి వెళ్ళాడనేది ఇప్పటికీ చాలామంది నమ్మే విషయం. నిజానికి భారత స్వాతంత్ర్య చట్టం1947 ద్వారా భారత ఉపఖండంలో బ్రిటీష్ ప్రత్యక్ష పాలనలోవున్న ప్రాంతానికేగాక, పరోక్ష పాలనలోవున్న దాదాపు 570 సంస్థానాలకు సహితం స్వాతంత్ర్యం లభించింది. ఈ సంస్థానాలు స్వతంత్ర దేశాలుగా కొనసాగడానికో, ఇండియాలోనో, పాకిస్తాన్ లోనో విలీనం కావడానికో మూడు రకాల అవకాశాల్ని ఈ చట్టంలో కల్పించారు. ఇవికాక, ఉపఖండంలో పోర్చుగీస్, ఫ్రెంచ్ కాలనీలు కూడా కొనసాగుతున్నాయి.

లేబర్ పార్టీకి చెందిన ప్రధాని క్లెమెంట్ అట్లీ ప్రభుత్వం 1947 ఫిబ్రవరి 20న భారత స్వాతంత్ర్య చట్టాన్ని చేసింది. ఆగస్ట్ 15ను అప్పాయింటెడ్ డేట్ గా నిర్ణయించారు.దీని మీద జులై 18న రాజముద్ర పడింది. ఆ రోజు నుండే సంస్థానాలకు స్వాతంత్రం దక్కింది. దాదాపు అన్ని సంస్థానాలూ భారత్‌లో విలీనం కావడానికి అంగీకరించాయి. నిజాం, జునాగడ్, కాశ్మీర్ సంస్థానాలు మాత్రం స్వతంత్రంగా కొనసాగడానికో, పాకిస్తాన్‌లో విలీనం కావడానికో మొగ్గు చూపాయి. నిజాం, జునాగడ్ సంస్థానాలకు పాకిస్తాన్‌తో వాయు, జల మార్గాలు మాత్రమే వున్నాయి. కాశ్మీర్‌కు ఏకంగా భూమార్గమే వుంది.

డోగ్రా వంశానికి చెందిన హిందూ రాజపుత్రుడైన హరిసింగ్ అప్పుడు కాశ్మీర్ రాజుగా వున్నాడు. ప్రజల్లో అత్యధిక ప్రజాదరణ కలిగిన నాయకుడైన షేక్ అబ్దుల్లా ప్రచారం చేస్తున్న సోషలిస్టు భావాల్ని చూసి హరిసింగ్ భయపడ్డాడు. స్వతంత్ర భారత తొలి ప్రధాని కాబోతున్న జవహర్‌లాల్ నెహ్రూవి కూడా సోషలిస్టు భావాలే. పైగా నెహ్రూకు షేక్ అబ్దుల్లా అత్యంత సన్నిహిత మిత్రుడు. నిజాం సంస్థానంలో నవాబు ముస్లిం. భారత ప్రజల్లో అత్యధికులు హిందువులు అయినట్టు, కాశ్మీరంలో రాజు హిందువు ప్రజల్లో అత్యధికులు ముస్లింలు. అయినప్పటికీ హరిసింగ్ పాకిస్తాన్ వైపే ముగ్గు చూపడం విశేషం. ఇద్దరు సోషలిస్టులు ఏకమైతే తన రాజరిక అధికారం సాగదని భావించిన హరిసింగ్ ఇండియాకన్నా పాకిస్తానే తనకు మేలైన మిత్రుడని భావించాడు. ఆ దేశానికి ప్రధాని కాబోతున్న లియాఖత్ అలీఖాన్‌తో తొలి విడత చర్చలు కూడా జరిపాడు.

సంస్థానాలన్నింటినీ ఇండియన్ యూనియన్‌లో విలీనం చేయడంలో కీలక పాత్ర పోషించిన తొలి హోంమంత్రి వల్లభ్ భాయి పటేల్‌కు కాశ్మీర్ సంస్థానం మీద అంతగా ఆసక్తి వుండేదికాదు. నిజాం, జునాగఢ్ సంస్థానాలు భారత్‌లో విలీనం అయితే కాశ్మీర్‌ను పాకిస్తాన్ లో విలీనం చేసినా ఇబ్బందేమీ కాదనే అభిప్రాయంతో పటేల్ వుండేవారు. భారత చివరి గవర్నర్ జనరల్ మౌంట్ బాటెన్ 1947 జూన్ నెలలో ఆరు రోజులు కాశ్మీర్‌లో పర్యటించాడు. ఆ సందర్భంగా కాశ్మీరం పాకిస్తాన్ లో విలీనం అయినా భారత్ దాన్ని మైత్రిభంగంగా చూడదని హరిసింగ్‌తో అన్నట్టు ప్రత్యక్ష సాక్షులున్నారు. ఈ విషయంలో పటేల్ తనకు గట్టి హామీ కూడా ఇచ్చారని మౌంట్ బాటెన్ అన్నాడట. అప్పట్లో పటేల్ భారత త్రివిధ దళాల అధిపతిగా కూడా వున్నారు. మరోవైపు, లియాఖత్ అలీ ఖాన్‌కు కూడా ఎందువల్లనో కాశ్మీర్ విషయం మనసుకు ఎక్కలేదు.

మన జాతీయోద్యమ నాయకులందరూ వలసవాద యుగంలో రాజకీయార్థిక శిక్షణ పొందినవారు. అంచేత వాళ్లలో సహజంగానే వలస దృక్పథం వుంటుంది. వలసలకు ఆర్థిక ప్రయోజనమే ప్రాథమికం. వల్లభ్ భాయి పటేల్, లియాఖత్ అలీ ఖాన్‌లకు కాశ్మీరంలో అలాంటి ఆర్థిక ప్రయోజనం ఏదీ కనిపించలేదు. కాశ్మీరంలో ఖనిజాలు, ఇతర వనరులు లేవు. జమ్మూ, కాశ్మీర్ లోయ తప్ప మిగిలిన ప్రాంతాలు జనావాసానికి కూడా అనువైనవికావు. ఇంతటి జనాభా పెరిగిన తరువాత కూడా ప్రస్తుతం లడాఖ్ ప్రాంతంలో జనసాంద్రత చదరపు కిలోమీటరుకు ముగ్గురు మాత్రమే. అప్పుడు అదికూడా లేదు. అంచేత వాళ్ళిద్దరి చూపు బంగారు గనులులాంటి హైదరాబాద్, జునాగఢ్ మీదే వుంది.

కాశ్మీరం విషయంలో పటేల్ నిరాసక్తంగా వుండడం మీద గాంధీజీకి అసంతృప్తిగా వుండేది. కాశ్మీరాన్ని భారత్‌లో కలుపుకోవాలనేది గాంధీజీ కోరిక. ముస్లింలు అత్యధికులుగా వున్న సంస్థానం భారత్‌లో చేరితే మత ప్రాతిపదిక మీద దేశవిభజన జరిగిందనే నిందను కొట్టిపడేయడానికి వీలుంటుందని మహాత్ముడు ఆశించేవారు. నిజానికి కాశ్మీర్‌ను నయాన్నో భయాన్నో భారతదేశంలో విలీనం చేసుకోవాలని గట్టిగా భావించిన నేత నెహ్రూ ఒక్కరే. కాశ్మీర్ మీద నెహ్రూది కూడా వలస దృక్పథమేగానీ అది ఆర్థిక వలస దృక్పథంకాదు. ఆయనది సాంస్కృతిక వలస దృక్పథం. (మీరు విన్నది నిజమే!. సాంస్కృతిక వలస పాలన అనేది కూడా ఒకటుంటుంది) కాశ్మీరాన్ని నెహ్రూ భారతదేశ పటానికి కిరీటంగా భావించేవారు. అలా అనుకోవడానికి వారికి బలమైన వ్యక్తిగత కారణం వుంది. నెహ్రూ పూర్వీకులు కాశ్మీర్ పండితులు. కాశ్మీరం భారతదేశపటానికి కిరీటం అయితే, భారత ప్రభుత్వ కిరీటం కాశ్మీర్ పండిట్ తల మీద వుంటుందని వారు కవితాత్మకంగా పరవశించేవారు. అందుకే ప్రత్యేక పతిపత్తి, జనాభిప్రాయ సేకరణ వంటి అనేక హామీలను ఇచ్చి అయినా సరే కాశ్మీరాన్ని విలీనం చేసుకోవడానికి నెహ్రూ సిద్ధపడ్డారు. దానికి షేక్ అబ్దుల్లా సహకారమూ, మహాత్ముని ఆశీస్సులూ గట్టిగా వున్నాయి.

పాకిస్తాన్ నిజాం, జునాగఢ్‌లను కలుపుకోవడానికి పావులు కదపడంతో చిరాకెత్తిన పటేల్ కాశ్మీర్‌ను కూడా పాకిస్తాన్‌కు దక్కనివ్వకూడదనుకోవడం ఆ తరువాతి పరిణామం. అప్పటికే కాశ్మీర్ పశ్చిమభాగం(ఆజాద్ కాశ్మీర్), ఉత్తరభాగం (గిల్గిట్ బాల్టిస్తాన్) పాకిస్తాన్ ఆధీనంలోనికి, తూర్పున ఆక్సాయి చిన్, షాక్స్ గమ్ లోయ (ట్రాన్స్ కారాకోరమ్ ట్రాక్) చైనా ఆధీనంలోనికి వెళ్ళిపోయాయి. ఈలోగా ఐక్యరాజ్య సమితి రంగప్రవేశం చేసి వివాదాస్పద ప్రాంతంగా ప్రకటింపచేసింది. కాశ్మీర్ లోయ, జమ్మూ ప్రాంతం, లడఖ్, సియాచిన్ హిమనీనదం మాత్రమే సాంకేతికంగా భారతదేశంలో విలీనం అయ్యాయి. నెహ్రూ నిర్వహిస్తానన్న ప్రజాభిప్రాయ సేకరణ తరువాతి కాలంలో గాలికి కొట్టుకుపోవడంతో కాశ్మీర్ లోయలో స్వయం నిర్ణయాధికార పోరు తలెత్తింది. గాంధీజీ పటేల్ ఇద్దరూ గుజరాత్‌కు చెందిన వారే. కాంగ్రెస్‌లో పటేల్‌కు ఎంత బలం వుంది? నెహ్రూకు ఎంత బలం వుంది? అన్నది ప్రశ్నే కాదు. ఆ రోజుల్లో గాంధీజీ అభిప్రాయం ఏమిటి అన్నదే ముఖ్యం. పటేల్‌ను పక్కన పెట్టి గాంధీజీ నెహ్రూను ఎందుకు ప్రధానమంత్రిని చేశారన్నది చర్చిస్తే బాగుంటుంది. మోదీజీ గాంధీజీ పాత్రను వదిలిపెట్టి నెహ్రూ మీద దండయాత్ర చేయాలనుకోవడం కేవలం రాజకీయం. నెహ్రూ ప్రజాస్వామికవాదిగా, లౌకికవాదిగా, సామ్యవాదిగా ప్రసిద్ధి చెందారు. అదంతా బూటకపు ప్రచారమని చెప్పడానికి కాశ్మీరే చాలా పెద్ద ఉదాహరణ. నెహ్రూను విమర్శించాలనుకుంటే కాశ్మీర్ ప్రజలకు జరిగిన అన్యాయాన్ని మోదీజీ ఉటంకిస్తే బాగుండేది. వారు అలా చేయలేదు. నెహ్రూకన్నా ముందే భారత సమాజంలో ప్రజాస్వామిక సాంప్రదాయాలు వున్నాయని చెప్పడానికి ప్రయత్నించారు. ఈ సందర్భంగా బుద్ధుని ధర్మపథాన్నీ, బసవేశ్వరుని అనుభవ మంటపాన్నీ ఉదహరించారు. రాజ్యాంగం ద్వారా ప్రభుత్వ పాలన ప్రజాస్వామికంగా మారిందనే అభిప్రాయాన్ని కూడా మోదీజీ తప్పుపట్టదలిచారని పిస్తోంది. ఆ విధంగా వారి విమర్శ నెహ్రూకే పరిమితం కాదు; అంబేద్కర్‌కు కూడా వర్తిస్తుంది.

కేరళలో అవినీతిపై నేతిబీర నిఘా!

కేరళలో పినారయి విజయన్ సారథ్యంలోని వామపక్ష ఫ్రంట్ ప్రభుత్వం ప్రజాజీవితంలోంచి అవినీతిని తరిమేస్తామన్న హామీతో అధికారంలోకి వచ్చింది. ఈ కృషిలో భాగంగా నిఘా విభాగాన్ని, అవినీతి నిరోధక బ్యూరోను పటిష్ఠ పరుస్తామని కూడా మాట ఇచ్చింది. ఇప్పుడు ఆ ప్రభుత్వ రెండేళ్ల పాలన ముగిసినా, ఆ హామీ కార్యరూపం దాల్చకుండా వట్టి హామీగానే మిగిలింది. అంతకంటే దారుణంగా ప్రభుత్వం ఇప్పుడు నిఘా విభాగాన్ని బలహీన పరచాలని చూస్తోంది. పూర్తిగా దాని కోరలు పీకాలని ప్రయత్నిస్తోంది. దానికి కొత్తగా అధిపతిని నియమించింది. ప్రజలనుంచీ, రాజకీయ పార్టీలనుంచీ తీవ్రంగా వచ్చిన ఒత్తిడి తరువాతే ఈ నిర్ణయం తీసుకొన్నారు. కాబట్టి ఇది చిత్తశుద్ధితో తీసుకొన్ననిర్ణయం కాదు అని తెలుస్తోంది.

మరో కీలక సంస్థ నిఘా– అవినీతి బ్యూరో (విఎసిపి)కి తాత్కాలిక డైరెక్టర్‌ను నియమించారు. పైగా ఈ సంస్థ బాధ్యతలను రాష్ట్ర పోలీస్ అధిపతి లోక్‌నాథ్ బెహరా నిర్వహిస్తున్న తీరుకు ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం తెలిపాయి. పోలీసు అధిపతిగా ఉన్న వ్యక్తికి కీలక సంస్థ అదనపు బాధ్యతలు అప్పగించడం తగదని వారు విమర్శిస్తున్నారు. నిఘా–అవినీతినిరోధక బ్యూరోకు తరచూ వచ్చేవి పోలీసుల అవినీతికి సంబంధించిన కేసులే అయినపుడు పోలీసుబాస్‌కి తాత్కాలిక డైరెక్టర్ బాధ్యతలు అప్పగించడంలోని ఔచిత్యాన్ని వారు ప్రశ్నిస్తున్నారు. ఒక క్యాడర్ అధికారి శాశ్వతంగా రెండు పదవులను నిర్వహించడాన్ని అఖిల భారత సర్వీసు నిబంధనలు నిషేధించాయి. ఇది చాలదన్నట్లు, చట్ట ప్రకారం కేంద్రం అనుమతిని రాష్ట్రం తీసుకోవలసి వుండగా ఈ విషయంలో అలా జరగలేదు.

కేంద్రం అనుమతి పొందకుండానే నిఘా– అవినీతి నిరోధక బ్యూరో అదనపు బాధ్యతను బెహరాకు అప్పగించారు. ఆ బ్యూరోకు పూర్తి స్థాయి అధిపతిని నియమించనందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని కేరళ హైకోర్టు కూడా ఇటీవల తీవ్రంగా విమర్శించింది. నిఘా శాఖ అధిపతి ఉద్యోగానికి డిజిపి క్యాడర్ హోదాను తొలగించాలని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం నిర్ణయించడం మరో విడ్డూరం. ఈ చర్యకు ఐపిఎస్ అధికారుల నుంచి తీవ్ర విమర్శలు ఎదురయ్యాయి. రాజకీయ అవినీతికి సంబంధించిన అన్ని కీలక కేసుల దర్యాప్తులపై నీళ్లు జల్లే ప్రయత్నమే ఇదని చెప్పకతప్పదు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తికి కేంద్రం తలూపుతుందో లేదో చూడాల్సి ఉంది. ప్రస్తుతం న్యూఢిల్లీలోని కేరళ హౌస్‌లో ఓఎస్‌డిగా పని చేస్తున్న డిజిపి ఎన్‌సి ఆస్థానాను నిఘా విభాగం కొత్త అధిపతిగా కేరళ ప్రభుత్వం నియమించింది.

రాజకీయ లంచాల కేసులు నత్తనడక

నిఘా – అవినీతి నిరోధక బ్యూరో కీలకమైన రాజకీయ అవినీతి కేసులలో చురుకుగా దర్యాప్తు జరపడం లేదని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ నియామకం జరిగింది. మాజీ ఆర్థికమంత్రి, కెసి–ఎం (కేరళ కాంగ్రెస్ –ఎం) అధిపతి కెఎం మణి జోక్యం ఉన్నట్లు ఆరోపణగల బార్ లంచాల కేసుపై దర్యాప్తు కూడా దర్యాపుత కుంటుబడిన కేసుల్లో ఒకటి. అలాగే పత్తూర్ భూముల కుంభకోణం కేసు, కొల్లాం జిల్లాలో భూముల ఆక్రమణకు సంబంధించిన మరో కేసు కూడా దర్యాప్తు నత్తనడక నడుస్తున్నవాటిలో ఉన్నాయి.

మణిపై గల కేసును ఉద్దేశపూర్వకంగా పక్కనపెడుతున్నట్లు ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. సిపిఎం, కెసి(ఎం) మధ్య కొత్తగా నెలకొన్న సఖ్యత దృష్ట్యా ఆ కేసును నీరుగార్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. ఎల్‌డిఎఫ్‌లో చేరడానికి కెసి(ఎం) సిద్ధంగా ఉన్నట్లు కూడా వార్తలు వస్తున్నాయి. ఈ పరిణామం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పార్టీకి ఇష్టం లేదు. అది ఎల్‌డిఎఫ్‌లో రెండవ అతిపెద్ద భాగస్వామి.

* పి.శ్రీకుమరన్

ప్రైవేటు బడులు డీలా...సర్కారీ స్కూళ్లు కళకళ

ఎడిటర్‌కు లేఖ

తెలంగాణలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ల వ్యవహారం బండ్లు ఓడలు – ఓడలు బండ్లు మాదిరిగా మారుతోంది. ఎన్నో ఏళ్లుగా ఆధిపత్యం చెలాయించిన ప్రైవేటు స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతుండటంతో అవి డీలా పడిపోతున్నాయి.

మరోవంక కునారిల్లుతున్న దశలో ఉన్న ప్రభుత్వ స్కూళ్లు పుంజుకుంటున్నాయి. ఏటికేడాది విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నది. గత రెండేళ్లుగా ఇదే పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు, విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ఇం టిఇంటికీ ఉపాధ్యాయులు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయంటే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, ఉపాధ్యాయుల కృషి ఎనలేనిది. దాని ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఇంకా కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో గతంకంటే ఎక్కువ చేరుతున్నారు. ప్రధానంగా పాఠశాలల్లో మరుగుదొడ్లను నిర్మించడం, ఉన్నటువంటి మరమ్మతులు చేయించడంపై ప్రభుత్వం దృష్టిపెట్టింది.దానికితోడు ప్రభుత్వస్కూల్స్‌లో ఇంగ్లీష్ మీడియం ప్రారంభించడం కూడా ఒక కారణంగా తెలుస్తున్నది.

– గుండమల్ల సతీష్‌కుమార్

రైల్వేలో 62,907 గ్రూప్-డి పోస్టులు

ఈ పోస్టులకు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి. కంప్యూటర్ బేస్డ్ పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ట్రాక్‌మెన్, గేట్‌మెన్, పాయింట్స్‌మెన్, హెల్పర్, పోర్టర్ మొదలైన పోస్టులు గ్రూప్-డి పరిధిలో ఉన్నాయి.
విద్యార్హత: కొన్ని విభాగాలకు పదో తరగతి ఉత్తీర్ణత. మిగిలిన వాటికి పదో తరగతితోపాటు ఐటీఐ లేదా నేషనల్ అప్రెంటిస్ సర్టిఫికెట్ ఉండాలి. వయో పరిమితి: జులై 1, 2018 నాటికి 18 నుంచి 31 ఏళ్లు.
ఎంపిక విధానం: ఆన్‌లైన్‌లో నిర్వహించే పరీక్ష ద్వారా; వేతనం: ఎంపికైనవారికి రూ.18,000 మూల వేతనంగా చెల్లిస్తారు. పరీక్ష ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలకు రూ. 250; జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.500. దరఖాస్తులు: ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభ తేదీ: ఫిబ్రవరి 10 నుంచి చివరితేదీ: మార్చి 12, 2018.



అధిక వేతనాల కొలువులు

ఎక్కువ జీతం అంటే ఎవరికిష్టం ఉండదు.. అందులోనూ లక్షల్లో జీతాలిచ్చే ఐటీ జాబులకు కేరాఫ్ అమెరికా అని మన అందరి అభిప్రాయం! పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలు అక్కడ వుంటాయి. అమెరికా వెళ్లి మంచి ఉద్యోగంలో చేరి లక్షలు లక్షలు సంప్రదించవచ్చని ఈ విధమైన మాటలు ముఖ్యంగా విద్యార్థులు , సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉంటున్న వారి దగ్గర ఎక్కువగా ప్రస్తావన వస్తుంటాయి. అంటే అమెరికాలో జాబ్, లేదంటే సాఫ్ట్‌వేర్ కొలువు అయితేనే రూ.లక్షల్లో వేతనాలు చేతికందుతాయనే ఆశ అందరిలో ఉంటుంది. కష్టపడి పనిచేసే తత్వం, సరైన నైపుణ్యాలు ఉంటే వివిధ రంగాల్లో భారీ వేతనాలు వచ్చే ఉద్యోగాలు ఉన్నాయని అంటున్నారు విద్యానిపుణులు.ఈ నేపథ్యంలో సరైన విద్యార్హతలు, విషయ పరిజ్ఞానం,నాయకత్వ లక్షణాలు ఉంటే.. అత్యధిక వేతనాలు లభించే అవకాశమున్న ఉద్యోగాలేవో కొన్నింటి గురించి తెలుసుకుందాం....

మెరైన్ ఇంజనీర్లు, జియాలజిస్టులు : మనదేశంలో చమురు, సహజవాయు రంగాలకున్న డిమాండ్ గురించి తెలిసిందే. ముడి చమురు.. పెట్రోల్, డీజిల్‌గా మారాలంటే.. ఎన్నో ప్రక్రియలను దాటాలి. అందుకే ఈ రంగంలో పనిచేసే జియాలజిస్టులు, మెరైన్ ఇంజనీర్లు అధిక పరిజ్ఞానవంతులై ఉండాలి. సంబంధిత విద్యార్హతలు సొంతం చేసుకున్న విద్యార్థులు.. ఓఎన్‌జీసీ, ఐఓసీఎల్, భారత్ పెట్రోలియం వంటి ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు బ్రిటిష్ గ్యాస్, రిలయన్స్ ఎనర్జీ, షెల్ వంటి ప్రైవేటు సంస్థల్లో అధిక వేతనాలతో ఉద్యోగాలు పొందొచ్చు. ఈ రంగంలో ప్రారంభ వార్షిక వేతనాలు సగటున రూ.58 లక్షలు ఉంటాయి. ఐదారేళ్ల అనుభవం గడించాక రూ.1520 లక్షల వార్షిక వేతనం పొందే అవకాశం ఉంది.

చార్టర్డ్ అకౌంటెంట్ : మనదేశంలో చార్టర్డ్ అకౌంటెంట్ వృత్తికి అమితమైన గౌరవం ఉంది. ఇంజనీరింగ్, మెడిసిన్ తర్వాత అత్యధిక మందికి క్రేజీ కెరీర్ ఇది. సీఏ కోర్సు పూర్తి చేసి.. వ్యాపార దక్షత, ఆర్థిక అంశాల్లో పట్టున్న వారు చార్టర్డ్ అకౌంటెంట్లుగా స్థిరపడొచ్చు. సీఏ పూర్తిచేసిన వారికి ఫైనాన్షియల్ అకౌంటింగ్, ట్యాక్స్ మేనేజ్‌మెంట్, ఆడిటింగ్, కాస్ట్ అకౌంటింగ్, బ్యాంకింగ్, కన్సల్టెన్సీ తదితర అంశాలపై మంచి అవగాహన కలిగి ఉంటే.. డెలాయిట్, ప్రైస్ వాటర్ కూపర్స్, కేపీఎంజీ, ఐసీఐసీఐ బ్యాంక్ తదితర సంస్థలు అధిక వేతనాలతో ఉద్యోగాలు కల్పిస్తున్నాయి. వీరి ప్రారంభ వార్షిక వేతనాలు సగటున రూ.58 లక్షలు, అనుభవం వచ్చాక రూ.1825 లక్షల మధ్య ఉంటున్నాయి.

మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్స్: సంస్థ అభివృద్ధి విషయంలో మేనేజర్ స్థాయి వ్యక్తులు కీలక నిర్ణయాలు తీసుకుంటారు.



టాప్ మేనేజ్‌మెంట్ విధానాలను అమలు చేస్తారు. వృత్తి పరంగా ప్రారంభ దశలో కష్టపడితే చాలు.. కొంత అనుభవం గడించాక వెనక్కి తిరిగి చూసుకోవల్సిన అవసరం ఉండదు.



స్థాయికి తగ్గట్లు అధిక వేతనాలూ అందుకోవచ్చు. మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్స్ కెరీర్ పరంగా ఐఐఎంలు వంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో ఎంబీఏ పూర్తిచేసిన వారికి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లోనే కార్పొరేట్ కంపెనీలు లక్షల్లో వేతనం ఆఫర్ చేస్తున్నాయి. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఎంపికైన మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్స్ ప్రారంభ వార్షిక వేతనం సగటున రూ.10 లక్షల వరకు ఉంటుంది.

బిజినెస్ అనలిస్ట్ : మనదేశంలో వ్యాపార సంస్థల మధ్య పోటీ నానాటికీ పెరిగిపోతోంది. మార్కెట్ పరిస్థితులను ప్రతి రోజూ విశ్లేషించుకోవడం సంస్థలకు ప్రధానం. అందుకోసం పెద్ద కంపెనీలు బిజినెస్ అనలిస్ట్‌లను నియమించుకోవడం పరిపాటి. సంస్థ అవసరాలను అర్థం చేసుకుని, పోటీ సంస్థల పని తీరును అధ్యయనం (మార్కెట్ విశ్లేషణ) చేసి.. కంపెనీ ప్రగతికి నివేదికలు (డాక్యుమెంటేషన్) తయారు చేయడం బిజినెస్ అనలిస్టుల బాధ్యత. అనలిస్ట్‌గా కెరీర్ ప్రారంభించిన వారు కన్సల్టెంట్, సీనియర్ కన్సల్టెంట్, మేనేజర్, ప్రాజెక్ట్ లీడ్, ప్రెసిడెంట్, డైరెక్టర్ స్థాయికి చేరుకోవచ్చు. బిజినెస్ అనలిస్ట్‌గా రాణించాలంటే.. లాజికల్ థింకింగ్, మ్యాథ్స్ కాన్సెపట్స్‌పై పట్టు, కొత్త టెక్నాలజీలపై అవగాహన, కొత్త అంశాలపై ఆసక్తి ఉండాలి. మెకన్సీ, యాక్సెంచర్, బీసీజీ, కేపీఎంజీ వంటి పేరొందిన అనేక సంస్థలు అధిక వేతనాలతో బిజినెస్ అనలిస్ట్‌లను నియమించుకుంటున్నాయి. వీరి ప్రారంభ వార్షిక వేతనం సగటున రూ.8 15 లక్షల వరకు ఉంటుంది. వీటితోపాటు జీవిత బీమా, పెయిడ్ సిక్ లీవ్స్, రీలొకేషన్ ఖర్చులు, పెయిడ్ ట్రిప్‌లు, ఫ్రీ హె ల్త్ క్లబ్ మెంబర్‌షిప్ వంటి అదనపు సౌకర్యాలను సైతం కల్పిస్తున్నాయి.

జీకే – కరెంట్ అఫైర్స్

* ప్రపంచంలో అతిపెద్ద ఉభయచర విమానంగా గుర్తింపు పొందిన “AG6000”ను ఏ దేశం తయారు చేసింది?
చైనా
వివరణ: ప్రపంచంలో అతిపెద్ద ఉభయచర విమానం “AG6000” ను చైనా రూపొందించింది. కున్లాంగ్‌గా పిలిచే ఈ విమానం ఇటీవల తొలిసారి దక్షిణ చైనాలోని గువాంగ్ డంగ్ ప్రావిన్స్‌లోని జుహాయ్ విమానాశ్రయం నుంచి తొలి ప్రయాణం చేసింది.

* హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఇటీవల ఎవరు బాధ్యత్యాలు చేపట్టారు?
జైరామ్ ఠాకూర్
వివరణ: హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రిగా బిజేపీ నాయకుడు జైరామ్ ఠాకూర్ ఇటీవల ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు మరో 11మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇటీవల జరిగిన హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో 68 సీట్లకుగాను బీజేపీ 44 స్థానాల్లో గెలిచింది.

* బీసీసీఐ జనరల్ మేనేజర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?
సబా కరీమ్
వివరణ: భారత క్రికెట్ జట్టు మాజీ వికెట్ కీపర్ సబా కరీమ్ ఇటీవల బీసీసీఐ జనరల్ మేనేజర్‌గా నియమితులయ్యారు. ఇంతకముందు ఈ పదవిలో ఉన్న ఎంవీ శ్రీధర్ 2017 సెప్టెంబర్‌లో పదవికి రాజీనామా చేశారు.

* భారత్‌లో గుడ్ గవర్నెన్స్‌డే ని ఎప్పుడు నిర్వహిస్తారు ?
డిసెంబర్ 25
వివరణ: డిసెంబర్ 25న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని దేశంలో గుడ్ గవర్నెన్స్‌డేని 2014 నుంచి నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఈ దినోత్సవాన్ని జరుపుతారు.

* పవిత్రమైనటువంటి గంగా నది వెంట ఉన్న గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఏ పథకాన్ని ప్రారంభించింది?
గాంగ గ్రామ్
వివరణ: పవిత్రమైనటువంటి గంగా నది వెంట ఉన్న గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఇటీవల గంగా గ్రామ్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. క్లీన్‌గంగా మిషన్–నమామి గంగా పథకంలో భాగంగా కేంద్రం ఈ కార్యక్రమాన్ని చేప్పట్టింది.



* తీర ప్రాంత రాష్ట్రాల్లో బీచ్‌ల పరిశుభ్రత, అభివృద్ధి కోసం కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ ఇటీవల ప్రారంభించిన పెలైట్ ప్రాజెక్టు ఏది ?
బ్లూ ఫ్లాగ్
వివరణ: తీర ప్రాంత రాష్ట్రాల్లో బీచ్‌లను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో పాటు వాటిని అభివృద్ధి పరిచేందుకు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ ఇటీవల బ్లూ ఫ్లాగ్ పేరుతో పెలైట్ పాజెక్టుని ప్రారంభించింది. ఇందులో భాగంగా ప్రతి తీర ప్రాంత రాష్ట్రం నుంచి ఒక్కో బీచ్‌ను ఎంపిక చేసి అభివృద్ధి చేస్తారు.

* ఏ క్రీడను 2022 కామన్‌వెల్త్ గేమ్స్ నుంచి తొలగించారు?
షూటింగ్
వివరణ : ఇంగ్లండ్‌లోని బర్మింగ్‌హాం వేదికగా జరిగే 2022 కామన్ వెల్త్ గేమ్స్ జాబితా నుంచి షూటింగ్‌ని తొలగించారు. దీని స్థానంలో మిక్స్‌డ్ జండర్ టీ20 క్రికెట్ ఈవెంట్‌ను ప్రవేశపెట్టనున్నారు.

* ప్రపంచ ఆరోగ్య సంస్థ 2018లో ప్రకటించనున్న ఇంటర్నేష్‌నల్ క్లాసిఫికేషన్ ఆఫ్ డిసీజెస్ జాబితాలో కొత్తగా ఏ రుగ్మతను చేర్చనుంది ?
గేమింగ్ డిజార్డర్
వివరణ : అధికంగా వీడియో గేమ్స్ ఆడటం సరి కొత్త మానసిక రుగ్మతేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల వెల్లడించింది. ఈ మేరకు మానసిక రుగ్మతల జాబితాలో కొత్తగా గేమింగ్‌ను చేరుస్తూ.... 27 ఏళ్ల తర్వాత అంతర్జాతీయ అనారోగ్య జాబితా (ఇంటర్నేష్‌నల్ క్లాసిఫికేషన్ ఆఫ్ డిసీజెస్) –2018 ని త్వరలో విడుదల చేయనుంది. ఇది వరకు 1990లో ఈ జాబితాను సవరించారు.



* ప్రపంచంలో అతి పొడవైన గాజు వంతెనను (గ్లాస్ బ్రిడ్జ్) ఇటీవల ఏ దేశంలో ప్రారంభించారు ?
చైనా
వివరణ : చైనాలోని హెబెయ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ప్రపంచంలోనే అతి పొడవైన గాజు వంతెనను ఇటీవల సందర్శకుల కోసం ప్రారంభించారు. ఒకే సారి 2 వేల మంది వంతెనపైకి వచ్చినా తట్టుకునే సామర్థ్యంతో ఇది నిర్మితమైంది.

* భారత్‌లో ప్రీమియర్ లీగ్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఇటీవల ఎవరు నియామితులయ్యారు ?
రణ్ వీర్ సింగ్
వివరణ: భారత్‌లో ఫుట్‌బాల్ క్రీడను ప్రమోట్ చేసేందుకు ప్రీమియర్ లీగ్ బ్రాండ్ అంబాసిడర్‌గా బాలీవుడ్ ప్రముఖ నటుడు రణ్‌వీర్ సింగ్ నియమితులయ్యారు.

* అంతరిక్షం నుంచి వెలువడే గురుత్వాకర్షణ తరంగాలను గుర్తించేందుకు భారత్ ఎప్పటిలోగా దేశంలో లిగో గ్రావిటేషనల్ వేవ్ డిటెక్టర్‌ను ఏర్పాటు చేయనుంది?
2025
వివరణ : అంతరిక్షం నుంచి వెలువడే గురుత్వాకర్షణ తరంగాలను గుర్తించేందుకు భారత్ 2025లోగా లిగో గ్రావిటేషనల్ డిటెక్టర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయతో కలిసి ఈ ప్రాజెక్టుని చేప్పట్టనుంది. ఈ తరంగాలను గుర్తించినందుకు గాను అమెరికాకు చెందిన రెయినర్ వెయిస్, బ్యారీ బారిష్, కీప్ థార్న్... భౌతికశాస్త్రంలో 2017 నోబెల్ బహుమతి గెలుపొందారు.

* భారత్‌లోని ఏ విమానాశ్రయంలో దేశంలోనే తొలిసారిగా సముద్ర రన్‌వేను నిర్మించనున్నారు ?
అగట్టీ విమానాశ్రయం, లక్షద్వీప్
వివరణ : లక్షద్వీప్‌లోని అగట్టీ విమానాశ్రయంలో దేశంలోనే తొలిసారిగా సముద్ర రన్‌వేను నిర్మంచున్నారు. సముద్రంలో వంతెన నిర్మించి... ప్రస్తుతం ఉన్న రన్‌వేను పొడగించనున్నారు. ఈ మేరకు విమానాశ్రయం విస్తరణకు ఎయిర్‌పోర్ట్స్ అథారటీ ఆఫ్ ఇండియా ఇటీవల ఆమోదం తెలిపింది.

* దేశంలో తొలి ఎయిర్ కండీషన్డ్ లోకల్ ట్రైన్‌ను ఇటీవల ఏ నగరంలో ప్రారంభించారు ?
ముంబై
వివరణ: దేశంలోనే తొలిసారిగా ఎయిర్ కండిషన్డ్ లోకల్ ట్రైన్‌ను ముంబైలో డిసెంబర్ 25న ప్రారంభించారు. నగరంలోని బోవివాలి స్టేషన్ నుంచి చర్చిగేట్ స్టేషన్ వరకు ఈ రైలు తొలి ప్రయాణం చేసింది.

పరీక్షల ఒత్తిడిని ఓడిద్దాం!



తల్లిదండ్రుల బలవంతంతో ఇష్టంలేని గ్రూప్ తీసుకున్నా.. అందమైన ఆకర్షణల మధ్య సర్దుకున్నాడు రాజేశ్. ప్రణాళిక లేకుండా చదవడంతో రివిజన్ విషయం పట్టించు కోలేదు. అన్నీ వచ్చేసినట్లే ఉన్నా ఏదీ గుర్తుకు రావడం లేదని ఆందోళన చెందడం మొదలుపెట్టాడు. అర్ధరాత్రి దాటినా నిద్రపట్టదు. పగలు కునుకులేస్తున్నాడు. అంతా అయోమయంగా ఉంది. ఇవన్నీ ఒత్తిడి లక్షణాలు. వీటిని సరైన సమయంలో గుర్తించి సానుకూల దృక్పథంతో వ్యవహరించకపోతే పరిస్థితి ప్రతికూలంగా మారిపోతుంది.
శ్రద్ధగానే చదువుతున్నా విద్యార్థులందరిలోనూ అలాంటి పరిస్థితే ఎంతోకొంత కనిపిస్తుంటుంది. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలూ, ఎంసెట్, నీట్, జేఈఈ, ఇంకా డీమ్‌డ్ యూనివర్సిటీల ప్రవేశపరీక్షల కోసం సిద్ధమయ్యేవారూ, డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులూ ఓ పక్క ప్రిపరేషన్లో మునిగిపోతూ మరో పక్క పరీక్షల ఆలోచనల ఒత్తిడితో సతమతమవుతుంటారు. ఈ ఒత్తిడి మితిమీరకుండా చూసుకోవటం చాలా ముఖ్యం. పరీక్షలు బాగా రాసి, ఆశించిన మార్కులు తెచ్చుకోవాలంటే ఇది తప్పనిసరి.
తలనొప్పి, ఆహారం జీర్ణం కాకపోవడం, వాంతి అయ్యేలా ఉండటం, ఎక్కువ తినెయ్యటం, నిద్రలేమి, అలసట..ఇవన్నీ ఒత్తిడిని సూచించే లక్షణాలు. మానసికంగా చూస్తే... కోపం, అసహనం, నిరాశ, ఆత్మవిశ్వాసం లేకపోవటం, మూడ్ తరచూ మారిపోతుండటం లాంటివి గమనించవచ్చు.
పరీక్షల ఒత్తిడి, దానివల్ల ఏర్పడే భయాలకు కొన్ని మూల కారణాలుంటాయి. వాటిని మొదట అర్థం చేసుకోవాలి. ఆపై కొన్ని సులభమార్గాలతో అధిగమించవచ్చు.


జ్ఞాపకశక్తి లోపం

చాలామంది విద్యార్థులు ఎంత చదివినా, చదివిందేదీ గుర్తుండటం లేదని బాధపడుతుంటారు. నిజానికి వీళ్లు పరీక్షలు బాగానే రాస్తారు. కానీ ఎంత చదివినా గుర్తు ఉండకపోవడమనేది పరీక్షల ముందు రోజుల్లో ఎదురయ్యే భయం.
పాఠ్యాంశాన్ని అర్థం చేసుకుని ‘నేర్చుకునే పద్ధతి’ (లెర్నింగ్ మోడ్)లో చదివితే మర్చిపోవడం కష్టం. అర్థమైన విషయాన్ని ఎవరూ మర్చిపోరు. సబ్జెక్టు మీద ఇష్టంతో, ఆసక్తితో చదివినపుడు పాఠ్యాంశాన్ని మర్చిపోయే ప్రసక్తి ఉండదు. ఇష్టమైన సినిమాలో ప్రతి దృశ్యాన్నీ ఎలా గుర్తు పెట్టుకోగలుగుతున్నాం? దానికి పెద్దగా ప్రయత్నం కూడా చేయడం లేదే? ఇది కూడా అంతే!

కాస్త వ్యాయామం... సానుకూలత

* కొద్దిసేపు సైక్లింగ్, చిన్నపాటి శారీరక వ్యాయామం చేయటం ఒత్తిడిని తగ్గిస్తాయి.
* బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్, పాజిటివ్ సజెషన్స్ ఇచ్చుకోవడం, ధ్యానం, అవసరమైతే వైద్యులను సంప్రదించి కొద్దిపాటి మందులు వాడుతూ ఒత్తిడి తగ్గించుకోవచ్చు.
* కొన్నిసార్లు విటమిన్ల లోపం కూడా ఒత్తిడికి కారణం కావొచ్చు. ఈ విషయంలో వైద్యుల సలహా తీసుకోవడం అవసరం.
* చుట్టూ ఉన్న పరిసరాల్లోని చిన్న చిన్న విషయాల్లో ఆనందాన్ని కలిగించి ఒత్తిడిని దూరం చేసేవి చాలా ఉంటాయి. ఉదయిస్తున్న సూర్యుడు, వికసిస్తున్న పూలు, ఆడుకుంటున్న పిల్లలను చూడటం, చల్లగాలిని ఆస్వాదించడం, శ్రేయోభిలాషులతో కాసేపు మాట్లాడటం, ఆహ్లాదకరమైన సంగీతం వినడం ఇవన్నీ ఒత్తిడిని తగ్గించడానికి దోహదం చేసేవే.
* సానుకూల దృక్పథంతో ఉండాలి. ఆ దిశగా ఆలోచనలను మళ్లించాలి. ఇది ఒత్తిడిని తగ్గించడానికి అన్నింటికంటే బాగా పనిచేసే మందు.

ఏకబిగిన గంటలతరబడి చదవకుండా 4045 నిమిషాలకోసారి 510 నిమిషాల విరామం ఇస్తూ చదవటం వల్ల సబ్జెక్టును చక్కగా ఆకళింపు చేసుకోవచ్చు. బాగా గుర్తుంటుంది కూడా! బట్టీ పద్ధతిలో చదివితే ఒక పాయింట్ మధ్యలో గుర్తుకు రాకపోతే ఇక మిగిలిన పాయింట్లన్నీ కూడా దాని వెనకే మాయమైపోతాయి. విద్యార్థి అయోమయంలో పడతాడు. అందుకే, ప్రతి పాఠ్యాంశాన్నీ శ్రద్ధగా ఆకళింపు చేసుకుంటే చదివినదాన్ని మర్చిపోయే సమస్య రాదు.
నిద్రలేమి : చాలామంది అర్ధరాత్రి దాటాక కూడా చదువుతూ పగలు కునికిపాట్లు పడుతుంటారు. అలాగే వివిధ పోటీపరీక్షలకు సైతం అమితంగా శ్రమించడం వల్ల తరచూ నిద్రలేమికి గురవుతుంటారు.
అటువంటి సమయంలో అలసటకు లోనై ఆలోచనలు బలహీనపడతాయి. పరీక్షలు సరిగా రాయలేమేమో అని భయం కలుగుతుంది.
ఎక్కువ సమయాన్ని చదువుకోసం కేటాయించడం వల్ల నిద్రలేమి సమస్య బాధిస్తుండటం సహజమే! మరికొంత మంది ఒత్తిడి వల్ల ఎక్కువ నిద్రపోలేరు. దీనికి కనీస సమయమైనా నిద్రపోవడం తప్ప వేరే మార్గం లేదు.
నిద్రలేమి ప్రభావం మానసిక, శారీరక ఆరోగ్యాల మీద తప్పకుండా పడుతుంది. కాబట్టి విద్యార్థులు వారి వయసునిబట్టి తగినన్ని గంటలపాటు నిద్రపోవాలి. ఒత్తిడితో, ఆందోళనతో నిద్ర పట్టనివారు ఒత్తిడిని జయించే కొన్ని ఎక్సర్‌సైజ్‌లు చేయడం వల్ల దీన్ని అధిగమించవచ్చు.



ఇలా గుర్తుపెట్టుకోవచ్చు...

చదివేటప్పుడు కొన్ని కష్టమైన పదాలు, పేర్లు , పేర్ల సమూహాలను గుర్తుపెట్టుకోవడానికి విద్యార్థి ఇబ్బంది పడుతుంటాడు. అలాంటి సందర్భాలలో కొన్ని చిట్కాలు ఉపయోగించి వాటిని తేలిగ్గా గుర్తుంచుకోవచ్చు. ఇదే ధారణానుకూల పద్ధతి అంటారు. ఈ విధానంలో గుర్తుంచుకోవాల్సిన పదాల్లోని మొదటి అక్షరాలలో ఒక అర్థవంతమైన వాక్యాన్ని తయారుచేసుకోవాలి. ఈ వాక్యాన్ని గుర్తుపెట్టుకుంటే చాలు సంబంధిత పదాలన్నీ జ్ఞప్తికి వస్తాయి. ఉదాహరణకు సార్క్ సభ్య దేశాలను MBBS is PAIN అనే మాటతో గుర్తుపెట్టుకోవచ్చు. దీని ప్రకారం ఆ సభ్య దేశాలు మాల్దీవులు, భూటాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, పాకిస్తాన్, ఆఫ్గనిస్తాన్, ఇండియా, నేపాల్ అని తెలుసుకోవచ్చు. ఇదే విధంగా మరి కొన్నింటిని తయారుచేసుకుంటే సులభం అవుతుంది.

సబ్సిడీ రుణాల మంజూరులో వేగం పెంచిన ఎస్‌సి కార్పోరేషన్

మన తెలంగాణ / హైదరాబాద్ : స్వయం ఉపాధి పథకాల కింద నిరుద్యోగ యువతీ యువలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయడంలో ఎస్‌సి కార్పొరేషన్ ముందంజలో ఉంది. ఇతర కార్పొరేషన్‌లలో గత సంవత్సరం, అంతకు ముందు సంవత్సరాలకు సంబంధించిన సబ్సిడీ రుణాలను ఇవ్వడంలో కాలయాపన జరుగుతూ ఉంటే ఎస్‌సి సహకార అభివృద్ధి సంస్థ మాత్రం 2017–18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లబ్ధిదారులను ఎంపిక చేసి ముందంజలో ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎస్‌సి కార్పొరేషన్ ఇప్పటికే 20,885 మంది లబ్ధిదారులకు రూ. 267.60 కోట్లను 31,478 మంది ఎస్‌సి లబ్ధిదారులకు రూ.375,90 కోట్ల సబ్సిడీ అందించాలని కార్పొరేషన్ లక్ష్యంగా నిర్ణయించుకుని దరఖాస్తులను ఆహ్వానించగా 29,259 మంది ఎంపికయ్యారు. 2016–17 ఆర్థిక సంవత్సరంలో 26,731 మంది లబ్దిదారులకు రూ.322.61 కోట్లు సబ్సిడీ అందజేయాలని లక్ష్యంగా నిర్ణయించగా 17,274 మందికి రూ.203.93 కోట్లు మంజూరయ్యాయి. చేశారు. ఈ సారి 3,611 మందికి అదనంగా సబ్సిడీ రుణాలు మంజూరైనట్లు అధికారులు పేర్కొన్నారు. అత్యధికంగా భద్రాద్రి జిల్లాలో 2,173 మంది లబ్దిదారులుంటే అత్యల్పంగా నిజామాబాద్ జిల్లాలో 162 మందికి సబ్సిడీ రుణాలను మంజూరు చేసింది.



17 నుంచి సహజ ఆహారోత్సవం

మన తెలంగాణ / హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం, ఆయుష్ మంత్రిత్వశాఖతో పాటు పూణేలోని పకృతి వైద్య జాతీయ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తోన్న 'జాతీయ సహజ ఆహారోత్సవం – 2018' శనివారం నుంచి నగరంలో జరగనుంది. ప్రకృతి వైద్యం, యోగాను విస్తరింపచేయాలనే ఉద్దేశ్యంతో ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకురాలు హైందవి తెలిపారు.

దళిత నిధుల్లో మహిళలకు 50 శాతం

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించిన ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక అభివృద్ధి నిధుల్లో 50 శాతం నిధులను మహిళలకు కేటాయించాలని దళిత మహిళా నెట్‌వర్క్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. దళిత జనాభాలో సగ భాగం అయిన మహిళలకు సగం నిధులు ఖర్చు చేయాలని ఆ సంస్థ కన్వీనర్ పి.మేరీ మాదిగ, ప్రతినిధులు ప్రమీల, విజయకుమారి, స్వరూప లు డిమాండ్ చేశారు. గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక అభివృద్ధి నిధి చట్టం అమలు, పర్యవేక్షణకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేసి అందులో స్వచ్ఛంద సంస్థల పాత్ర ఉండేలా చేడాలని, ఈ కమిటీల్లో 50 శాతం మహిళలు ఉండేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కో ఆర్డినేటర్ సత్యం, శంకర్ (దళిత బహుజన ఫ్రంట్) తదితరులు పాల్గొన్నారు.

బంజారా మ్యూజియం ఏర్పాటు



మన తెలంగాణ / హైదరాబాద్ : గిరిజన జాతి సంస్కృతి, సాంప్రదాయాలు, వారసత్వ గిరిజన కళారూపాలను పరిరక్షించేందుకు హైదరాబాద్‌లో'బంజార మ్యూజియం'ను ఏర్పాటు చేయాలని వివిధ పార్టీల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ సేవాలాల్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ 279వ జయంతి వేడుకలు గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి కాలనీలో జరిగాయి. కార్యక్రమంలో మాజీ మంత్రి రవీంద్రనాయక్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు సయ్యద్ అజీజ్ పాషా, అఖిల భారత ఆదివాసీ మహాసభ నాయకులు ఆర్.శంకర్‌నాయక్, టిపిసిసి నాయకులు సూర్యానాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవీంద్రనాయక్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహరాజ్ దేశ ఐక్యత, సంస్కృతి పరిరక్షణకు విశేష కృషి చేశారని, ఆయన జయంతి రోజును సెలవు దినంగా ప్రకటించాలని, బంజారాహిల్స్‌లో సేవాలాల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అజీజ్ పాషా మాట్లాడుతూ గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రభుత్వం తుంగలో తొక్కుతుందన్నారు.

ఎల్‌టి పోస్టులకు అదనపు అర్హతలు

మన తెలంగాణ / హైదరాబాద్ : ల్యాబ్ టెక్నిషియన్(ఎల్‌టి) గ్రేడ్ 2 పోస్టుల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగ అభ్యర్థులకు ప్రభుత్వం శుభవార్తను ప్రకటించింది. అభ్యర్థుల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం దరఖాస్తుదారులకు మరో 12 అదనపు విద్యావకాశాలకు వెసులుబాటు కల్పించింది. దీనివల్ల మరో ఐదువేల మందికి దరఖాస్తు చేసుకునే అవకాశం కలుగుతుంది. దీనికి తోడు గత నెల 24తో ముగిసిన గడువును ఈ నెల 25 వరకు పొడిగించింది. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గతంలో జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఇంటర్, డిఎంఎల్‌టీ, బీఎస్సీ విద్యార్హతలతోపాటు తప్పనిసరిగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పారా మెడికల్ బోర్డులో రిజిస్టర్ చేయించుకున్న అభ్యర్థులు మాత్రమే 200 ల్యాబ్ టెక్నిషియన్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది.

తుది దశలో ప్యాక్స్‌ల కంప్యూటరీకరణ

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను కంప్యూటరీకరణ పూర్తి చేయడం తుదిదశలో ఉందని వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సి. పార్థసారధి తెలిపారు. నాబార్డు జనరల్ మేనేజర్ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలోని బృందం రాష్ట్రంలోని ప్యాక్స్‌లలో కంప్యూటరీకరణపై కరీంనగర్, రంగారెడ్డి జిల్లాలో పర్యటించి తెలుసుకున్నారు. హైదరాబాద్‌లో తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. 798 ప్యాక్స్‌లకు గాను 700 ప్యాక్స్‌లలో కంప్యూటరీకరణ త్వరలో పూర్తి కానుందన్నారు. ఏ విధంగా ఒక్కోదశను విజయవంతంగా పూర్తి చేసారో పార్థసారధి వారికి వివరించారు. టిఎస్ కాబ్ ఛైర్మన్ కె. రవీందర్ రావు, ఎమ్‌డి. మురళీధర్‌లు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చండి

(మొదటిపేజీ తరువాయి)

నిధుల విడుదల కాలేదని ఆర్థికమంత్రికి గుర్తు చేశారు. వాటిని వెంటనే విడుదల చేయడానికి జైట్లీ అంగీకరించినట్లు సమాచారం. పాత పది జిల్లాల్లో తొమ్మిదింటిని వెనుకబడినవిగా గుర్తించినందుకు జైట్లీకి కెసిఆర్ ధన్యవాదాలు తెలిపారు. సిఎంతో పాటు ఎంపి జితేందర్ రెడ్డి, అధికారులు రాజీవ్ శర్మ, రామకృష్ణారావు, నర్సింగ్‌రావులు ఉన్నారు.

నదీ బోర్డులపై ప్రతిష్టంభన

(మొదటిపేజీ తరువాయి)

విజయవంతంగా వినియోగించుకోవచ్చునని ఆయన చెప్పారు. గురువారం ఢిల్లీలో కేంద్ర జలవనరుల సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించిన పట్టిసీమ ప్రాజెక్టులో తెలంగాణాకు 45టీఎంసీల హక్కు ఉందని వాదించినట్టు హరీశ్ రావు తెలిపారు. అయితే ఈ సమావేశం అసంపూర్తిగా ముగిసిందని మంత్రి హరీష్ రావు వెల్లడించారు. వచ్చే సమావేశంలోనైనా ఈ విషయంపై స్పష్టత వస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు.కాళేశ్వరం ప్రాజెక్టు పనులను పరిశీలించేందుకు కేంద్ర మంత్రులు గడ్కరీ, హర్షవర్దన్ లను ఆహ్వానించానని హరీష్ రావు తెలిపారు. అందుకు వారు సుముఖత చూపారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కేవలం అభినందనలు ఇస్తే సరిపోదని, అభినందనలతో పాటు ఆర్థిక సహాయం కూడా చేయాలని గడ్కరీని కోరినట్టు హరీశ్ రావు చెప్పారు.ఏఐబీపీ క్రింద తెలంగాణ నుంచి ఎంపికైన 11 ప్రాజెక్టుల్లో ఇప్పటికే 2 ప్రాజెక్టులు పూర్తయ్యాయని,మరో ఆరు ప్రాజెక్టులు జూన్ 2018కిపూర్తికానున్నాయని మంత్రి తెలియజేశారు. 2019 మార్చి టార్గెట్ గా చేసుకొని మిగిలిన ప్రాజెక్టులను పూర్తిచేయనున్నట్టు మంత్రి చెప్పారు.క్యాడ్వామ్ క్రింద అడిగిన వెయ్యి కోట్ల రూపాయలను వెంటనే విడుదల చేయాలని కేంద్రమంత్రిని కోరినట్లు హరీష్ రావు తెలిపారు. అందులో దేవాదులకు కేటాయించిన 450కోట్ల రూపాయలను వెంటనే విడుదలచేయాలని కోరానని అన్నారు. భీమా ప్రాజెక్టుకు రావాల్సిన 35కోట్ల రూపాయలను కూడా వెంటనే విడుదలచేయాలని కోరినట్టు ఆయన చెప్పారు.ఎఫ్.ఆర్.బి.ఎం. పరిధిలోకి రాకుండా నాబార్డు ద్వారా రాష్ట్రాలకు నిధులు ఇచ్చినప్పుడే కేంద్రప్రభుత్వం చేపట్టిన లక్ష్యాలను చేరవచ్చని తాను వివరించానని మంత్రి హరీశ్ రావు తెలిపారు. అప్పుడే ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తయి రైతులకు మేలు జరుగుతుందన్నారు.తన అభిప్రాయాలతో కేంద్రమంత్రి గడ్కరీ సూత్రప్రాయంగా ఏకీభవించారని హరీశ్ రావు చెప్పారు. అన్ని రాష్ట్రాలమంత్రుల అభిప్రాయలతో నివేదిక సమర్పిస్తే క్యాబినెట్ ముందు పెడ్తానని గడ్కరీ హామీ ఇచ్చినట్టు మంత్రి చెప్పారు. అనంతరం డిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రి హర్షవర్ధన్ తో సమావేశం అయినట్లు మంత్రి హరీశ్ రావు తెలిపారు. సీతారామ ప్రాజెక్టు పర్యావరణ, వన్యప్రాణి అనుమతులను మంజూరు చేయాలని కేంద్ర మంత్రి హర్షవర్దన్‌ను అడిగామని చెప్పారు.పాలమూరు రంగారెడ్డి మొదటి దశ అటవీ అనుమతులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరినట్టు హరీశ్ రావు చెప్పారు.కాళేశ్వరం ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు ఇచ్చినందుకు కేంద్ర మంత్రికి ధన్యవాదాలు చెప్పామని మంత్రి పేర్కొన్నారు.

అడుగైనా ముందుకు పడని ఆస్తుల పంపిణీ

హెడ్ క్వార్టర్ నిర్వచనం ప్రకారం బస్‌భవన్ ఒక్కటే ఉమ్మడి ఆస్తి

మన తెలంగాణ/హైదరాబాద్ : ఒకటి కాదు రెండు కాదు తెలంగాణ రాష్ట్రం ఏర్పడి మూడేళ్లు దాటినా ఆర్‌టిసి ఉమ్మడి ఆస్తుల పంపణీ ముందుకు జరగడం లేదు. ఆస్తుల పంపిణీ విషయంలో ఎపిఎస్ఆర్‌టిసి కాలుకేస్తే మెడకు, మెడకేస్తే కాలుకు అన్న చందంగా వాదనలు చేస్తుండడంతో వాటి పంపిణీ ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అనే విధంగా పరిస్థితి తయారైంది. గత ఆరు నెలల్లో ఢిల్లీలో హోంశాఖ అధికారుల ఆధ్వర్యంలో, హైదరాబాద్‌లో, విజయవాడలో రెండు రాష్ట్రాల ఆర్‌టిసి అధికారులు దఫదఫాలుగా సమావేశాలు నిర్వహించి చర్చించినా గత మూడేళ్లుగా ఆస్తుల పంపిణీ ఏటూ తేలడం లేదు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయం బస్ భవన్, ఛైర్మన్ బంగ్లా, మెట్టుగూడలోని మూడు అధికారుల క్వార్టర్లు, ఆర్‌టిసి కళాభవన్, కళ్యాణ మండపం, గెస్ట్‌హౌస్, తార్నాక ఆస్పత్రి, మియాపూర్ బస్‌బాడీ యూనిట్ (బిబియు) ట్రాన్స్‌పోర్ట్ అకాడమీ భూమి, హాస్టల్, కొత్త బస్సుల పార్కింగ్ స్థలం, బస్ మెయింటెన్స్ డిపో, కాచీగూడ, చిలకలగూడ క్వార్టర్లు తదితర మొత్తం 14 ఆస్తులు ఉమ్మడి ఆస్తులని, ఆ ఆస్తులన్నింటినీ 52:48 నిష్పత్తిలో పంపిణీ చేయాలని ఎపిఎస్ఆర్‌టిసి కోరుతుంది. హైదరాబాద్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయం బస్‌భవన్ (స్థలం కాదు) ఉమ్మడి ఆస్థి అని, మిగిలినవన్నీ వారసత్వ ఆస్తులని, ఎపిఎస్ఆర్‌టిసి ఏర్పాటు కాకముందే హైదరాబాద్ సంస్థానంలోని 'నిజాం స్టేట్ రోడ్, రైల్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థ'కు చెందినవని, పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ఏ రాష్ట్రంలోని ఆస్తులు ఆ రాష్ట్రానికే చెందుతాయని టిఎస్ఆర్‌టిసి స్పష్టం చేసింది. చివరకు విభజన చట్టంలోని ''హెడ్ క్వార్టర్'' నిర్వచనం ప్రకారం బస్ భవన్ ఒక్కటే ఉమ్మడి ఆస్థి అని, తెలంగాణలోని ఏ ఆస్థిలో ఎపిఎస్ఆర్‌టిసికి వాటా ఉండదని కేంద్ర సిబ్బంది వ్యవహారాలు, శిక్షణ విభాగం (డిఓపిటి) తేల్చి చెప్పినా ఎపిఎస్ఆర్‌టిసి వినడం లేదు. రెండు రాష్ట్రాల ఆర్‌టిసి అధికారులు పరస్పర భిన్నమైన వాదనలు చేయడంతో హోంశాఖ అధికారులు ఆస్తుల పంపిణీపై కేంద్ర హోంశాఖ తర్జనభర్జనలు పడుతున్నట్లు సమాచారం. దీంతో ఆర్‌టిసి ఆస్తుల పంపిణీ విషయంలో హోంశాఖ అధికారులు కూడా అసంతృప్తిని వ్యక్తం చేస్తుంది. 'ఎపిఎస్ఆర్‌టిసి హెడ్ క్వార్టర్ నిర్వహచనాన్ని పరిగణలోకి తీసుకోకుండా వితండవాదం చేస్తోంది'' అని హోంశాఖ డిఓపిటి అధికా రులు వ్యాఖ్యానించినట్లు టిఎస్ఆర్‌టిసి అధికారులు చెబుతున్నారు.

కేంద్ర ప్రభుత్వమే పరిష్కరించాలి: కేంద్ర హోంశాఖ నిర్వచించిన ''హెడ్ క్వార్టర్'' పరిధిలోకి ఒక్క బస్ భవన్ మాత్రమే వస్తుంది. ఇతర ఏ ఆస్తులు ఉమ్మడి ఆస్తుల పరిధిలోకి రావు. ఆర్టీసీకి ప్రస్తుతం ఉన్న ఆస్తులన్నీ నిజాం కాలం నుంచి వారసత్వంగా వస్తున్నాయి. ఆస్తుల విష యంలో తమ వాదనలు, అభిప్రాయాలను ఆధారాలతో సహా కేంద్రం హోం శాఖకు తెలియ జేశాం. సమస్యను కేంద్రమే పరిష్కరించాలి'' అని టిఎస్ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ జి.వి.రమణరావు 'మన తెలంగాణ' ప్రతినిధితో చెప్పారు.

వసూలు చేసిన విరాళాల్లో ఖర్చు చేసింది మూడో వంతే!

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై ఎడిఆర్ అధ్యయనం

మన తెలంగాణ/ హైదరాబాద్: గత ఏడాది జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల కోసం రాజకీయ పార్టీలు వసూలు చేసిన విరాళాల్లో మూడోవంతు మాత్రమే ఎన్నికల్లో ఖర్చు చేశాయి. ఇక జాతీయపార్టీలను మాత్రమే తీసుకుంటే వసూలు చేసిన నిధుల్లో కేవలం నాలుగోవంతే వాడాయి. ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, గోవా, మణిపూర్, ఉత్తరాఖండ్ రాష్ట్ర శాసనసభలకు జరిగిన ఎన్నికల కోసం ఏడు జాతీయ, 16 ప్రాంతీయ పార్టీలు రూ.1503.21 కోట్లు వసూలు చేయగా, రూ.494.36 కోట్లు మాత్రమే ఖర్చు చేశాయి. ఈ విషయం అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్(ఎడిఆర్) ఇండియా సంస్థ అధ్యయనంలో తేలింది. ఈ మొత్తంలో కూడా జాతీయ పార్టీల విరాళాలు రూ.1314.29 కోట్లు కాగా, ఖర్చు రూ.328.66 కోట్లు మాత్రమే. ప్రాంతీయ పార్టీలు రూ.188.92 కోట్లు వసూలు చేయగా, రూ.165.7 కోట్లు ఎన్నికల్లో ఖర్చు పెట్టాయి. ఖర్చులో సగానికి పైగా అంటే 56 శాతం ప్రచారానికే వెచ్చించాయి. ప్రయాణ ఖర్చులకు 21 శాతం, అభ్యర్థుల చేతి ఖర్చులకు 18శాతం ఖర్చు చేశారు. బిజెపి ప్రచారానికి అత్యధికంగా రూ.152 కోట్లు ఖర్చు చేయగా, కాంగ్రెస్ అభ్యర్థుల ఖర్చు కింద అత్యధికంగా 39.83 కోట్లు ఖర్చు పెట్టింది. తమ ఖర్చులను నిర్ణీత గడవులోగా సమర్పించని పార్టీలకు ఎన్నికల కమిషన్ భారీ జరిమానా విధించాలని, అభ్యర్థుల ఖర్చుపై పరిశీలకులను నియమించిన విధంగానే, పార్టీ ఖర్చుల పర్యవేక్షణకు కూడా పరిశీలకులను నియమించాలని ఎడిఆర్ సిఫార్సు చేసింది.

ఇంధన పొదుపులో టిఎస్‌ఆర్‌టిసిదే అగ్రస్థానం

మన తెలంగాణ / మైదరాబాద్ : ఇంధన పొదుపులో భాగంగా టిఎస్ఆర్‌టిసి బస్సుల్లో ప్రత్నామ్నాయ ఇంధన వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు టిఎస్ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ జి.వి.రమణారావు చెప్పారు. ఇంధన పొదుపులో ఆర్‌టిసి మెరుగైన స్థానంలో ఉండడం డ్రైవర్ల కృషి ఫలితమేనన్నారు. ఆర్‌టిసి ఇంధన పొదుపు అవార్డుల ప్రదానోత్సం గురువారం ఆర్‌టిసి కళాభవన్‌లో జరిగింది. రాష్ట్ర, రీజియన్ స్థాయిలలో అత్యుత్తమ కెఎంపిఎల్ సాధించిన డ్రైవర్లకు, ఉత్తమ మెయింటెనెన్స్ ద్వారా ఇంధన పొదుపునకు కృషి చేసిన మెకానిక్‌లకు మేనేజింగ్ డైరెక్టర్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఎం.రవీందర్, సి.ఎం.ఇ వెంకటేశ్వర్లు, హెచ్‌పిసిఎల్ జనరల్ మేనేజర్ శివేంద్ర గుప్త, డిప్యూటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమణరావు మాట్లాడుతూ పెట్రోలియం కన్‌జర్వేషన్ రిసర్చ్ అసోసియేషన్ నుంచి 26 సార్లు,



ఎఎస్ఆర్‌టియు నుంచి 37 సార్లు జాతీయ స్థాయిలో అవార్డులు అందుకోవడం ఆర్‌టిసికి గర్వకారణమన్నారు.

స్ఫూర్తిప్రదాత ధర్మభిక్షం: చాడ

మన తెలంగాణ / హైదరాబాద్ : స్వాతంత్ర్య సమరయోధులు, ప్రముఖ కమ్యూనిస్టు, పార్లమెంట్ మాజీ సభ్యులు బొమ్మగాని ధర్మభిక్షం జీవితం స్ఫూర్తిదాయకమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. నిజాం వ్యతిరేక పోరాటంలో ఎందరో యువకులను కమ్యూనిస్టులుగా తయారు చేశారని, మూడుసార్లు ఎంఎల్‌ఏగా, రెండుసార్లు ఎంపిగా ప్రజల వాణిని చట్టసభల్లో బలంగా వినిపించిన నాయకుడని కొనియాడారు. ధర్మభిక్షం 96వ జయంతి సందర్భంగా గురువారం మఖ్దూంభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, 'మన తెలంగాణ' ఎడిటర్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు కె.ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపి అజీజ్ పాషా, మాజీ ఎంఎల్‌ఏ వి.యాదగిరి



రావు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్‌రావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, టి.వెంకట్రాములు, ఇ.టి.నర్సింహా, రిటైర్డ్ జడ్జి జస్టిస్ ఎం.కాంతయ్య తదితరులు పాల్గొన్నారు. పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కేవలం కమ్యూనిస్టు పార్టీలోనే కాకుండా, ఆయన శిష్యులు ఇతర పార్టీల్లో కూడా నాయకులుగా ఎదిగారని గుర్తు చేశారు. ధర్మభిక్షం ఒక తరం నాయకులను తయారు చేశారని, ఆయన అన్ని వయసుల వారితో సమానస్థాయిలో కలిసి పోయేవారని కె.శ్రీనివాస్‌రెడ్డి గుర్తు చేశారు. ధర్మభిక్షం తనకు రాజకీయ గురువు అని ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలో బలమైన కమ్యూనిస్టు ఉద్యమానికి పునాధులు వేశారని రత్నాకర్ రావు అన్నారు. నల్లగొండ జిల్లాలో అనేక మందికి విద్యా బుద్ధులతో పాటు నాయకత్వ లక్షణాలను పాదుకొల్పిన వైతాళికుడు ధర్మభిక్షం అని ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమానికి ఐప్సో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవిఎల్ అధ్యక్షత వహించగా, గీత పనివారల సంఘం ప్రధాన కార్యదర్శి డి.జి.సాయిలు గౌడ్ వందన సమర్పణ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల ధర్మభిక్షం జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

విభజన సమస్యలపై సమావేశం

21న ఢిల్లీకి రెండు రాష్ట్రాల ప్రతినిధులు

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాలుగేళ్ళు కావస్తున్నా ఇంకా కొన్ని సమస్యలు ఇరు రాష్ట్రాల మధ్య వివాదంగానే ఉండడంతో వాటి పరిష్కారానికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నడుం బిగించింది. ఈ నెల 21వ తేదీన ఢిల్లీలో రెండు రాష్ట్రాల ప్రతినిధులతో కేంద్ర హోంశాఖ కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి (కేంద్ర రాష్ట్ర సంబంధాల విభాగం) సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో పాటు పునర్ వ్యవస్థీకరణ విభాగాలకు చెందిన ప్రతినిధులు, రెసిడెంట్ కమిషనర్లు హాజరుకావాల్సిందిగా హోంశాఖ తరపున డైరెక్టర్ ఏకె మనీష్ మూడు రోజుల క్రితం రెండు రాష్ట్రాలకు లేఖ రాశారు. పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని పదమూడవ షెడ్యూలులో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలు, పెండింగ్‌లో ఉన్న అంశాలతో పాటు రెండు రాష్ట్రాల మధ్య వివాదంగా ఉన్న తొమ్మిదవ, పదవ షెడ్యూలులోని సంస్థల విభజన, అందులోని ఉద్యోగుల విభజన, ఆస్తుల అప్పుల పంపిణీ, ఢిల్లీలోని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ భవన్ విభజన తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చ జరగనుంది. తొమ్మిదవ షెడ్యూలులోని సంస్థల విభజనతో పాటు ఇటీవల ఉద్యోగుల విభజన బాధ్యతలను కూడా చూస్తున్న షీలాభిడే కమిటీ నివేదిక, ఇంకా పెండింగ్‌లో ఉన్న అంశాలపై కూడా ఇదే సమావేశంలో చర్చ జరగనుంది. ఈ నేపథ్యంలో తెలంగాణకు చెందిన అంశాలను కేంద్రం దృష్టిలోకి తీసుకెళ్ళడంతో పాటు అడ్డంకిగా ఉన్న ఆంధ్రప్రదేశ్ వాదనలు, గతంలో కేంద్ర హోంశాఖ తొమ్మిదవ షెడ్యూలులోని సంస్థల 'హెడ్‌క్వార్టర్' అనే పదానికి ఇచ్చిన నిర్వచడం, దానిపై ఏపీ లేవనెత్తిన అభ్యంతరం, ఫలితంగా పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉండడం, పదవ షెడ్యూలులోని ఉన్నత విద్యా మండలిపై హోంశాఖ ఇచ్చిన ఆదేశాన్ని సవాలుచేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయడం తదితర అంశాలను కూడా ఈ సమావేశంలో తెలంగాణ ప్రస్తావించనుంది. ఇందు కోసం ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన శనివారం సమావేశమై ఒక కార్యాచరణను రూపొందించనున్నారు.

పోలీసులపై న్యాయ విచారణ

(మొదటిపేజీ తరువాయి)

చేయాలని కోరుతూ ఆజాద్ భార్య పద్మ, జర్నలిస్ట్ హేమచంద్ర పాండే భార్య బబిత, సామాజిక వేత్త స్వామి అగ్నివేశ్‌లు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా సుప్రీం కోర్టు పోలీసులపై కేసులు నమోదు చేయాలని విచారణ చేపట్టాలని సిబిఐని ఆదేశించింది. విచారణ జరిపిన సిబిఐ అధికారులు ఆత్మరక్షణ కోసం పోలీసులు ఆజాద్, హేమచంద్రపాండేలపై కాల్పులు జరపడంతో వారు మృతి చెందారని నివేదికను సమర్పించడంతో కేసును మూసివేశారు. ఆ తర్వాత ఆజాద్ భార్య పద్మ, హేమచంద్రపాండే భార్య బబితలు మున్సిప్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సిబిఐ, ఆజాద్, హేమచంద్ర పాండేల తరుపు న్యాయవాదులు వాదనలు వినిపించగా, 2015లో కేసును కొట్టివేస్తూ అప్పటి న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఆ తర్వాత పద్మ, బబితలు ప్రొటెస్టు పిటిషన్‌గా హైకోర్టుకు అపీల్ చేశారు. ఇదిలాఉంటే హైకోర్టు తిరిగి జిల్లా కోర్టుకు ఈ కేసును బదిలీ చేసింది. ప్రస్తుతం ఈ కేసు అదనపు జిల్లా కోర్టులో ఉంది. గురువారం పద్మ, బబితల తరుపు న్యాయవాదులు ఎన్‌కౌంటర్‌కు బాధ్యులైన పోలీసులను న్యాయవిచారణకు ఆదేశించాలని కోరారు. న్యాయమూర్తి భరత లక్ష్మీ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న 29 మందిని న్యాయవిచారణ చేయాలని ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న అప్పటి సిఐ రఘునందన్‌తో సహా 29 మంది పోలీసులకు సమన్లు జారీ చేసి కోర్టు విచారించనుంది. ఈ సందర్భంగా పిటిషనర్లు మృతుల సతీమణుల తరపు న్యాయవాది సురేష్ మాట్లాడుతూ కేంద్ర కమిటీ సభ్యుడుగా ఉన్న ఆజాద్ చర్చల కోసం వస్తే అప్పటి కేంద్ర ప్రభుత్వంలో హోంమినిస్టర్‌గా ఉన్న చిదంబరం ఈ ఎన్‌కౌంటర్‌ను చేయించారని ఆరోపించారు. ఈ విషయం బయటకు వస్తుందని జర్నలిస్టు హేమచంద్రపాండేను కూడా పోలీసులు దగ్గర నుంచి కాల్చి చంపారన్నారు. న్యాయ వ్యవస్థ మీద తమకు పూర్తి విశ్వాసం ఉందని తప్పకుండా న్యాయం గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సుదీర్ఘ పోరాటంలో తొలిమెట్టు ఎక్కామన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్ చేసిన పోలీసులపై క్రిమినల్ కేసులు నమోదవుతాయని పేర్కొన్నారు. కోర్టుకు హాజరైన వారిలో అజాద్ భార్య పద్మ, న్యాయవాది సురేశ్, సిబిఐ తరుపు న్యాయవాదులు ఉన్నారు.

రక్త పాఠశాల

(మొదటిపేజీ తరువాయి)

ఘటనతో పాఠశాల ప్రాంగణమంతా రక్తసిక్తమైంది. దుండగుడు విచక్షణారహితంగా కాల్పులు జరుపుతుండడంతో విద్యార్థులు కేకలు పెడుతూ పరుగులు పెట్టారని ప్రత్యక్ష సాక్షులు వివరించారు. అదే పాఠశాలకు చెందిన నికోలస్ క్రుజ్ అనే మాజీ విద్యార్థి ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్టు తేల్చారు. ఇతన్ని కొద్ది రోజుల క్రితం క్రమశిక్షణ చర్యల పేరిట స్కూల్ యాజమాన్యం సస్పెండ్ చేసింది తోటి విద్యార్థుల పట్ల నికోలస్ ప్రవర్తన విపరీతంగా ఉంటుండడంతో ఈ చర్య తీసుకున్నారని పోలీసులు వెల్లడించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. అదే విధంగా అతడి సామాజిక మాధ్యమ ఖాతాలను కూడా పరిశీలిస్తున్నామన్నారు.

అలారం మోగించి..బయటకు రప్పించి..

పాఠశాలలోకి ప్రవేశించిన వెంటనే నికోలస్ తొలుత ముగ్గురిని కాల్చి చంపాడు. తూటాల శబ్దం విన్న విద్యార్థులు తరగతి గదుల్లోనే బిక్కుబిక్కుమంటూ ఉన్నారు. ఎవరూ బయటికి రాకపోవడంతో నికోలసే ఫైర్ అలారం మోగించారు. దీంతో విద్యార్థులంతా ప్రవేశ ద్వారం వైపు పరుగులు పెట్టారు. అప్పటికే అక్కడే కాచుకుని ఉన్న నికోలస్ వారిపై బుల్లెట్ల వర్షం కురిపించాడు. కాల్పుల సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు చుట్టుముట్టిన విషయాన్ని గ్రహించిన దుండగుడు వారిపైకి కూడా కాల్పులకు తెగబడ్డాడు. దీంతో పోలీసులు కూడా దుండగుడిపై ఎదురు కాల్పులకు దిగి, అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి ఒక తుపాకీతో



పాటు గ్యాస్ మాస్క్, స్మోక్ గ్రెనేడ్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. పెద్ద ఎత్తున తూటాలు కూడా అతని వద్ద ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. ఘటనపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతిచెందిన విద్యార్థుల కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఇలాంటి సంఘటనలు పాఠశాలల్లో మరోటి జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను అదేశించారు. 'ఇది దుర్దినం. మేమంతా దు:ఖసాగరంలో మునిగిపోయాం. బాధితులకు భారత సంతతి వారి పక్షాన సానుభూతి తెలుపుతున్నాం' అని శేఖర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. శేఖర్‌రెడ్డి స్నేహితుడి కుమారుడు ఈ కాల్పుల్లో గాయపడి ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. 2012 సంవత్సరంలో శాండీహూక్‌లోని కనెక్టికట్ స్కూల్‌లో జరిగిన కాల్పుల ఘటనలో 26మంది చనిపోయారు. ఆ తర్వాత జరిగిన అత్యంత దారుణమైన ఘటన మరొకటి ఇది.

ఎర్రజొన్నల కొనుగోలు

(మొదటిపేజీ తరువాయి)

చేయనున్నట్లు చెప్పారు. పంట కొనుగోలు చేయడానికి అనుమతి ఇచ్చిన సిఎం కెసిఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సచివాలయంలో గురువారం ఎంపి కవిత, ఎంఎల్‌ఏలు జీవన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డిలతో కలిసి మంత్రి పోచారం మీడియాతో మాట్లాడుతూ, రైతుల విషయంలో కాంగ్రెస్ నాయకులు అనవసర విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఎర్రజొన్న బకాయిలను రూ. 12 కోట్లు టిఆర్ఎస్ ప్రభుత్వమే చెల్లించిందన్నారు. కాంగ్రెస్ వాళ్లు చేయరు, చేసే వారిని సమర్థించరు అని విమర్శించారు. కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, రైతుల విషయంలో అక్కడ ఒక నీతి ఇక్కడ ఒక నీతి చెబుతున్నారని, రైతులను తప్పుదోవ పట్టిస్తూ ధర్నాలు, రాస్తారోకోలు చేయిస్తున్నారని ఆరోపించారు. కనీస మద్దతు ధర గత 10 ఏళ్లలో ఎందుకు ఇప్పించలేకపోయారని ప్రశ్నించారు. నిజామాబాద్ ఎంపి కవిత మాట్లాడుతూ రెండు రోజుల క్రితమే ఎర్రజొన్న కొనుగోలు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గతంలో మద్దతు ధర కోసం ఆందోళన చేస్తే కాంగ్రెస్ కాల్పులు జరిపిందని గుర్తు చేశారు. కొంగ జపం చేసే కాంగ్రెస్ నాయకులను నమ్మవద్దని రైతులకు పిలుపునిచ్చారు.

ఉత్పత్తి అంచనా 95,918 మెట్రిక్ టన్నులు

ఎర్రజొన్నల సాగు మొత్తంగా 27,103 మంది రైతులు 50,427 ఎకరాలలో సాగు చేశారు. మొత్తంగా 95,918 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి రానున్నట్లు అంచనా. ఈ మేరకు నిజామాబాద్ జిల్లా కలెక్టర్ గురువారం ప్రభుత్వానికి ప్రతిపాదించారు. క్వింటా రూ. 2,300కు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినందున కొనుగోళ్ల మొత్తానికి రూ. 220 కోట్లు అవుతాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

70 ఏళ్లలో ఇలాంటి రైతు వ్యతిరేక ప్రభుత్వాన్ని చూడలేదు



మన తెలంగాణ/ హైదరాబాద్ : గడిచిన 70 ఏళ్లలో బిజెపి లాంటి రైతు వ్యతిరేక ప్రభుత్వాన్ని చూడలేదని అఖిల భారత రైతాంగ పోరాట సమన్వయ సమితి (ఎఐకెఎస్‌సిసి) జాతీయ కార్యవర్గ సభ్యులు యోగేంద్ర యాదవ్ అన్నారు. వ్యవసాయ రంగం ఆర్థిక, పర్యావరణ, అస్థిత్వ సంక్షోభంలో ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో తార్నాకలోని మర్రి కృష్ణ హాల్‌లో రాష్ట్రంలోని 24 రైతు సంఘాల ఆధ్వర్యంలోఎఐకెఎస్‌సిసి "కిసాన్ ముక్తి సదస్సు" జరిగింది. ఈ సదస్సుకు హాజరైన యోగేంద్ర యాదవ్ మాట్లాడుతూ పంటల ఉత్పాదకత పెరిగిందని చెప్పుకోవడమే కాని రైతాంగం మాత్రం లాభాల్లోకి వెళ్లలేకపోయిందన్నారు. వాతావరణ మార్పులతో వ్యవసాయ ఆదాయం పడిపోతుందని ఒకవైపు జాతీయ ఆర్థిక సర్వే చెబుతుంటే, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. తాను దేశం మొత్తం తిరిగినట్లు చెప్పిన యోగేంద్ర యాదవ్ ఎవరూ కూడా వ్యవసాయం చేయడానికి రైతుగా చెప్పుకోవడానికి ముందుకు రావడం లేదన్నారు. వ్యవసాయ ఉత్పత్తికి, గిట్టుబాటు ధరల గ్యారంటీ, రుణ విముక్తి బిల్లులను చట్టం చేయాలని డిమాండ్ చేశారు. పార్టీలకతీతంగా, గ్రామాల వారీగా రైతులందరూ జెఎసిగా ఏర్పడాలని తెలంగాణ జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ కోదండరామ్ పిలుపునిచ్చారు. పెరుగుతున్న పంటల వ్యయాన్ని నియంత్రించడంతో పాటు పంట ఉత్పత్తులను గిట్టుబాటు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వంపై ఇప్పటికే ఎన్నో విజయాలు సాధించామని అదే ఉత్సాహంతో ముందుకు వెళ్లాలన్నారు. ఒత్తిడిని, నిర్బంధాలకు వెనక్కి తగ్గవద్దన్నారు. అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మాల్లారెడ్డి మాట్లాడుతూ నాయకులే దళారులకు కొమ్ముకాస్తున్నారని, సుబాబుల్ విషయంలో అదే జరుగుతోందన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ మాట్లాడుతూ కిసాన్ ముక్తి బిల్లు చట్టంగా మారే వరకు రైతు సంఘాలన్ని ఐక్యంగా పోరాడాలన్నారు.

ట్రైలర్‌తో భయపెడుతోంది

బాలీవుడ్ బ్యూటీ అనుష్క శర్మ నటించిన హర్రర్ ఎంటర్‌టైనర్ 'పరి'. ఇండియన్ క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీని వివాహమాడిన తర్వాత ఈ బ్యూటీ మొదటిసారిగా 'పరి'తో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. గత కొన్ని రోజులుగా ఈ చిత్రం టీజర్‌లతో బయటపెట్టిన ఈ భామ ఇప్పుడు ట్రైలర్‌తో సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. దెయ్యం ఎవరినీ వదిలిపెట్టదు అంటూ ఈ ట్రైలర్ ప్రేక్షకులను భయపెడుతోంది. ఇప్పటివరకు వచ్చిన టీజర్‌లలో అనుష్క పాత్ర గురించి ఎక్కువగా చూపించడం జరిగింది. ఇక ట్రైలర్ ద్వారా ఒక క్లారిటీ వచ్చింది. సినిమాలోని హీరోను దెయ్యం చంపడానికి ప్రయత్నిస్తుందని తెలిసిపోయింది. దెయ్యం చంపడానికి ప్రయత్నిస్తోంది... బయటకు వచ్చేసింది అంటూ ట్రైలర్‌లో అనుష్క చెబుతూ భయపెట్టింది. రొటీన్ హర్రర్ సినిమాలాగా కాకుండా పూర్తిగా కొత్తదనంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు దర్శకుడు ప్రొసిత్ రాయ్. కర్నేష్ శర్మ, ప్రేరణ అరోరా, అర్జున్ ఎన్.కపూర్‌లతో కలిసి అనుష్క శర్మ ఈ చిత్రాన్ని స్వయంగా నిర్మిస్తోంది. అనుష్క, పరంబ్రత ఛటర్జీ, రజత్ కపూర్, రితాబరి చక్రవర్తి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం మార్చి 2న ప్రేక్షకుల ముందుకురానుంది. విభిన్నమైన భావోద్వేగాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు ఫిల్మ్‌మేకర్స్. హోలీ పండుగ సందర్భంగా విడుదలవుతున్న ఈ చిత్రానికి అనుపమ్ రాయ్ దర్శకత్వం వహించాడు. ఇక సినిమా విడుదలకు ముందు తన భర్త విరాట్ కోసం అనుష్క 'పరి' స్పెషల్ షో వేయనున్నట్లు సమాచారం.



రిస్క్ అనుకుంటే భయపడాల్సిందే



నాని

నాని సమర్పణలో వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై రూపొందుతున్న చిత్రం 'అ!'. కాజల్ అగర్వాల్, రెజీనా కసండ్ర, ఈషా రెబ్బా, శ్రీనివాస్ అవసరాల, నిత్యామీనన్, మురళీశర్మ, ప్రియదర్శి తదితరులు ఈ చిత్రంలో ప్రధాన పాత్రల్లో నటించారు. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని ప్రశాంతి త్రిపిరినేని నిర్మించారు. ఈ చిత్రం శుక్రవారం విడుదలకానుంది. ఈ సందర్భంగా నానీతో ఇంటర్వ్యూ విశేషాలు...

☞ ఆశ్చర్యపడుతూ బయటికొస్తారు...

'అ!' చిత్రం చాలా కొత్తగా ఉంటుంది. ఇందులో రెగ్యులర్ రొటీన్ అంశాలేవీ ఉండవు. అన్ని రకాల ఎమోషన్స్ కలగలిసి ఉంటాయి. సినిమా చూసిన వాళ్లు థియేటర్లలో నుంచి ఆశ్చర్యపడుతూ బయటికొస్తారు.

☞ ఈ సినిమాకు కొద్దిగా ఎక్కువ గా...

నేను హీరోగా చేసిన మొదటి సినిమా విడుదలైనప్పుడు ఎలా కంగారుపడ్డానో 'అ!' చిత్రం విడుదల కోసం అలాగే కంగారుపడుతున్నాను. రిలీజ్ టెన్షన్ ప్రతి సినిమాకు ఉండేది. కానీ ఈ సినిమాకు కొద్దిగా ఎక్కువగా ఉంది.

☞ రిస్క్ గురించి ఆలోచించకుండా...

నిర్మాతగా నా మొదటి సినిమాను ప్రయోగాత్మకంగా చేయడం ఎంతో సంతృప్తినిచ్చింది. అయితే రిస్క్ అనుకుంటే ఏ పని చేయాలన్న భయపడాల్సిందే. అందుకే రిస్క్ గురించి ఆలోచించకుండా ఒక భిన్నమైన ప్రయత్నం చేస్తే బాగుంటుందని ఈ చిత్రాన్ని చేశాను.

☞ కొత్తదనం కోరుకునే వాళ్లకు...

ఈ సినిమా అందరికీ నచ్చుతుందని చెప్పలేను. ఇది కమర్షియల్ సినిమా కాదు. కాన్సెప్ట్ బేస్డ్ సినిమా. కానీ కొత్తదనం కోరుకునే వాళ్లకు తప్పకుండా నచ్చుతుంది.

☞ సగం సక్సెస్...

దర్శకుడు ప్రశాంత్‌వర్మ కథను రాసిన విధానం, వివరించిన తీరు నన్ను బాగా ఆకట్టుకున్నాయి. అసలు అలాంటి కథ రాయడంతోనే అతను సగం సక్సెస్ అయ్యాడు. అందుకే అతన్ని నమ్మాను. అతను కూడా నా నమ్మకాన్ని నిలబెట్టాడు.

☞ అది భావ్యం కాదు...

చిత్ర పరిశ్రమలోని ఎంతో మంది నిర్మాతలు నా ఎదుగుదలకు కారణమయ్యారు. ఈరోజు నాకు సొంత బ్యానర్ ఉందని వాళ్లను వదిలేసి నాకు నేనే సినిమాలు చేసుకోవడం భావ్యం కాదు. అందుకే నేను ఎప్పుడూ నా నిర్మాతలు, దర్శకులకు అందుబాటులోనే ఉంటాను.

☞ తమిళం, మలయాళం భాషల్లో...

'అ!' సినిమాను చూసి సత్యం సినిమాస్ వాళ్లు చాలా బాగుందని దీన్ని రీమేక్ చేయడం కంటే డబ్ చేసి విడుదల చేస్తే బాగుంటుందని అన్నారు. అందుకే తమిళం, మలయాళం భాషల్లోకి ఈ సినిమాను డబ్ చేసి రిలీజ్ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాం.

☞ కొంచెం ఆలస్యం కావచ్చు...

ఇకపై కూడా నిర్మాతగా సినిమాలు చేయాలనే ఉంది. కానీ హీరోగా నా సినిమాలు నాకున్నాయి. అందుకే నిర్మాతగా రెండవ సినిమా చేయడానికి కొంచెం ఆలస్యం కావచ్చు. ఇక మా బ్యానర్‌లో ప్రతి సినిమా కొత్తగానే ఉంటుంది.

నాగార్జునకు జోడీగా శ్రద్ధా శ్రీనాథ్



నాగార్జున

ఈ నెలలోనే నాగార్జున, నాని హీరోలుగా మల్టీస్టారర్ మూవీ ప్రారంభంకానుంది. తాజాగా ఈ మూవీలో ఓ హీరోయిన్‌ను ఎంపికచేశారు. సినిమాలో నాగార్జున సరసన కన్నడ బ్యూటీ శ్రద్ధా శ్రీనాథ్‌ను హీరోయిన్‌గా తీసుకున్నారని తెలిసింది. సినిమా ప్రారంభోత్సవం రోజున ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించబోతున్నారు. కన్నడలో 'యూ టర్న్' అనే హిట్ మూవీలో నటించింది శ్రద్ధా శ్రీనాథ్. ఇటీవల తమిళనాట హిట్ అయిన 'విక్రమ్ వేద' అనే సినిమాలో కూడా నటించి ఆకట్టుకుంది. సినిమా కథ ప్రకారం ఈ అమ్మాయి అయితే బాగుంటుందని దర్శకుడు శ్రీరామ్ ఆదిత్య భావించాడట. సినిమాలో వచ్చే ఫ్లాష్‌బ్యాక్‌లో నాగార్జున, శ్రద్ధా శ్రీనాథ్ మధ్య ఆసక్తికరమైన సన్నివేశాలు ఉంటాయట. వైజయంతి మూవీస్ బ్యానర్‌పై అశ్వనీదత్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నాడు. 'అ!' సినిమా విడుదలతో నాని ఈ సినిమాపై దృష్టిపెట్టబోతున్నాడు. ఇక రామ్‌గోపాల్ వర్మ సినిమా చేస్తున్నప్పటికీ నాగార్జున ఈ సినిమాకు కాల్షీట్లు కేటాయించాడు. కాబట్టి అన్నీ అనుకున్నట్టు జరిగితే ఈ నెలాఖరు నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఉంటుంది. మణిశర్మ ఈ చిత్రానికి సంగీతాన్ని అందించనున్నాడు.



శ్రద్ధా శ్రీనాథ్

కుటుంబమంతా కలిసి చూసే

సోడా గోలీ సోడా



మల్లూరి హరిబాబు, కృష్ణభగవాన్, నిత్య నరేష్, మానస్, సత్యసింధూజ, చక్రసీద్

ఎస్.బి.క్రియేషన్స్ పతాకంపై చక్రసీద్ సమర్పిస్తున్న చిత్రం 'సోడా గోలీ సోడా'. మొత్తం గ్యాస్ అనే ట్యాగ్‌లైన్‌తో మల్లూరి హరిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని సత్య సింధూజ నిర్మించారు. మానస్, నిత్య నరేష్, కారుణ్య హీరోహీరోయిన్లుగా నటించిన ఈ చిత్రాన్ని శుక్రవారం విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటైన విలేకరుల సమావేశంలో దర్శకుడు హరిబాబు మాట్లాడుతూ ''కుటుంబం మొత్తం కలిసి చూసే వినోదాత్మక చిత్రాన్ని తెరకెక్కించాలనే ఉద్దేశ్యంతోనే 'సోడా గోలీ సోడా' చిత్రాన్ని రూపొందించాము. సెన్సార్ పూర్తయి క్లీన్ యు సర్టిఫికెట్ వచ్చిన ఈ సినిమా రెండు గంటలపాటు ఆద్యంతం ప్రేక్షకులను నవ్విస్తుంది. ఇండస్ట్రీలోని కమేడియన్స్ అందరూ ఈ సినిమాలు నటించారు. ఒక మంచి సినిమా విడుదల కావాలంటే నిర్మాతల సహకారం కావాలి. ఆ సహకారాన్ని అందించిన ఈ చిత్ర నిర్మాతలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను''అని అన్నారు. హీరో మానస్ మాట్లాడుతూ ''సీనియర్ కమేడియన్స్ అందరూ ఈ చిత్రంలో ఉన్నారు. పూర్తి వినోదాత్మకంగా ఈ సినిమా ఉంటుంది. కుటుంబం మొత్తం హ్యాపీగా కలిసి చూసే సినిమా ఇదవుతుంది. భరత్ మ్యూజిక్ అద్భుతంగా ఉంది''అని చెప్పారు. కృష్ణ భగవాన్ మాట్లాడుతూ ''ఒక మంచి కథను ప్రేక్షకులకు అందించాలనే తపనతోనే దర్శక నిర్మాతలు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. అందరూ కష్టపడి పనిచేశారు. నాకు ఈ సినిమాలో మంచి పాత్ర ఇచ్చినందుకు థాంక్స్''అని తెలిపారు. బ్రహ్మానందం, అలీ, కృష్ణభగవాన్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః ముజీర్ మాలిక్, సంగీతంః భరత్, ఎడిటర్ః నందమూరి హరి, సహ నిర్మాతః భువనగిరి శ్రీనివాస మూర్తి, నిర్మాతః భువనగిరి సత్య సింధూజ, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంః మల్లూరి హరిబాబు.

పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రం



నిర్మాత సత్య సింధూజ

సోడా గోలీ సోడా... అంతా గ్యాసే. మా బ్యానర్‌లో వస్తున్న మొదటి సినిమా ఇది. పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రంగా తెరకెక్కించడం జరిగింది. మానస్, నిత్య, కారుణ్యలు ఎంతో ఇష్టంతో కష్టపడి ఈ సినిమా చేశారు. సీనియర్ నటులందరూ మాకు పూర్తిగా సహకరించారు. పాలకొల్లు అందాలు, హైదరాబాద్‌లోని బ్యూటిఫుల్ లొకేషన్స్‌లో షూటింగ్ జరిగింది. శుక్రవారం మా చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. మెసేజ్ ఓరియెంటెడ్ సినిమా కాబట్టి తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుందని నమ్ముతున్నాను''అని తెలిపారు.

'గాయత్రి' పైరసీ సీడీలు చూడొద్దు : మోహన్‌బాబు

డా. మంచు మోహన్‌బాబు ప్రధాన పాత్రలో అరియానా, వివియానా, విద్యా నిర్వాణ సమర్పణలో శ్రీ లక్ష్మీ ప్రసన్న పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మించిన చిత్రం 'గాయత్రి'. మదన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైంది. హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో డా.మంచు మోహన్ బాబు మాట్లాడుతూ ''ఈ చిత్ర నిర్మాతగా నా హృదయం ఏడుస్తోంది. గాయత్రి సినిమా రిలీజైన రోజునే ఇంటర్నెట్‌లో పెట్టారు. తొమ్మిది మాసాలు సినిమా కోసం కష్టపడ్డాను. చేతికి, మోకాలికి ఆపరేషన్ జరిగింది. సినిమాలో రిస్క్ తీసుకొని ఫైట్స్ చేశాను. సినిమా విడుదలైన రోజే పైరసీ సీడీలు వచ్చేశాయి. ఈ పైరసీ సీడీలను చూడవద్దని ప్రేక్షకులను కోరుతున్నాను. ఇక తండ్రి, కూతురి మధ్య అనుబంధాన్ని తెలియజేసే చిత్రమిది''అని అన్నారు. దర్శకుడు మదన్ మాట్లాడుతూ ''సినిమాకు మంచి ఆదరణ లభించింది. మోహన్‌బాబు స్క్రిప్ట్‌కు ప్రాధాన్యతనిచ్చి ఈ చిత్రాన్ని చేశారు. పరుచూరి బ్రదర్స్, రత్నం కలిసి చర్చించుకొని మంచి డైలాగ్స్ అందించారు''అని తెలిపారు.



డా.మోహన్‌బాబు
మదన్

నన్ను కొత్త కోణంలో చూస్తారు



సందీప్ కిషన్

మంజుల ఘట్టమనేని దర్శకత్వంలో సందీప్‌కిషన్ హీరోగా నటించిన చిత్రం 'మనసుకు నచ్చింది'. అమైరా దస్తూర్, త్రిదా చౌదరి హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ ''సినిమాలో నా పేరు సూరజ్. మధ్యతరగతి అబ్బాయిగా నటించాను. ఇందులో ప్రతి సన్నివేశం చాలా ఫ్రెష్‌గా అనిపిస్తుంది. ఇలాంటి పాత్రను, కథను నేను ఇంతవరకు చేయలేదు. అందుకే నాకు ఈ సినిమా స్పెషల్. ప్రేక్షకులు నన్ను ఒక కొత్త కోణంలో చూస్తారు. మంజుల డైరెక్షన్ ఎంతో బాగుంది. ఆమె చెప్పిన కథను చెప్పినట్టే స్క్రీన్‌పై తీసుకొచ్చారు. ఇదొక రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్. చిన్న పిల్లల దగ్గరి నుండి పెద్ద వాళ్ల వరకు అందరూ కలిసి కూర్చొని చూసే సినిమా ఇది. ఇక కార్తిక్ ఘట్టమనేనితో ఒక సినిమా చేస్తున్నా. నందిని అనే లేడీ డైరెక్టర్‌తో ఒక సినిమా చేస్తాను. కునాల్ కోహ్లీ సినిమా పూర్తయి పోస్ట్‌ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ఇవికాకుండా తమిళంలో కార్తీక్ నరేన్‌తో 'నరసూరన్' అనే సినిమా చేస్తున్నాను''అని అన్నారు.

ఆకాష్ 'కొత్తగా ఉన్నాడు'



'కొత్తగా ఉన్నాడు' ఆడియో వేడుకలో ఆకాష్, ప్రియ, సోనియా, ఎం.రాధా, ఎం.కె.రాజా, సురేష్ కొండేటి.

ఆకాష్ హీరోగా రాజా మీడియా వరల్డ్ సమర్పణలో తెరకెక్కిన చిత్రం 'కొత్తగా ఉన్నాడు'. జై బాలాజీ మూవీ మేకర్స్ పతాకంపై ఎం.కె.రాజా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆకాష్ సరసన ప్రియ, సోనియా హీరోయిన్‌లుగా నటించిన ఈ చిత్రానికి ఎం.రాధా దర్శకత్వం వహించారు. యు.కె.మురళి సంగీతాన్ని సమకూర్చారు. ఈ చిత్రం ఆడియో వేడుక హైదరాబాద్‌లోని ప్రసాద్‌ల్యాబ్స్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆడియోతో పాటు ట్రైలర్‌ను కూడా విడుదల చేశారు. ఈ వేడుకలో ఆకాష్, ఎం.కె.రాజా, యు.కె.మురళి, సురేష్ కొండేటి, జైరామ్, దినేష్ మాడ్నే, రవిశర్మ, బాల్‌రెడ్డి, బలవంత్ రెడ్డి, ఆర్తి సురేష్, సుమ, లక్కీ, వేణు పాల్గొన్నారు. టైటిల్‌లాగే సినిమాలో ఆకాష్ చాలా కొత్తగా ఉన్నాడని... ఈ సినిమాతో అతనికి పెద్ద హిట్ రావాలని వేడుకలో పాల్గొన్న వారంతా ఆకాంక్షించారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే కూడా సమకూర్చిన హీరో ఆకాష్ మాట్లాడుతూ ''లండన్ నేపథ్యంలో జరిగే ఈ కథలో ఆంధ్ర కుర్రాడిగా, తెలంగాణ కుర్రాడిగా రెండు షేడ్స్ కలిగిన పాత్రలో నటించాను. విక్రమ్ 'అపరిచితుడు' తరహాలో ఈ చిత్రం అందరినీ అలరిస్తుంది''అని తెలిపారు. ఆకాష్ ప్రోత్సాహాన్ని ఎప్పటికీ మరువలేనని... ఈ చిత్రానికి అన్ని పాటలు బాగా కుదిరాయని మ్యూజిక్ డైరెక్టర్ యు.కె.మురళి అన్నారు. నిర్మాత ఎం.కె.రాజా మాట్లాడుతూ ''కొత్తగా ఉన్నాడు సినిమాతో తెలుగు సినిమా నిర్మాణ రంగంలోకి అడుగుపెడుతుండడం ఆనందంగా ఉంది. ఈ చిత్రంతో తనకు మంచి బోణీ లభిస్తుందనే నమ్మకం ఉంది''అని చెప్పారు.



6 నెలల కనిష్టానికి టోకు ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: వరుసగా రెండో నెలలో దేశీయ టోకు ధరల సూచీ(డబ్ల్యుపిఐ) ఆధారిత ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టింది. ఆహార, ఇంధన ధరలు తగ్గడంతో జనవరి నెలలో డబ్ల్యుపిఐ 2.84 శాతానికి దిగివచ్చిందని కేంద్ర గణాంకాల శాఖ వెల్లడించింది. ఇంతకుముందు 2017 డిసెంబర్‌లో సూచీ 3.58 శాతంతో పోలిస్తే ఈసారి దిగిరావడం సానుకూల అంశమేనని నిపుణులు అంటున్నారు. గత ఏడాది నవంబర్ నెలలో ఈ ద్రవ్యోల్బణం ఎనిమిది నెలల గరిష్టానికి(3.93 శాతం) ఎగిసిన విషయం తెలిసిందే. ఆ తర్వాతి నెల డిసెంబర్ నుంచి ద్రవ్యోల్బణం తగ్గుతూ వస్తోంది. రాయిటర్స్ పోల్ అంచనాల ప్రకారం ఈ ద్రవ్యోల్బణం 3.25 శాతంగా నమోదవుతుందని తెలిసింది. అయితే అంచనాల కంటే తక్కువగానే ద్రవ్యోల్బణం కిందకి దిగి వచ్చింది. ముందటి నెలతో పోలిస్తే టోకు ఆహార ధరలు జనవరిలో ఏడాది ఏడాదికి కేవలం 1.65 శాతం మాత్రమే పెరిగాయి. అటు రిటైల్ ద్రవ్యోల్బణం కూడా స్వల్పంగా దిగివచ్చి ఊరటనిచ్చింది. డిసెంబరు నాటి 17 నెలల గరిష్టంతో పోలిస్తే జనవరి నెలలో స్వల్పంగా తగ్గి 5.07శాతంగా నమోదైంది. అయితే రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా మధ్యస్థ లక్ష్యం 4 శాతం కంటే ఎక్కువగానే ఉంది.

రూ. 8.25 శాతం వడ్డీకే ఇండియన్ బ్యాంక్ గృహ రుణాలు

మన తెలంగాణ/ హైదరాబాద్ : గృహ రుణాలను రూ. 8.25 శాతం వడ్డీకే ఎలాంటి గరిష్ట సీలింగ్ లేకుండా వినియోగదారులకు అందిస్తున్నట్లు ఇండియన్ బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. రుణాలు పొందే వినియోగదారులు ప్రతి లక్ష రూపాయలకు నెల వారీ ఇఎంఐ కింద రూ. 751 చెల్లించాల్సి ఉంటుందని, పూర్తి రుణాన్ని చెల్లించేందుకు గరిష్ట పరిమితి 30 ఏళ్ల వరకు ఉంటుందని ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ ఆర్. మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ జంట నగరాల్లో గృహ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వినియోగదారులకు కేవలం 24 గంటల వ్యవధిలోనే రుణాలను మంజూరు చేస్తున్నామని మనోహర్ వెల్లడించారు. సాధారణంగా ఇతర బ్యాంకులు, సంస్థల తరహాలో ఎలాంటి కఠిన నిబంధనలు తాము వినియోగదారులకు విధించడం లేదన్నారు.

బిఎస్‌ఎన్‌ఎల్ ప్రిపెయిడ్ కస్టమర్లకు ఇంటర్నేషనల్ రోమింగ్ సౌకర్యం

మన తెలంగాణ/ హైదరాబాద్ : బిఎస్‌ఎన్‌ఎల్ తన ప్రీ పేయిడ్ కస్టమర్లకు యూనిలేటరల్ ప్రీ పేయిడ్ ఇంటర్నేషనల్ రోమింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. అయితే ప్రస్తుత సిమ్ స్థానంలో ప్రీ పేయిడ్ డుయల్ ఐఎంఎస్ఐ సిమ్‌లను తీసుకుని వినియోగించుకోవాల్సి ఉంటుందని బిఎస్‌ఎన్‌ఎల్ తెలంగాణ టెలికం సర్కిల్ సిజిఎం వి. సుందర్ తెలియజేశారు. ఈ ప్రీపేయిడ్ డ్యుయల్ ఐఎంఎస్ఐ సిమ్ ద్వారా బిఎస్ఎన్ఎల్ ప్రీ పేయిడ్ కస్టమర్లు అమెరికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలకు చెందిన ఎం/ఎస్ టి– మొబైల్ పార్ట్‌నర్ షిప్ కల్గిన వినియోగదారులతో మాట్లాడుకోవచ్చని తెలిపారు. అలాగే యుఎస్ఏ, యుఏఈ దేశాల్లోని తమ వారితో నేరుగా మాట్లాడుకోవచ్చని తెలిపారు. ఇంటర్నేషనల్ రోమింగ్ సౌకర్యానికి సంబంధించి మరిన్ని వివరాల కోసం డబ్ల్యూడబ్లూడబ్లూ. ఐఆర్. బిఎస్ఎన్ఎల్. కో. ఇన్‌కు గానీ, లేదా 1503కి గానీ కాల్ చేయవచ్చని సిజిఎం సుందర్ తెలిపారు.

జెట్ ఎయిర్వేస్‌కు క్యూ3 ఫలితాల సెగ

న్యూఢిల్లీ: ప్రైవేటు విమానయాన సంస్థ జెట్ ఎయిర్‌వేస్ షేరుకు క్యూ3 ఫలితాల ప్రభావం కనిపిస్తోంది. గురువారం ఈ షేరు 6 శాతం పడిపోయి రూ.757.55 వద్ద స్థిరపడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం(అక్టోబర్–డిసెంబర్)లో విమానయాన సంస్థ జెట్ ఎయిర్వేస్ ఆశించిన స్థాయిలో ఫలితాలను సాధించలేదు. దీంతో గురువారం బిఎస్ఇలో రూ.785.00ల వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించిన కంపెనీ షేరు ఇంట్రాడేలో 7 శాతానికి పైగా పతనమైంది. ఓ దశలో రూ.748.80 కనిష్టస్థాయికి పతనమైంది. షేరు ఏడాది కనిష్ట, గరిష్ట ధరలు వరుసగా రూ.363.00లు, రూ.883.00లుగా నమోదయ్యాయి. క్యూ3 ఫలితాల్లో జెట్ ఎయిర్‌వేస్ నికర లాభం 46 శాతం క్షీణించింది. ఈ క్యూ3లో రూ.165 కోట్ల నికరలాభాన్ని నమోదు చేయగా, గతేడాది ఇదే క్యూ3లో రూ.305 కోట్ల నికరలాభాన్ని సాధించింది. మొత్తం వ్యయాలు రూ.5,635 కోట్ల నుంచి రూ.6,184 కోట్లకు పెరిగాయి. నిర్వహణ ఆదాయం రూ. 8 కోట్ల నుంచి రూ.128 కోట్లకు పెరిగింది.

స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	34297.47	141.52	0.41%
నిఫ్టీ	10545.50	44.60	0.42%

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	29250	31283.42	1.25%
ముంబై	29760	31828.88	0.4%
ఢిల్లీ	29200	31229.95	0.34%
కోల్‌కతా	29890.99	31968.97	0.34%
కేరళ	28250	30213.90	0.71%
బెంగళూరు	28700	30695.19	1.41%
హైదరాబాద్	29250	31283.42	1%
గల్ఫ్	1412.55	1510.75	0.05%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	40600.00	40900.00	–0.73
ముంబై	40600.00	40900.00	–0.73
ఢిల్లీ	40600.00	40900.00	–0.73
కోల్‌కతా	40600.00	40900.00	–0.73
హైదరాబాద్	40600.00	40900.00	–0.73



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	391	విశాఖపట్నం	400
వరంగల్	388	చిత్తూరు	393
విజయవాడ	392	చెన్నై	400
గోదావరి	392	బెంగళూరు	400

నీరవ్ మోడీ సామ్రాజ్యం



వయసు :
47 సంవత్సరాలు

నివాసం :
ముంబయి, మహారాష్ట్ర

వివాహం : అయింది

జాతీయత :
భారతీయుడు

విద్య : వార్టన్ బిజినెస్ స్కూల్ డ్రాపౌట్

వృత్తి : డైమండ్, జువెలరీ డిజైనర్

నికర ఆస్తుల విలువ :
1.73 బిలియన్ డాలర్లు
(రూ.173 కోట్లు)

దేశీయ రెండో అతిపెద్ద ప్రభుత్వరంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో రూ.11,400 కోట్ల మోసం ఆరోపణల్లో నీరవ్ మోడీ ప్రధాన వ్యక్తి.. డిజైనింగ్, నగల తయారీలతో రిటైల్ నెట్‌వర్క్‌ను నడుపుతున్న ఈయనకు సుమారు 10 దేశాల్లో 26 అనుబంధ సంస్థలున్నాయి. ఆస్తులను విక్రయించడం ద్వారా సుమారు రూ.6 వేల కోట్ల తిరిగి చెల్లిస్తానని నీరవ్ మోడీ ఆఫర్ చేసినట్టు బ్యాంకు అధికార వర్గాల సమాచారం. మోడీ ఫైర్‌స్టార్ ఇంటర్నేషనల్ పబ్లిక్ లిమిటెడ్‌కు ప్రమోటర్, మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఉన్నాడు. నీరవ్ తన కంపెనీని 2004 ఏప్రిల్ 1న మార్చు చేశాడు. తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించేందుకు నిధుల సమీకరణలో భాగంగా గత ఏడాది డిసెంబర్‌లో పబ్లిక్ లిమిటెడ్‌లోకి ప్రవేశించారు.

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకును రూ. 11,400 కోట్ల మేరకు మోసం చేసిన నిరవ్ మోడీ వజ్రాల వ్యాపారిగా చాలా ప్రసిద్ధుడు. ఆయన తరచూ అంతర్జాతీయ ప్రముఖ ఆర్థిక దినపత్రికలు, ఫ్యాషన్ మేగజైన్లలో కనిపించేవాడు. లండన్‌లోని 31 ఓల్డ్ బాండ్ స్ట్రీట్, న్యూయార్క్‌లోని 727 మాడిసన్ అవెన్యూలో ఉన్న ఆయన స్టోర్ల ప్రకటనలు ప్రముఖ దినపత్రికలు, మేగజైన్లలో ప్రచురితమవుతుంటాయి. ముంబయిలోని కొలాబాలో 2016లో మూతపడిన రిథమ్ హౌస్ ఉన్న చోటే త్వరలో ఆయన ఆభరణాల స్టోరు వెలయాల్సి ఉంది. వీటికి తోడు ఆయన ఆభరణాల ఉత్పత్తులకు బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ నటి ప్రియాంక చోప్రా ఉంది. ఇదంతా ఆయన ఒకప్పటి వైభోగం. కానీ నేడు కొన్ని తప్పుల కారణంగా నీరవ్ మోడీ జీవిత గతే మారిపోయింది.

నీరవ్ మోసంపై అనేక సంస్థల దర్యాప్తులు

కోటీశ్వరుడైన 47 ఏళ్ల వ్రజాల వ్యాపారి నీరవ్ మోడీ జీవితం గత కొంత కాలంగా కొడిగట్టింది. 2014లో ఆయన ఫోర్బ్ సంపన్నుల జాబితాలో మొదటిసారి దర్శనమిచ్చినప్పటి నుంచి ఆయనపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి), ఆదాయపు పన్ను శాఖ(ఐటి) ఆయనపై నిఘా పెట్టడమే కాక వెంటాడుతున్నాయి. ఆయన అక్రమలావాదేవీలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి.ఇప్పటికైతే సిబిఐ ఆయన పంజాబ్ నేషనల్ బ్యాంకులో చేసిన రూ. 280 కోట్ల మోసంపైనే దృష్టి సారించి దర్యాప్తు చేపట్టింది. అక్రమ నగదు చలామణి(మనీ లాండరింగ్) కింద ఇడి కేసు నమోదు చేసింది.

సంగీతకారుడు కావాలనే కోరిక...

నీరవ్ మోడీ భారత్‌లోనే పుట్టినప్పటికీ పెరిగిందంతా వజ్రాలా నగరమైన బెల్జియంలోని ఆంట్వెర్ప్‌లో. కుటుంబవారసత్వంగానే ఆయన వజ్రాల వ్యాపారంలోకి వచ్చారు. ఇంట్లో భోజనాల సమయంలో కుటుంబసభ్యులతో ఆయన వజ్రాల సైజు, దాన్ని కోసిన తీరు వగైరాల గురించి చర్చించేవాడు. కానీ ఆయన పెరిగి పెద్దవుతున్న రోజుల్లో ఆయనకు వజ్రాల వ్యాపారి కావాలన్న ఆలోచన ఉండేది కాదు. ఎంతో మృదువుగా మాట్లాడే ఆయన మొదట్లో సంగీతకారుడు కావాలనుకున్నారు. దాంతో ఆయనకు హైఫై మ్యూజిక్ సిస్టమ్‌లపై మక్కువ ఏర్పడింది. ఆయన బ్యాంగ్, ఒలుఫ్‌సెన్ వంటిచోట్ల ఉత్తమమైన మ్యూజిక్ సిస్టమ్స్ కోసం వెదికేవాడు. అయితే సంగీతకారుడు కావాలనుకున్న తన ఆశ నెరవేరకపోయేసరికి ఆయన తన మేనమామ కుటుంబ వ్యాపారం అయిన గీతాంజలి జెమ్స్ లిమిటెడ్‌లో చేరారు. పెన్సిల్వేనియాకు చెందిన వార్టన్ స్కూలు నుంచి చదువు మానేసిన 19 ఏళ్లకే ఆయన కుటుంబ వ్యాపారంలో చేరారు. ఆయన మేనమామ మెహుల్ చోక్సీ గీతాంజలి జెమ్స్ ఛైర్మన్. సిబిఐ దర్యాప్తులో ఆయన కూడా నిందితుడుగా ఉన్నారు.

స్వంత నగల వ్యాపారం

నీరవ్ మోడీ స్వంతంగా నగల వ్యాపారం మొదలెట్టడానికి గీతాంజలి జెమ్స్ లిమిటెడ్‌లో మొదట్లో పనిచేసిన ఆయన చేసిన తొమ్మిదేళ్ల పునాదులయ్యాయి. మోడీ కంపెనీలు ఉపయోగిస్తున్నట్లుగానే గీతాంజలి గ్రూప్ కంపెనీలు కూడా గ్యారంటీ లేక కంఫర్ట్ లెటర్స్ ఉపయోగిస్తున్నాయని పిఎన్‌బి ఇతర రుణదాత బ్యాంకులను హెచ్చరించింది. కుంభకోణాల నేపథ్యంలో మోడీ సంస్థతో చోక్సీకి ఎలాంటి సంబంధాలు లేవని గీతాంజలి జెమ్స్ లిమిటెడ్ ఫిబ్రవరి 7న స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. పైగా 1999లోనే చోక్సీ భాగస్వామిగా రిటైర్ అయ్యారని పేర్కొంది. కొన్నేళ్లలోనే ఆయన క్రిస్టీ వేలం కెటలాగ్ కవర్‌పై చోటు సంపాదించిన తొలి భారతీయుడిగా 2010లో ప్రసిద్ధుడయ్యాడు. ఆయన తయారు చేసిన గోల్కొండ వజ్రాల హారం హాంకాంగ్‌లో జరిగిన వేలంలో 30 లక్షల 56 వేల డాలర్లు ఆర్జించింది. 2012 అక్టోబర్‌లో రివియర్ వజ్రాల హారం హాంకాంగ్‌లోనే సోథెబి వేలంలో 50 లక్షల 10 వేల డాలర్లు ఆర్జించింది. 2013లో నీరవ్ తొలిసారి ఫోర్బ్ జాబితాలో కోటీశ్వరుడిగా స్థానం సంపాదించాడు.

ఎవరినీ వదిలిపెట్టం




వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ మోసం కేసులో ఎవరినీ వదిలిపెట్టబోమని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. ప్రతిపక్షం ప్రధాని నరేంద్ర మోడీవైపు వేలెత్తి చూపడాన్ని ఆయన తప్పుబట్టారు. రూ. 1300 కోట్ల ఆస్తులను జప్తు చేశామని, నీరవ్ మోడీ గాలింపుకు నోటీసులు జారీ చేశామని మంత్రి తెలిపారు. 'మేము ఒకటి స్పష్టం చేయదలుచుకున్నాం. దీనిని ప్రభుత్వం తరఫున నేను ప్రకటిస్తున్నాను. నీరవ్ మోడీకి సాయపడేందుకు అవినీతికి పాల్పడిన బ్యాంకు సిబ్బంది ఎవరినైనా వదిలిపెట్టే ప్రసక్తేలేదు' అని మంత్రి తెలిపారు. 'ఛోటా మోడీ' అనడం ఏమిటి...ఇది అగౌరవపరిచేదిగా ఉందంటూ ఆ మాటను ఉపయోగిస్తున్న ప్రతిపక్షాన్ని ఆయన విమర్శించారు. దీనికి ముందు రోజున నీరజ్ మోడీని రక్షిస్తున్నారు అంటూ కాంగ్రెస్ ప్రతినిధి రణదీప్ సుర్జేవాలా చెప్పారు. ఇదిలా ఉండగా నీరవ్ మోడీ పాస్‌పోర్ట్‌ను ఉపసంహరించాలని ఆల్ ఇండియా రేడియో తన ట్వీట్‌లో పేర్కొంది.

అన్ని బ్రాంచ్‌లలో విచారణ : పిఎన్‌బి సిఎండి



పంజాబ్ నేషనల్ బ్యాంక్ మోసం కేసులో ఎవ్వరినీ ఉపేక్షించే ప్రసక్తే లేదని బ్యాంక్ ఎండి, సిఇఒ సునీల్ మెహతా తెలిపారు. పిఎన్‌బి ముంబై బ్రాంచ్‌లో రూ.11 వేల కోట్ల లావాదేవీల మోసం వెలుగుచూసిన నేపథ్యంలో ఆయన మీడియా సమావేశంలో ఈవిధంగా అన్నారు. క్లీన్ బ్యాంక్ కోసం ప్రయత్నిస్తున్నామని, 2011 సంవత్సరంలో ప్రారంభమైన ఈ మోసం గురించి రెగ్యులేటరీ దృష్టికి తీసుకొచ్చామని అన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలు త్వరలో ఈ కుంభకోణంలోని నిజాలను బయటపెడతారని, మోసానికి పాల్పడిన వారెవరినీ వదిలే ప్రసక్తి లేదని మెహ్తా స్పష్టం చేశారు. జనవరి 25న ఈ మోసాన్ని గుర్తించి.. సిబిఐతో సహా దర్యాప్తు సంస్థలకు సమాచారం అందించామని అన్నారు. ఈ మోసం లావాదేవీలు ఒక్క బ్రాంచ్‌లోనే గుర్తించామని, ఇతర బ్రాంచ్‌లలో లేవని తెలిపారు. ఇతర దేశాల్లోని భారతీయ బ్యాంకుల్లో ఈ లావాదేవీల ప్రభావం ఉంటుందని, తమ అన్ని బ్రాంచ్‌లలోనూ విచారణ చేపడుతున్నామని మెహతా వెల్లడించారు.

రూ.5100 కోట్ల ఆస్తులు సీజ్



బిలియనీర్ నిరవ్ మోడీకి చెందిన అనేక ఆస్తులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) సోదాలు నిర్వహించింది. ముంబై, ఢిల్లీ, గుజరాత్ వంటి నగరాల్లోని పలు ప్రాంతాల్లో ఇడి దాడులు చేసింది. సోదాల్లో రూ.5,100 కోట్ల విలువచేసే వజ్రాలు, నగలు, బంగారాన్ని ఇడి స్వాధీనం చేసుకుంది. నిరవ్ మోడీ, ఆయన భార్య అమి, సోదరుడు నిశాల్, వ్యాపార భాగస్వామి మెహుల్ చోక్సిపై రూ.280 కోట్ల మనీ లాండరింగ్ కేసును పిఎన్‌బి దాఖలు చేసిన తర్వాత ఇడి ఈ దాడులు చేపట్టింది. మోడీ, అలాగే ఇతర నిందితులకి చెందిన ఐదు ఆస్తులను సీల్ చేశామని అధికారి వెల్లడించారు. ఈ కేసులో 10 ప్రాంగణాల్లో తమ అధికారులు సోదాలు చేశారు. కుర్లాలో నిరవ్‌కి చెందిన నివాసం, కాలా ఘోడా ప్రాంతంలో జువెలరీ బోటిక్, ముంబైలోని బాంద్రా, లోయర్ పారెల్‌లో మూడు కంపెనీ ఆఫీసులు, గుజరాత్‌లోని సూరత్‌లో మూడు ప్రాంగణాలు, ఢిల్లీలోని డిఫెన్స్ కాలనీ, చాణక్యపురిలో మోడీ షోరూంలలో దాడులు చేశామని అధికారులు తెలిపారు. నిరవ్ పాస్‌పోర్ట్‌ను రద్దు చేయాలని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖను కోరనున్నామని అన్నారు.

స్వల్పంగా పుంజుకున్నాయ్..

- 141 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్
- 1 శాతం పడిపోయిన మిడ్ క్యాప్
- పిఎస్‌యు బ్యాంకులను ముంచిన పిఎన్‌బి నష్టాలు



ముంబై: అంతర్జాతీయ మార్కెట్లలో లాభాల నేపథ్యంలో గురువారం సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు పుంజుకున్నాయి. ఇన్వెస్టర్ల భారీ కొనుగోళ్లతో సెన్సెక్స్ 141 పాయింట్లు లాభంతో 34,297 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 45 పాయింట్లు బలపడి 10,545 వద్ద ముగిశాయి. జనవరి గణాంకాల్లో ద్రవ్యోల్బణ సూచి దిగివచ్చిందనే అంశంతో ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్ని ఇచ్చాయి. ఉదయమే పటిష్ట లాభాలతో ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. సెన్సెక్స్ 145 పాయింట్లు లాభపడి 34,301 వద్ద మొదలయ్యింది. ప్రధానంగా మెటల్, బ్యాంకింగ్, ఐటీ షేర్లల్లో భారీ కొనుగోళ్లు సూచీలను లాభాల ర్యాలీని చేయించాయి. మెటల్, ప్రైవేట్ రంగ బ్యాంకు, ఫైనాన్షియల్ సర్వీస్, ఎఫ్ఎంసిజి, ఐటీ రంగాలకు చెందిన సూచీలు లాభపడ్డాయి. మరోవైపు పిఎస్‌యు, రియాల్టీ, మీడియా రంగాలకు చెందిన షేర్లు 1 శాతం నష్టపోయాయి. ఎన్ఎస్ఇలోని కీలకమైన నిఫ్టీ బ్యాంక్ 83 పాయింట్లు లాభపడి 25,424 పాయింట్ల వద్ద స్థిరపడింది. అమెరికా మార్కెట్లలో భారీ ర్యాలీతో పాటు గురువారం ఉదయం కొన్ని ప్రధాన ఆసియా మార్కెట్లు లాభాలతో ట్రేడ్‌కావడం దేశీయ మార్కెట్లకు బలాన్ని ఇచ్చింది. ట్రేడింగ్ తొలిదశలో అటు ఇన్వెస్టర్లు, ఇటు ట్రేడర్లు కొనుగోళ్లకు మద్దతు ఇవ్వడంతో సూచీలు స్థిరమైన ర్యాలీని చేశాయి. ఈ నేపథ్యంలో సెన్సెక్స్ 380 పాయింట్లు లాభపడి 34,535.08 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని నమోదు చేయగా, మిడ్ సెషన్ తరువాత అమ్మకాలు పెరగడంతో సూచీలు గరిష్టస్థాయి నుంచి 300 పాయింట్ల మేర పడిపోయాయి. ప్రధానంగా ఐసిఐసిఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, ఒఎన్‌జిసి, బజాజ్ ఆటో లాభపడ్డాయి. అమెరికా బాండ్ల లాభాల నేపథ్యంలో గత కొద్ది రోజులుగా దేశీ స్టాక్స్‌లో ఎఫ్‌పిఐ(విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు) భారీ అమ్మకాలకు పాల్పడుతున్నారు. బుధవారం నగదు విభాగంలో ఎఫ్‌పిఐలు రూ.729 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించారు. దేశీ ఫండ్స్(డిఐఐ) కూడా రూ. 152 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి.

పిఎన్‌బి షేరు 13 శాతం డౌన్

భారీ కుంభకోణం వెలుగు చూసిన నేపథ్యంలో పంజాబ్ నేషనల్ బ్యాంకు షేరుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. స్టాక్‌మార్కెట్లో బ్యాంక్ షేర్లు షేర్లు భారీగా నష్టపోతున్నాయి. కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న నిరావ్ మోడి జువెలరీ కంపెనీలు కూడా పెద్ద మొత్తం నష్టాలను చూస్తున్నాయి. పిఎన్‌బి షేరు బుధవారం కూడా 10 శాతం పతనమైంది. గురువారం ఉదయం ట్రేడింగ్‌లో షేరు విలువ అత్యంతగా 13 శాతం పడిపోయింది. మార్కెట్లు ప్రారంభంలో బిఎస్ఇలో పిఎన్‌బి షేరు విలువ రూ.137 వద్ద ప్రారంభమైంది. ఆ తర్వాత మెల్లగా నష్టాల్లోకి జారుకుంటూ 12.89 శాతం నష్టపోయి రూ.127.05కు చేరింది. పంజాబ్ నేషనల్ బ్యాంకులో సుమారు రూ.11,400 కోట్ల భారీ మోసం బయటపడిన సంగతి తెలిసిందే. అత్యంత సంపన్నుడైన ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, మరో ఆభరణాల కంపెనీ ఈ మేరకు మోసపూరిత లావాదేవీలకు పాల్పడినట్లు బ్యాంకు వర్గాలు సిబిఐకి ఫిర్యాదు చేశాయి.

జనవరిలోనే దేశం విడిచిన నీరవ్ మోడీ కుటుంబం

ముంబయి: దాదాపు రూ. 280 కోట్ల మేరకు మోసం చేశాడని పంజాబ్ నేషనల్ బ్యాంకు చేసిన ఫిర్యాదు సిబిఐకు అందక ముందే జనవరి 1న ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ దేశం వదిలి పారిపోయారు. ఆయన కుటుంబ సభ్యులు సైతం దేశం వదిలిపోయారు. ఆయన సోదరుడు, బెల్జియం నివాసి నిశాల్ కూడా జనవరి 1న దేశం వదిలి పారిపోయారు. కాగా అమెరికా పౌరసత్వం ఉన్న ఆయన భార్య అమీ, ఆయన వ్యాపార భాగస్వామి, గీతాంజలి జ్వెల్లరీ చైన్ ఇండియన్ ప్రమోటర్ మెహుల్ చోక్సీ జనవరి 6న పారిపోయారని అధికారులు తెలిపారు. వారందరిపై ఎఫ్ఐఆర్‌ను మొదట నమోదు చేసుకున్నాకే సిబిఐ ఆ నలుగురి గాలింపు సర్క్యులర్‌ను జారీ చేసింది. నౌకాశ్రయంలో ప్రవేశించినా, వెళ్లినా...వారి ఎలాంటి కదలికల ఆచూకీ గుర్తించినా తెలుపాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు గాలింపు సర్క్యులర్‌లను జారీ చేశాయి. ప్రస్తుతం నీరవ్ మోడీ స్విట్జర్లాండ్‌లో ఉన్నారని భావిస్తున్నారు. నీరవ్ మోడీ భారతీయ పౌరుడే అయినప్పటికీ ఆయన సోదరుడు నిశాల్, భార్య అమీ భారతీయ పౌరులు కాదని అధికారులు తెలిపారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు మంగళవారం మరి రెండు ఫిర్యాదులను సిబిఐకు పంపింది. కుంభకోణం రూ. 11,400 కోట్లకుపైగానే ఉంటుందని తన తాజా ఫిర్యాదుల్లో పేర్కొంది.

జువెలరీ షేర్లు డమాల్



ముంబై : పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ)లో జరిగిన రూ.11,300 కోట్ల కుంభకోణం నేపథ్యంలో గురువారం ఈ బ్యాంకు షేరు మరో 13 శాతం పతనమైంది. ఈ కుంభకోణంలో ప్రధాన నిందితుడు వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీతో సహా మూడు బడా జ్యుయలరీ సంస్థలపై దర్యాప్తు సంస్థలు దృష్టిసారించాయి. దీంతో ఈ జ్యువెలరీ స్టాక్స్‌లోనూ ఇన్వెస్టర్లు అమ్మకాలు పెంచారు. ఈ కారణంగా పలు జువెలరీ కంపెనీలు నష్టాల్లో ముగిశాయి. వాటిలో పిసి జ్యువెలర్స్ షేరు విలువ ఇంట్రాడేలో 19శాతం వరకూ పతనమైన రూ.303.00 కనిష్టస్థాయిని తాకింది. ఆ తర్వాత ఆఖరి సమయంలో కోలుకుని 4.65 శాతం నష్టపోయి రూ.358.60 వద్ద ముగిసింది. ఇక గీతాంజలి జెమ్స్ భారీగా 20 శాతం వరకు పతనమైంది. 52వారాల కనిష్ట ధరకు చేరింది. గతముగింపు ధర రూ.58.6తో పోలిస్తే 19.93 శాతం క్షీణతతో.46.80ల వద్ద ముగిసింది. ఇక తంగమాయిల్ జ్యువెలరీ 5 శాతం వరకు పతనమై రూ.537.80 స్థాయికి క్షీణించింది.

అమర జవాన్ అంత్యక్రియలకు హాజరై ఉంటే మళ్లీ బతికేవాడా?



పాట్నా: అమర జవాన్ అంత్యక్రియలకు తాను హాజరై ఉంటే ఆయన మళ్లీ బ్రతికే వాడా అంటూ బీహార్ మంత్రి వినోద్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అమర జవాన్ ముజాహిద్ ఖాన్ అంత్యక్రియల్లో నితీశ్ కుమార్ ప్రభుత్వంలోని ఒక్క మంత్రి కూడా హాజరుకాకపోవడంపై వివాదం కొనసాగుతోంది. జవాన్ అంత్యక్రియలకు హాజరు కాకపోవడాన్ని సమర్థించుకున్న మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కటియార్ నుంచి పైరోకు ఎంత దూరం ఉందో మీడియాకు తెలియదా అంటూ ప్రశ్నించిన మంత్రి, దాదాపు 400 కిలో మీటర్ల దూరం ప్రయాణించి తాను ఇక్కడికి వచ్చానని చెప్పారు. అమర జవాన్ కుటుంబాన్ని కలుసుకోనున్నట్లు వినోద్‌సింగ్ తెలిపారు. శ్రీనగర్‌లోని కరాన్‌నగర్‌లో ఉన్న సిఆర్‌పిఎఫ్ 23వ బెటాలియన్‌పై సోమవారం ఉగ్రవాదులు జరిపిన దాడిలో ముజాహిద్ ఖాన్ మృతి చెందారు. బుధవారం అధికారిక లాంఛనాలతో అమర జవాన్‌కు అం త్యక్రియలు నిర్వహించారు. కాగా, జవాన్ అంత్యక్రియలకు ఒక్క మంత్రి కూడా హాజరు కాకపోవడంపై నితీశ్‌కుమార్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ట్వీట్ చేశారు.

పురుషోత్తంరెడ్డి అత్తగారింటికి వేసిన సీలును తొలగించండి



మన తెలంగాణ/ హైదరాబాద్ : రాబడికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణల కేసులో హెచ్ఎండిఎ డైరెక్టర్ (ప్రణాళిక విభాగం) పురుషోత్తంరెడ్డి అత్త సుదేష్ణ ఇంటికి ఎసిబి అధికారులు వేసిన సీలును తొలగించాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. పోలీసులు చట్ట ప్రకారం మాత్రమే చేయాలని, అవసరం అనుకుంటే సిఆర్‌పిసిలోని 41ఎ సెక్షన్ కింద నోటీసు జారీ చేసి విచారణ చేయాలని గురువారం హైకోర్టు మధ్యంతర ఆదేశాలిచ్చింది. తన ఇంటికి సీలు వేశారని, పురుషోత్తమ్ రెడ్డి ఎక్కడున్నారో చెప్పాలని ఎసిబి పోలీసులు వేధిస్తున్నారని పేర్కొంటూ ఆయన అత్త సుదేష్ణ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని గురువారం హైకోర్టు న్యాయమూర్తి ఎవి శేషసాయి విచారణ జరిపారు. చెప్పినట్లు చేయకపోతే కేసుల్లో ఇరికిస్తామని బెదిస్తున్నారని ఆమె లాయర్ వాదించారు. ఇప్పటికే పురుషోత్తమ్‌రెడ్డి ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయనే కేసులో ఆయన అల్లుడు నిపుణ్‌రెడ్డి, బావ మరిది శ్రీనివాస్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం విదితమే.

విమానం కూలి ఇద్దరు పైలట్లు మృతి

గువాహటి: అసోంలో మైక్రోలైట్ విమానం కూలిపోవడంతో భారత వైమానిక దళానికి చెందిన ఇద్దరు పైలట్లు మృతి చెందారు. గురువారం మధ్యాహ్నం మజులి జిల్లాలోని ప్రపంచంలోనే అతిపెద్ద నదీ ద్వీపానికి చెందిన సుమోమరి గ్రామంలో ఘటన చోటు చేసుకుంది. చనిపోయిన పైలట్లు వింగ్ కమాండర్లు జైపాల్ జేమ్స్, టి వాట్స్‌గా గుర్తించారు. సరిహద్దులో గస్తీ నిర్వహించేందుకు జోర్హాట్ విమానాశ్రయం నుంచి బయల్దేరిన విమానం ప్రమాదానికి గురయింది. తమ విమానాల్లో ఒకటి గల్లంతైందని మధ్యాహ్నం ఒంటి గంటకు ఐఎఎఫ్ సమాచారం ఇచ్చిందని మజులి డిప్యూటీ కమిషనర్ పల్లవి గోపాల్ ఝా తెలిపారు. సుమోమరికి చెందిన స్థానికులు విమానం కూలిపోయిందని తెలిపారన్నారు. రెండు సీట్లు గల విమానం పెద్ద శబ్దంతో కూలిపోయినట్లు ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపారన్నారు. సమాచారం అందిన వెంటనే పోలీస్ బృందం ఘటనా స్థలాన్ని సందర్శించి, దర్యాప్తు ప్రారంభించింది.

రెండు గంటలు దారిమళ్లిన రైలు

గజియాబాద్ : పంజాబ్‌లోని అమృత్‌సర్ నుంచి బీహార్‌లోని సహర్సకు వెళ్తున్న గరీబ్ రథ్ రైలు గురువారం కొన్ని గంటల పాటు కనిపించకుండా పోయింది. అయితే తప్పుడు మార్గంలో రైలు వెళ్తున్నట్లు తెలుసుకున్న అధికారులకు అది ఏ మార్గంలో వెళ్తుందో కనుగొనేందుకు రెండు గంటల సమయం పట్టింది. షెడ్యూల్ ప్రకారం రైలు ఉత్తరప్రదేశ్‌లోని మొరదాబాద్‌కు వెళ్లాల్సి ఉండగా, గజియాబాద్ జంక్షన్ నుంచి అలీగఢ్ వైపుకు పరుగుతీసింది. మధ్యాహ్నం 1.30 గంటలకు గజియాబాద్ జంక్షన్‌కు చేరుకున్న రైలు పొరపాటుగా దారి మళ్లింది. దాదాపు గంటన్నర ప్రయాణం తరువాత రైలు తప్పుడు మార్గంలో వెళ్తున్నట్లు డ్రైవర్ గుర్తించాడు. వెంటనే అతను ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకుంటే ఉండేందుకు రైలును ఆపేశాడు. అనంతరం అధికారులకు సమాచారం చేరవేయగా, వారు ఘటనాస్థలికి చేరుకొని రైలును గజియాబాద్ జంక్షన్‌కు తీసుకువచ్చారు. ఆ తరువాత ఆ రైలు మొరదాబాద్ వైపులు పరుగులు పెట్టింది.

ఆరు గంటల్లో 2501 రక్త పరీక్షలు



ఖర్గాన్ : మధ్యప్రదేశ్ ఖర్గాన్ జిల్లాలో ఓ సామాజిక సంస్థ ప్రపంచ రికార్డును సాధించింది. కేవలం ఆరు గంటల్లోనే దాదాపు 2501 మందికి రక్త పరీక్షలు నిర్వహించి భికంగాన్ పట్టణానికి చెందిన ఈ సంస్థ గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో తన పేరును నమోదు చేయించుకుంది. గతంలో అమెరికా కాలిఫోర్నియాలో ఆరు గంటల్లోనే 1460 మందికి రక్త పరీక్షలు నిర్వహించి సృష్టించిన రికార్డును లక్ష్య పరివార్ సామాజిక సంస్థ బద్దలు కొట్టినట్లు గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఆసియా హెడ్ మనీష్ విష్ణోయ్ తెలిపారు. బుధవారం లక్ష్య పరివార్ ఆరు గంటల వ్యవధిలో 2501 మందికి రక్త పరీక్షలు నిర్వహించినట్లు ఆయన చెప్పారు. దీంతో వరల్డ్ రికార్డు సాధించడంతో దానికి సంబంధించిన సర్టిఫికెట్‌ను విష్ణోయ్ లక్ష్య పరివార్ కన్వీనర్ చందన్ శర్మకు అందించారు. రక్త పరీక్షల నిర్వహణ ప్రక్రియ మొత్తాన్ని గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ బృందం కెమెరాల్లో చిత్రీకరించింది. కాగా, చందన్ శర్మ స్పందిస్తూ వ్యాలెంటైన్స్ రోజు సమాజానికి ఒక మంచి సందేశాన్ని పంపించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

కోర్టు వ్యాఖ్యల్లో వర్గ వివక్ష కూడదు

న్యూఢిల్లీ: 2014 నాటి పుణె టెకీ షేక్ మొహిసిన్ సంచలనాత్మక హత్య కేసులో ముగ్గురు నిందుతులకు బెయిలు మంజూరు చేయడంపట్ల బొంబాయి హైకోర్టును సుప్రీంకోర్టు విమర్శించింది. ఒక వర్గంపై వివక్ష చూపుతూ కోర్టు ఇటువంటి కేసుల్లో వ్యాఖ్యానం చేయకూడదని కూడా సుప్రీంకోర్టు పేర్కొంది. 2017 జనవరి 12న హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. ఆ ఉత్తర్వులోనే నిందితులు ముగ్గురికీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. న్యాయమూర్తులు ఎస్ఎ బాబ్డే, ఎల్ నాగేశ్వర రావుతో కూడిన బెంచ్ ముంబాయి హైకోర్టు నిర్ణయాన్ని ప్రశ్నించింది. మితవాద హిందూ రాష్ట్రీయ సేనకు చెందిన నిందితులకు బెయిల్ మంజూరును బెంచ్ ఆక్షేపించింది. మృతుని తప్పు అతడు వేరే మతానికి చెందడమే అని హైకోర్టు ఎందుకు వ్యాఖ్యానించిందో తెలియడం లేదని బెంచ్ పేర్కొంది.

2030 కల్లా దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ కార్లు

న్యూఢిల్లీ : పర్యావరణ పరిరక్షణ కోసం 2030కల్లా దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ కార్లు తీసుకొచ్చే దిశగా ప్రభుత్వం పథకాలు చేపడుతోందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. గురువారం నీతిఆయోగ్ కార్యాలయ ప్రాంగణంలో ఎలక్ట్రానిక్ వెహికల్ ఛార్జింగ్ పాయింట్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ మిషన్‌లో భాగంగా 2020కల్లా డెబ్బై లక్షల ఎలక్ట్రానిక్ వాహనాలను రోడ్లపైకి తీసుకొచ్చే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా ఎలక్ట్రానిక్ వెహికల్ ఛార్జింగ్ పాయింట్లను నెలకొల్పేందుకు ప్రణాళికలు రచిస్తున్నామన్నారు. త్వరలో మంత్రిత్వ శాఖలు, కార్యాలయాలకు ఎలక్ట్రిక్ కార్లు రానున్నాయన్నారు.



ఓపెన్ కాస్టు విస్తరణకు గ్రీన్ సిగ్నల్

- కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ నిపుణుల కమిటీ ఆమోదం
- రూ. 272.73 కోట్లతో శ్రీరాంపూర్ ఓసి-2 కోసం ఏర్పాట్లు





మన తెలంగాణ/మంచిర్యాల ప్రతినిధి : మంచిర్యాల జిల్లాలోని శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్టు 2 విస్తరణకు కేంద్ర పర్యారవణ మంత్రిత్వశాఖ నిపుణుల కమిటీ ఆమోదం తెలిపింది. గురువారం జరిగిన కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ నిపుణుల కమిటీ సమావేశంలో సభ్యులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రూ. 272.73 కోట్ల అంచనా వ్యయంతో ఓపెన్‌కాస్టు పనులు చేపట్టనున్నారు. ఓపెన్ కాస్టు విస్తరణలోభాగంగా తాళ్లపల్లి, సింగాపూర్, గుత్తెదారి పల్లి, దుబ్బపల్లి గ్రామాలను తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నిర్వాసితులకు నష్టపరిహారంతో పాటు డబుల్ బెడ్ రూం ఇండ్లను మంజూరు చేయనున్నారు. 707.63 హెక్టార్లలో ఉన్న ఓపెన్‌కాస్టును 1604.41 హెక్టార్లలో విస్తరింప జేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఓపెన్‌కాస్టు–2 విస్తరణ కోసం 276.38 హెక్టార్ల అటవీ భూమి, 1161 హెక్టార్ల వ్యవసాయ భూమి 20.15 హెక్టార్ల చెరువులు, 524 హెక్టార్లలో రోడ్లను సేకరించనున్నారు. నాలుగు గ్రామాల నిర్వాసితులకు పునరావాసం కోసం రూ. 72.13 కోట్లను ఖర్చు చేయనున్నారు. మైనింగ్ కోసం 276 హెక్టార్ల అటవీ భూమి ఉపయోగిస్తుండగా వాటి స్థానంలో మైనింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు 840 హెక్టార్ల భూమిలో అడవులను పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదే విధంగా కొమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల పరిధిలో గల అబ్బాపూర్, బెల్లంపల్లి, ఓపెన్‌కాస్టు 2 విస్తరణ పనుల విషయాన్ని కూడా చర్చించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఘన్‌పూర్ మండలం బస్వరాజుపల్లిలోని కాకతీయ ఖని–3(ఫేజ్–1), కోల్‌మైనింగ్ ప్రాజెక్టును పరిశీలించేందుకు కమిటీ నిర్ణయించింది. ఇదే విధంగా కాకతీయఖని –5 అండర్ గ్రౌండ్ గనిని ఏర్పాటు చేసేదుకు కమిటీ ఆమోదం తెలిపింది.

గ్రామాలను తరలిస్తే ఆందోళన

దశాబ్దాల కాలంగా ఇండ్లు నిర్మించుకొని ఉంటున్న గ్రామాలను తరలిస్తే ఓపెన్‌కాస్టు విస్తరణ పనులకు వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని అఖిల పక్ష కమిటీ పేర్కొంది. ఇప్పటికే శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్టు బాంబు పేలుళ్ల వల్ల ఇండ్లు పగుళ్లు తేలి దెబ్బతిన్నప్పటికీ గ్రామాలను వదిలి వెళ్లలేదని, ప్రతినిత్యం బాంబు శబ్దాలను వింటూనే కాలం గడుపుతున్నామని పేర్కొన్నారు. తాళ్లపల్లి, సింగాపూర్, దొరగారిపల్లి, దుబ్బపల్లి గ్రామాలను తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతిని ఇవ్వడం శోచనీయమని, ఎట్టి పరిస్థితుల్లోను గ్రామాలను వదిలిపెట్టి వెళ్లే ప్రసక్తే లేదని పేర్కొన్నారు.

రైల్వే శాఖలో లక్ష ఉద్యోగాలు



ఢిల్లీ : ఇండియన్ రైల్వేలో లక్ష ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. ఈ ఉద్యోగాల భర్తీకి సంబంధించి రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ గురువారం ట్వీట్ చేశారు. రైల్వే చరిత్రలోనే ఇదో పెద్ద రిక్రూట్‌మెంట్ అని ఆయన తెలిపారు. రైల్వేలో వివిధ కేటగిరిల కింద ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఆయన చెప్పారు. లోకో పైలెట్ నుంచి గ్రూపు డి ఉద్యోగుల వరకు ఈ భర్తీ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. గ్రూపు డి కింద సుమారు62,907 ఖాళీలను భర్తీ చేయనున్నారు. రైల్వేలో ఉద్యోగాల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను indianrailways. gov.in వెబ్‌సైట్‌లో చూడొచ్చు. గ్రూపు 'డి' ఖాళీలకు మార్చి 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే వీలు కల్పించారు. లోకో పైలెట్లు, టెక్నీషియన్ల కేటగరిలో సుమారు 26,502 మంది ఉద్యోగులను నియమిస్తారు. అప్రెంటిస్ కోసం 1898 ఖాళీలు ఉన్నాయి. సెంట్రల్ రైల్వే స్పోర్ట్స్ కోటాలో కూడా 21 మందిని నియమించనున్నారు.

కొడుకు మరణించినా నాయనమ్మ కాగలిగింది



పుణె : రెండేళ్ల క్రితం జర్మనీలో కేన్సర్ వ్యాధితో కుమారుడు మరణించినప్పుడు శోక సముద్రంలో మునిగిపోయిన మహిళ ఇప్పుడు ఆనందపు చివరి అంచులను తాకింది. తన కుమారుని 'క్రియో– సంరక్షిత వీర్యం' ద్వారా సరోగసి పద్ధతిలో ఇద్దరు కవలలను మనవలుగా పొందిన ఆమె ఆనందానికి అవధుల్లేవు. పుణె సహ్యాద్రి ఆసుపత్రి వైద్యులు ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవిఎఫ్) ప్రక్రియ ద్వారా ప్రథమేష్ పాటిల్‌కు సంతాన భాగ్యాన్ని కల్పించారు.అతని దేహం నుంచి మరణించడానికి ముందు జర్మనీ వైద్యులు వీర్యాన్ని సేకరించి భద్రపరిచారు. ఆ వీర్య కణాలతో దాత ద్వారా పిండాలను పుణె వైద్యులు రూపొందించారు. ఒక సరోగేట్ తల్లి గర్భంలో ఆ పిండాలను ప్రవేశపెట్టారు. ఆమె ఒక బాలుడు, ఒక బాలిక కవలల జంటకు సోమవారం నాడు జన్మనిచ్చింది. తన కుమారుడు చనిపోయినా ఆధునిక సాంకేతిక విజ్ఞానం అందించిన సౌలభ్యాన్ని వాడుకొని ఇద్దరికి నాయనమ్మ అయినందుకు రాజ్యశ్రీ పాటిల్ ఎంతో సంతోషంగా ఉన్నారు. 2010లో తన కుమారుడికి జర్మనీలో బ్రెయిన్ క్యాన్సర్ నిర్ధారణ జరిగిందని ఆమె చెప్పారు. చికిత్స ప్రారంభానికి ముందే వైద్యుల సలహాపై పాటిల్ తన వీర్యాన్ని భద్రపరిచాడు. దాని సాయంతో మరణం తర్వాత కూడా బిడ్డలను పొందాడు. ఆ ఆనందాన్ని అతడి తల్లి రాజశ్రీ పాటిల్ పొందగలిగారు.

ఆయుష్మాన్ భారత్‌తో గణనీయ మార్పు



ఇటానగర్: దేశ వ్యాప్తంగా దాదాపు 50 కోట్ల మందికి నాణ్యమైన, సరసమైన ఆరోగ్య సంరక్షణ అందించడానికి కేంద్ర ప్రభుత్వం ఆయుష్మా న్ భారత్ యోజన మిషన్‌ను తీసుకురానుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. ప్రపంచంలోనే ప్రభుత్వ నిధులతో నడుస్తున్న అతిపె ద్ద ఆరోగ్య సంరక్షణ కార్యక్రమమని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం ఆరోగ్య రంగంలో గణనీయమైన మార్పును తీసుకు రానుందని తెలిపా రు. ఇటానగర్‌లో టోమో రిబా ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ మెడికల్ సైన్స్‌కు మోడి శంకుస్థాపన చేశారు.ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల పరిమితికి లోబడి నాణ్యమైన వైద్యం అందించనున్నట్లు తెలిపారు. ఆరో గ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త ఆరోగ్య పథకాలు తీసుకురావాలని, దానిలో భాగస్వాములయ్యేందుకు ప్రైవేట్ వ్యక్తులను ఆకర్షించాలని ఆయన కోరారు. 201819 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టబోతున్నట్లు ప్రకటించా రు. గిరిజన సాంప్రదాయ దుస్తువులు ధరించిన మోడీ న్యూఢిల్లీ, నహర్‌లగూన్ ఎక్స్‌ప్రెస్‌ను అరుణాచల్ ఎక్స్‌ప్రెస్‌గా నామకరణం చేశారు.

ఇడి ఎదుట హాజరైన కార్తీ చిదంబరం

న్యూఢిల్లీ: ఐఎన్ఎక్స్ మీడియా మనీ లాండరింగ్ కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత పి చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరం గురువారం ఇడి ఎదుట హాజరయ్యారు. కార్తీ ఇడి ఎదుట హాజరు కావడం ఇది రెండోసారి. జనవరి 18న కార్తీ మొదటిసారిగా ఇడి ముందు హాజరయ్యారు. ఈ కేసుకు సంబంధించి మధ్యంతర పిటిషన్ సుప్రీంకోర్టులో పెండింగ్ ఉన్నందున తాను హాజరుకాలేనని కార్తీ తెలపడంతో ఆయనకు ఇడి ఫిబ్రవరి 2న సమన్లు జారీ చేసింది. దీంతో ఆయన దర్యాప్తు అధికారి ఎదుట హాజరయ్యారని అధికారులు తెలిపారు. నిరసన తెలిపేందుకు తాను ఏజెన్సీ ముందు హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్తీ చిదంబరం, ఐఎన్ఎక్స్ మీడియా, ఆ సంస్థ డైరెక్టర్లు పీటర్, ఇంద్రాణీ ముఖర్జీలపై గత ఏడాది మే నెలలో మనీలాండరింగ్ కేసు నమోదు చేశారు. నేరపూరిత కుట్ర, మోసం, లంచం, ప్రభుత్వ అధికారులను ప్రభావితం చేయడం తదితర ఆరోపణలతో వారిపై సిబిఐ కేసు నమోదు చేసింది.

మోడీని హత్తుకోండి ... కోట్లు కొట్టేయండి : రాహుల్



ఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీపై జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శలు చేశారు. వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు సుమారు రూ.11360 కోట్లు టోపీ పెట్టి విదేశాలకు పారిపోయిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై రాహుల్‌గాంధీ గురువారం ట్వీట్ చేశారు. భారత్‌ను ఎలా లూటీ చేయాలో నీరవ్ మోడీ నేర్పించారని తన ట్వీట్‌లో రాహుల్ పేర్కొన్నారు. భారత్‌ను లూటీ చేసేందుకు రెండు సూత్రాలు ఉన్నాయని ఆయన చెప్పారు. ఇందులో ఒకటి ప్రధాని నరేంద్ర మోడీని ఆలింగనం చేసుకోవడమని, రెండోది ప్రధాని మోడీని దావోస్‌లో నీరవ్ కలవడం అని రాహుల్ విమర్శించారు. మోడీతో పరిచయాన్ని నీరవ్ ఎలా వాడుకున్నారన్న అంశంపై కూడా రాహుల్ తనదైన శైలిలో వివరిం చారు. ఒక్క హగ్‌తో రూ.11360 కోట్లు లూటీ చేశారని ఆయన పేర్కొన్నారు. విజయ్ మాల్యా మాదిరిగానే నీరవ్ పారిపోయాడని ఆయన తెలిపారు.

కానిస్టేబుళ్ల పదోన్నతులపై పిటిషన్

జిఒ 19కి వ్యతిరేకంగా హైకోర్టుకు పలువురు ఎఆర్ కానిస్టేబుళ్లు



మన తెలంగాణ/హైదరాబాద్: హోం శాఖ ఈ నెల 6వ తేదీన జిఒ నెంబర్ 19 ద్వారా కానిస్టేబుళ్ల పదోన్నతికి సంబంధించి విడుదల చేసిన మార్గదర్శకాలను నిలిపివేయాలంటూ ఆర్మ్‌డ్ రిజర్వు (ఎఆర్)కు చెందిన పలువురు కానిస్టేబుళ్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో తమ పదోన్నతుల భవితవ్యంపై 40 వేల మంది కానిస్టేబుళ్ళలో ఆందోళన నెలకొంది. ఈ అంశం ఇప్పటికే సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉండగానే ప్రభుత్వం తాజాగా జిఒ 19ని జారీ చేయడంలో అర్థం లేదని ఎఆర్ కానిస్టేబుళ్లు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ జివొ ద్వారా ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలతో తమకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. ఎఆర్‌లో పనిచేసిన పూర్తి పనిదినాలను సర్వీసులో లెక్కించకుండా కేవలం సగం పనిదినాలను మాత్రమే పరిగణలోకి తీసుకోవడం సమంజసం కాదని హైకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్తర్వులను దశాబ్ద క్రితం ఎఆర్ నుంచి సివిల్‌లోకి వచ్చిన తమపై రుద్దడం సమంజసం కాదని వారు పేర్కొన్నారు. తాజా ఉత్తర్వులు కేవలం ఈ నెల 6వ తేదీ తరువాత ఎఆర్ నుంచి సివిల్‌లోకి వచ్చిన కానిస్టేబుళ్లకు వర్తిస్తాయని, తామకు పాత జిఒ 212/2013 వర్తిస్తుందని, ఈ జిఒ ఆధారంగా తమకు పదోన్నతులు కల్పించాలని వారు కోరారు. పాత జివొను సవాలు చేస్తూ అప్పట్లో సివిల్, ఎఆర్ కానిస్టేబుళ్లు పరస్పరం హైకోర్టు, సుప్రీం కోర్టుకు ఎక్కారు. ప్రస్తుతం ఈ జివొపై తుది తీర్పు సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉంది.

బచావత్ అవార్డుకు కట్టుబడాలి

పోలవరంపై మార్చి31 నాటికి తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల అభ్యంతరాలతో అఫిడవిట్

మన తెలంగాణ/న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ.. ఒడిశా ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు గురువారం విచారణ జరిపింది. ఈ పిటిషన్‌పై వి చారణ జరిపిన జస్టిస్ మదన్ బి లోకూర్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం అన్ని రాష్ట్రాలు బచావత్ ట్రిబ్యునల్ అవార్డుకు కట్టుబడి ఉండాలని సూచించింది. దీనిపై రానున్న మార్చి31లోగా ఎపి, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర ప్రభుత్వాలు తమ అభ్యంతరాలను అఫిడవిట్ రూ పంలో సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించిం ది. పోలవరంపై జరిగిన వాదోపవాదాల్లో ఒడిశా తరపు న్యాయవాది గోపాల సుబ్రమణ్యం మాట్లడుతూ పోలవరం తొలుత 36లక్షల క్యూసెక్కు ల సామర్థ్యంతో నిర్మాణం చేపట్టారని, కానీ ఇప్పుడు దానిని ఏకంగా 50లక్షల క్యూసెక్కులకు పెంచారని అన్నారు. దీనివల్ల ఒడిశాలోని లోతట్టు ప్రాంతాలు బ్యాక్‌వాటర్‌తో ముంపుకు గురౌతా యని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఇచ్చంపల్లి ప్రాజెక్టు నిర్మిస్తే పోలవరంపై ఒత్తిడి తగ్గుతుందంటూ వాదించారు. సుబ్రమణ్యం వాదనపై స్పందించిన సుప్రీంకోర్టు పర్యావరణ అనుమతుల ఉల్లంఘన తదితర అంశాలను తర్వాత వింటామని పేర్కొంది. తదుపరి విచారణను ఏప్రిల్ 17కు వాయిదా వేసిం ది. ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించి ఐదు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశా న్ని నిర్వహించాలని గతంలోనే ఒడిశా కోరిన నేప థ్యంలో దీనికి ఎపి ప్రభుత్వం అంగీకరించిన సంగ తి తెలిసిందే. అయితే గురువారం విచారణ సందర్భంగా ఈ సమావేశం ఎందుకు ఇంకా జరుగలేదని సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ప్రశ్నించింది. దీనికి ఒడిశా, ఎపి తరపు న్యాయవాదులు స్పందిస్తూ.... కేంద్ర ప్రభుత్వంనుంచి తమకు సరైన సహకారం అందడం లేదంటూ సుప్రీంకోర్టుకు తెలియజేసారు.

రేప్ బాధితులకు వెల కడతారా?

నామమాత్రపు సాయంపై సుప్రీం ఆగ్రహం



న్యూఢిల్లీ: మానభంగానికి రూ. 6,500 వెల కడతారా? దిగ్భ్రాంతితో సుప్రీంకోర్టు గురువారం నాడు మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని అడిగిన ప్రశ్న ఇది. సెక్సు దాడుల బాధితులకు ఇలా కనాకష్టంగా వెలకట్టడంలో ధర్మం వేస్తున్నట్లు భావిస్తున్నారా అని ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా మందలించింది. నిర్భయ నిధుల పథకం కింద కేంద్రం నుంచి అత్యధిక మొత్తం అందుకొన్న మధ్యప్రదేశ్ ప్రతి రేప్ బాధితురాలికి కేవలం రూ. 6,000–రూ. 6,500 మాత్రమే పంచడంపట్ల అత్యున్నత న్యాయస్థానం దిగ్భ్రాంతి ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం 2013లో నిర్భయ నిధుల పథకాన్ని ప్రకటించింది. 2012 డిసెంబర్ 16న ఢిల్లీలో ఒక బస్సులో నిర్భయ మూకుమ్మడి రేప్, హత్య ఘటన తర్వాత ఈ నిధిని కేంద్రం కల్పించింది. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల కృషికి చేదోడువాదోడుగా ఈ నిధిని ఏర్పాటు చేశారు. న్యాయమూర్తులు మదన్ బి లోకూర్, దిపక్ గుప్తాతో కూడిన బెంచ్ మధ్యప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన అఫిడవిట్‌ను విచారిస్తూ ఇలా దిగ్భ్రాంతి ప్రకటించింది. మధ్యప్రదేశ్‌లో 1951 రేప్ బాధితులు ఉన్నారని వారికి ఒక్కొక్కరికి రూ. 6,000 నుంచి రూ. 6,500 చొప్పున చెల్లించి చేతులు దులుపుకుంటున్నారా అని ఆ ప్రభుత్వాన్ని బెంచ్ నిలదీసింది. 1951 రేప్ బాధితులకు కేవలం కోటి రూపాయలను ఖర్చు చేసిన రాష్ట్ర ప్రభుత్వ తీరుకు సుప్రీం కోర్టు విస్మయం ప్రకటించింది.



రక్షణ వ్యయంలో భారత్ 5వ స్థానం

లండన్: భారత దేశపు రక్షణ బడ్జెట్ బ్రిటన్‌ను తొలిసారి అధిగమించి ప్రపంచంలో 5వ స్థానాన్ని ఆక్రమించింది.లండన్‌లోని మేధావుల బృందం ఈ విషయాన్ని వెల్లడించింది. ఇరు దేశాల సైనిక పొంతనను ఇది సూచిస్తున్నట్లు అంతర్జాతీయ వ్యూహాత్మక అధ్యయనాల సంస్థ (ఐఐఎస్ఎస్) ప్రకటించింది. బ్రిటన్ రక్షణ బడ్జెట్‌ను భారత్ అధిగమించడం ఇదే తొలిసారి. 2017లో ప్రపంచంలో రక్షణ వ్యయం అధికంగా ఉన్న 5వ దేశంగా భారత్ నిలిచినట్లు ఆ సంస్థ 'మిలిటరీ బ్యాలెన్స్ 2018' నివేదికలో తెలిపింది. 2016లో 51.1 బిలియన్ డాలర్ల నుండి భారత రక్షణ బడ్జెట్ 2017లో 52.5 బిలియన్ డాలర్లు చేరుకుంది. అయితే బ్రిటన్ రక్షణ బడ్జెట్ 2016లో 52.5 బిలియన్ డాలర్ల నుంచి 2017లో 50.7 బిలియన్ డాలర్లకు పడిపోయింది. ఇది రెండు దేశాల మధ్య సైనిక పరమైన తేడాను సూచిస్తోంది. చైనా సైన్యంలో భారత్‌తో పోల్చితే ఎక్కువ మంది మెరుగైన సిబ్బంది ఉన్నట్లు ఆ విశ్లేషణ తెలిపింది. మందుగుండు సామాగ్రి కొరత, ఆయుధ విడిభాగాల కొరత వంటి కారణాలవల్ల మొత్తం మీద భారత సైనిక సామర్థ్యం తక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు.

కార్మికుల వేతనాలను పెంచాలి



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో వివిధ మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేసి వారికి కనీస వేత నం రూ.18 వేలు నిర్ణయించి అమలు చేయాలని రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.మున్సిపల్ స్టాఫ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సమావేశం కె.ఏసురత్నం అధ్యక్షతన గురువారం ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో జరిగింది.సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్ రావు మాట్లాడుతూ రాష్ట్రం లో 72 మున్సిపాలిటీలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు కనీస వేతనాలు లేకుండా శ్రమ దోపిడికీ గురవుతున్నారు. శానిటేషన్‌లో పనిచేస్తున్న మహిళా కార్మికులకు కనీసం ప్రసూతి సెలవులు కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు.కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు జి.ఓ.14 ప్రకారం వేతనాలు ఇప్పిస్తామని ఆగస్టులో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి యూనియన్లకు ఇచ్చిన హామీ నేటికీ అమలు కావడం లేదని విమర్శించా రు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మున్సిపాలిటీలలో శానిటేషన్ సిబ్బందిని పెంచాలని, మున్సిపాలిటీలకు స్పెషల్‌గ్రాంట్స్ ఇచ్చి ఆదుకోవాలని, కార్మికులందరికి హెల్త్ కార్డులను ఇవ్వాలని, డబల్ బెడ్ రూమ్ పథకంలో ఇండ్లు కట్టించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ కార్యదర్శి పి.శ్రీనివాస్,ఉపాధ్యక్షులు కె.నర్సింహ్మలు, కార్యదర్శులు కె.నర్సింగ్‌రావు, తదితరులుపాల్గొన్నారు.


సాధువులు, సంత్‌లు దేశీయ సంస్కృతిని పరిరక్షించారు



మన తెలంగాణ/ హైదరాబాద్: సాధువులు, సంత్‌లు దేశీయ సంస్కృతిని, సంప్రదాయాలను పరిరక్షించారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారామ్ వ్యాఖ్యానించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో గురువారం సంత్ సేవాలాల్ మహరాజ్ 279వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి బిజెపి శ్రేణులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హన్స్‌రాజ్ అహీర్‌తో పాటు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మ ణ్ తదితరులు పాల్గొన్నా రు. ఈ సందర్భంగా హన్స్‌రాజ్ అహీర్ మాట్లాడుతూ సంత్‌సేవాలాల్ జయంతి ఉత్సవాలు మహారాష్ట్ర అంతటా నిర్వహిస్తారని,అక్కడ అనేక జిల్లాల్లో సేవాల్ విగ్రహాలు కూడా నెలకొల్పుతున్నామని చెప్పారు. డాక్టర్ కె.లక్ష్మ ణ్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ హిందూ, ధర్మం విస్తృతికి కృషి చేశారన్నారు. వాల్మీకి, వ్యాసుడు లాంటి గిరిజన రుషులే హిందూ పురాణాలను రచించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి ఎన్.రాంచంద్రరావు, ఎంఎల్‌ఎ ఎన్‌విఎస్.ప్రభాకర్, బిజెపి నేతలు చింతసాంబమూర్తి, బిక్కునాథ్ నాయక్, అమర్‌సింగ్ పవర్ పాల్గొన్నారు.

నేపాల్ ప్రధానిగా ఓలీ ప్రమాణం

ఏకైక పెద్ద పార్టీగా నిలిచిన సిపిఎన్ – యుఎంఎల్ కు 13 పక్షాల మద్దతు



ఖాట్మండు: నేపాల్ ప్రధానిగా రెండోసారి కెపి శర్మ ఓలీ గురువారం నాడు ప్రమాణం చేశారు. మాజీ మావోయిస్టు రెబెల్స్‌తో కూడిన వామపక్ష కూట మి చరిత్రాత్మక పార్లమెంటరీ ఎన్నికలలో విజయం సాధించిన కొన్ని వారాలకు ఓలీ ప్రమాణం చేశారు. అధ్యక్షుడు బిద్యాదేవీ భండారీ ఆయన చేత ప్రమాణం చేయించారు. మహరాజ్ గంజ్ వద్ద గల అధ్యక్ష భవనం శీతల్ నివాస్‌లో 65 ఏళ్ల ఓలీ ప్రమాణం చేశారు.నేపాల్ 41వ ప్రధానిగా ప్రమా ణం చేసిన ఓలీ చైనా అనుకూల వైఖరికి పేరుబడ్డారు. 2015 అక్టోబర్ 11 నుంచి 2016 ఆగస్టు 3 దాకా తొలిసారి ఆయన ప్రధానిగా ఉన్నారు. ప్రధా ని అభ్యర్థిగా ఓలీని యుసిపిఎన్ –మావోయిస్టు, రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ – నేపాల్, మధేశీ రైట్స్ ఫోరమ్ –డెమొక్రాటిక్ సహా 13 చిన్న పార్టీలు బలపరిచాయి. అంతకు ముందు మాజీ ప్రధాని, నేపాలీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేర్ బహదూర్ దేవ్‌బా జాతిని ఉద్దేశించి ప్రసంగించిన తర్వాత రాజీనామా చేశారు. 275 మంది సభ్యుల పార్లమెంట్‌లో ఓలీ పార్టీ (సిపిఎన్– యుఎంఎల్) 121 స్థానాలు గెలిచి ఏకైక పెద్ద పార్టీగా వచ్చింది. నేపాలీ కాంగ్రెస్ 63, సిపిఎన్–మావోయిస్టు 53 సీట్లు గెలిచాయి. ఓలీ పార్టీకి సిపిఎన్ మావోయిస్టు సెంటర్ మద్దతు పలకడంతో ఆయన సంకీర్ణ ప్రభుత్వానికి 174 సంఖ్యాబలం చేకూరింది.

దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా రామఫోసా



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా సిరిల్ రామఫోసా ఎన్నికయ్యారు.త్వరలో ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. గురువారంనాడు పార్లమెంట్‌లో జరిగిన ఓటింగ్‌లో ఆయన్ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.మాజీ అధ్యక్షుడు జాకబ్ జుమా బుధవారంనాడు రాత్రి తన పదవికి రాజీనామా చేశారు.ఆర్థికసంక్షోభంతోదక్షిణాఫ్రికా సతమతమవుతున్నది. ఈనేపథ్యంలో ఏఎన్‌సీ నేత రామఫోసా దేశ ఆర్థిక పరిస్థితిని మార్చేస్తారన్న ఊహాగానాలు వినిపిస్తున్నా యి. జుమా తొమ్మిదేళ్లు పాలించారు. అయితే రెండవ సారి ఆయన పాలనపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో ఆయన ఆకస్మికంగా తన పదవికి రాజీనామా చేశారు.

జుమా రాజీనామా : కుంభకోణాల్లోఇరుక్కొన్న దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జాకోబ్ జుమా రాజీనామా చేశారు. అధికారంలోగల ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఎఎన్‌సి) పార్టీ తో ఏర్పడిన ప్రతిష్టంభనకు ఈ విధంగా ఆయన తెర దిం చారు. అవిశ్వాస తీర్మానం ద్వారా జుమాను పదవీచ్యుతుని చేయడానికి పార్లమెంట్‌లో ప్రతిపక్షాలతో ఎఎన్‌సి చేతులు కలపనున్న తరుణంలో ఈ పరిణామం సంభవించింది. బుధవారం అర్ధరాత్రి తాను వైదొలగినట్లు 75 ఏళ్ల జుమా ప్రకటించారు. ఈ మేర కు టివిలో ప్రసంగించారు. అతడిని రాజీనామా చేయాలని ఎఎన్‌సి జాతీయ నాయకులు డిమాండ్ చేసిన మూడు రోజుల తర్వాత ఆయన రాజీనామా చేశారు. దీనితో ఆయ న తొమ్మిదేళ్ల పదవీ కాలం ముగిసింది. 2019లో జరగనున్న ఎన్నికల్లో రెం డో పదవీ కాలానికి ఎన్నికవ్వాలని ఆయన కలలుగన్నారు. సిరిల్ రామ్‌పోసా ఆయన స్థానంలో ఎఎన్‌సి అధ్యక్షునిగా రెండు నెలల క్రితం ఎన్నికయ్యారు.అయితే ఆఎన్నికను జుమా లక్ష్యపెట్టలేదు. తాను తన పార్టీ నిర్ణయాన్ని ఒప్పుకోకపోయినా క్రమశిక్షణగల నేతగా వ్యవహరించినట్లు తన 30నిమిషాల ప్రసంగంలో జుమా చెప్పుకొన్నారు. తన స్వంత పార్టీయే తనను పార్లమెంట్ తీర్మానాన్ని బలపరచడం ద్వారా తొలగించే అసాధారణ పరిస్థితి రాకముందే నిర్భీతిగా వ్యవహరించి రాజీనా మా చేస్తున్నానని ఆయన ప్రకటించారు.ఆయన స్థానం లో ఇప్పు డు రామ్‌పోసా నూతన అధ్యక్షుడు అవడానికి రంగం సిద్ధమయింది. భారత సంతతికి చెందిన గుప్తా సోదరుల వ్యాపార సామ్రాజ్యంతో గల సాన్నిహి త్యం వల్ల జుమా పై అవినీతి ఆరోపణలు వచ్చాయి. గుప్తాల కుటుంబం జుమాతో సంబంధాల వల్ల వివాదాస్పదం అయింది.

ఎన్‌టిపిసి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో సమ్మెపై నిషేధం

మన తెలంగాణ/హైదరాబాద్: ఎన్‌టిపిసి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ప్రభుత్వం సమ్మెను నిషేధించింది. అత్యవసర సర్వీసుల చట్టం ప్రకారం జనవరి 20 నుంచి ఆరు నెలల పాటు సమ్మెను నిషేధిస్తూ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా ఉత్తర్వులు జారీచేశారు.

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి అదృశ్యం



మన తెలంగాణ/అంబర్‌పేట: ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు అదృశ్యమైన సంఘటన అంబర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం అంబర్‌పేట్‌లోని వినాయక్ నగర్‌లో మాజీ సైనికుద్యోగి వి.రమణ కుటుంబం నివాసముంటుంది. బుధవారం రాత్రి 7 గంటల నుంచి అతని భార్య వి.రాజ్యలక్ష్మి (39), కూతురు వి.అంజలి (17),కుమారుడు వి.సాకేత్ (12) అనుమానాస్పద స్థితిలో ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. వారి సెల్‌నెంబర్ స్విచ్‌ఆఫ్ రావడంతో రమణ తన బంధువులు, స్నేహితుల ఇళ్లలో వాకబ్ చేసినా ఫలితం కనిపించలేదు.

దీంతో గురువారం సాయత్రం అంబర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వారి కోసం గాలిస్తున్నారు.

అరుణాచల్ ప్రదేశ్‌లోమోడీ పర్యటనకు చైనా అభ్యంతరం

బీజింగ్ : అరుణాచల్ ప్రదేశ్‌లో ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనపట్ల చైనా గురువారం నాడు తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేసింది. ఆ రాష్ట్రం దక్షిణ టిబెట్‌లో భాగమని ప్రకటించింది. మోడీ పర్యటనపట్ల భారత్‌తో దౌత్య నిరసనను నమోదు చేయనున్నట్లు తెలిపింది. చైనా, భారత్ సరిహద్దు అంశంపై తమ వైఖరి స్థిరమైనదని, స్పష్టమైనదని ఆదేశ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి జెంగ్ షువాంగ్ వ్యాఖ్యానించారు. మోడీ గురువారం నాడు అరుణాచల్ పర్యటించిన వార్తపై ప్రశ్నలకు జవాబుగా విలేకరులతో అలా అన్నారు. భారత్‌తో ఈ అంశంలో కఠినమైన అభ్యంతరాలను నమోదు చేయనున్నట్లు తెలిపారు. కీలక మూడు సరిహద్దు ప్రాంతాలు 'మెక్ మోహన్ లైన్','భారత– చైనా సరిహద్దుల మధ్య ఉన్నాయని పేర్కొంది. అవి ఎప్పుడూ చైనా భూభాగాలే అని, గతంలో కుదిరిన ఏకాభిప్రాయానికి భారత్ లోబడి ఉండాలనిచైనా సూచించింది.

కోదండరామ్ పార్టీకి అన్ని వర్గాల మద్దతు



మన తెలంగాణ/హైదరాబాద్: ఉద్యమ ఆకాంక్షల అమలు, అసమానతలు లేని తెలంగాణను నిర్మించేందుకు తెలంగాణ జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ కోదండరామ్ ఏర్పాటు చేయబోతున్న రాజకీయ పార్టీకి అన్ని వర్గాలు మద్దతు ఇవ్వాలని 'ప్రజా తెలంగాణ' కన్వీనర్ గాదె ఇన్నయ్య కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం మీడియా సమావేశంలో కో కన్వీనర్లు శ్రీశైల్‌రెడ్డి, వెలమాల విక్రమ్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలతో రాబోతున్న కోదండరామ్ పార్టీకి తూట్లు పొడిచేందుకు ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. విద్య, వైద్యం తదితర 27 ప్రధాన అంశాలతో ప్రజా తెలంగాణ ఎన్నికల ప్రణాళికను రూపొందించిందని, ఈ అంశాలపై కోదండరామ్‌తో చర్చించినట్లు ఆయన వివరించారు. 2001 నిర్బంధంలో టిఆర్ఎస్ ఆవిర్భవిస్తే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అంతకన్నా ఎక్కువ నిర్బంధం ఉన్న సమయంలో కోదండరామ్ పార్టీ రాబోతున్నదని, దీనిని ప్రజలు ఆదరించాలని కోరారు. విద్యార్థి,యువజన, రైతు సమస్యలపై జెఎసి ఇదివరకే అనేక పోరాటాలు చేసి రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీగా ప్రభుత్వాన్ని ముప్పు తిప్పలు పెట్టి, సిఎం కెసిఆర్‌ను దోషిగా నిలబెట్టిందని ఆయన పేర్కొన్నారు. నాలుగు సంవత్సరాల కాలంలో 40 సార్లు కూడా సచివాలయానికి రాకుండా ముఖ్యమంత్రి కెసిఆర్ రికార్డు సృష్టించారని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతోందని, తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చడంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.రాష్ట్రంలో ఉద్యమ ద్రోహులు, అసమర్థ పాలకులతో పాలన కొనసాగుతుందని పేర్కొన్నారు.

కాకతీయపై మెదక్ మావేరిక్స్ విజయం

మనతెలంగాణ/ హైదరాబాద్ : హైదరాబాద్‌లో జి.వెంకటస్వామి మెమోరియల్ తెలంగాణ టి20 లీగ్‌లో భాగంగా గురువారంనాడిక్కడి ఎంఎల్‌ఆర్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో మెదక్ మావేరిక్స్ జట్టు ఘన విజయం సాధించింది. వరంగల్ కాకతీయ జట్టుపై 43పరుగుల తేడా భారీ విజయం నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన మెదక్ మావేరిక్స్ నిర్దేశిత 20ఓవర్లలో 234/2పరుగులు సాధించింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన కాకతీయ జట్టు 20ఓవర్లలో 191/8 పరుగులు మాత్రమే సాధించి అపజయాన్ని మూటగట్టుకుంది. మెదక్ జట్టులో మల్లికార్జున్ 52బంతుల్లో 110 పరుగులు సాధించాడు. జాస్వాల్ 39బంతుల్లో 79పరుగులు సాధించాడు. వరంగల్ జట్టులో యతిన్ రెడ్డి 46, యశ్వంత్ రెడ్డి 49పరుగులు చేశారు. మెదక్ బౌలర్ చైతన్య 3వికెట్లు తీశాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా మల్లికార్జున్ ఎంపికయ్యారు. మెదక్ మావేరిక్స్ విజయంపట్ల ఫ్రాంచైజి యజమాని జగన్మోహన్ హర్షం వ్యక్తం చేశారు.





గెలుపే లక్ష్యంగా!

- పరువు కోసం సఫారీల పోరాటం
- కొద్ది మార్పులతో బరిలోకి దిగనున్న టీమిండియా
- సీనియర్లకు విశ్రాంతినిచ్చే అవకాశం
- నేడు సౌతాఫ్రికాతో భారత్ చివరి వన్డే

సెంచూరియన్: ఇప్పటికే వన్డే సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమిండియా శుక్రవారం జరిగే చివరి మ్యాచ్‌లోనూ గెలవాలనే పట్టుదలతో పోరుకు సిద్ధమైంది. సిరీస్ గెలుచుకున్నా ఈ మ్యాచ్‌ను తేలిగ్గా తీసుకోకూడదనే భావనతో కెప్టెన్ కోహ్లి ఉన్నాడు. ఈ మ్యాచ్‌లోనూ గెలిచి రానున్న ట్వంటీ–20 సిరీస్‌కు సమరోత్సాహంతో సిద్ధం కావాలని తహతహలాడుతున్నాడు. ఈ మ్యాచ్‌లో ప్రయోగాలకు దిగాలనే ఉద్దేశంతో కూడా కోహ్లి ఉన్నాడు. ఇప్పటివరకు బెంచ్‌కే పరిమితమైన ఆటగాళ్లకు అవకాశం ఇచ్చేందుకు సిద్ధమైనట్టు సమాచారం. ఇదే జరిగితే ఇప్పటి వరకు అన్ని మ్యాచ్‌లు ఆడిన కొందరు ఆటగాళ్లు విశ్రాంతి తీసుకోక తప్పదు. అయితే వారు ఎవరూ అన్నది ఇంకా తేలలేదు. మ్యాచ్‌కు కొన్ని గంటల ముందే తుది జట్టును ప్రకటించే అవకాశాలున్నాయి.

రోహిత్ ఫాంలోకి వచ్చాడు..

మరోవైపు కిందటి మ్యాచ్ ద్వారా ఓపెనర్ రోహిత్ శర్మ ఫాంలోకి రావడం జట్టుకు ఊరటనిచ్చే అంశమే. ఐదో వన్డేలో రోహిత్ అద్భుత శతకంతో మళ్లీ గాడిలో పడ్డాడు. ఈ మ్యాచ్‌లో కూడా అదే జోరును కొనసాగించాలనే పట్టుదలతో ఉన్నాడు. టి–20 సిరీస్ నేపథ్యంలో అతనికి ఈ మ్యాచ్ మరింత కీలకంగా మారింది. ఇందులో రాణించడం ద్వారా మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించు కోవాలని తహతహలాడుతున్నాడు. భీకర ఫాంలో ఉన్న ధావన్ కూడా మరోసారి మెరుపులు మెరిపించేందుకు సిద్ధమయ్యాడు. ఈ మ్యాచ్‌లో కూడా సత్తా చాటి టి–20లకు సమరోత్సాహంతో సిద్ధం కావాలని భావిస్తున్నాడు. కెప్టెన్ విరాట్ కోహ్లి కూడా అద్భుత ఫాంలో ఉన్నాడు. అతను కూడా చెలరేగేందుకు సిద్ధమయ్యాడు. ఈ ముగ్గురు రాణిస్తే భారత్‌కు భారీ స్కోరు సాధించడం కష్టమేమి కాదు. కాగా, సీనియర్ ఆటగాడు అజింక్య రహానె పేలవమైన ఫాంతో సతమతమవుతుండం జట్టును ఆందోళన కలిగిస్తోంది. ఈ మ్యాచ్‌లో అతనికి అవకాశం దొరుకుతుందా లేదా అనేది కూడా చెప్పడం కష్టమే. అతనికి బదులు మనీష్ పాండే, దినేష్ కార్తీక్‌లలో ఒకరికి ఛాన్స్ ఇచ్చే అవకాశాలున్నాయి. యువ ఆటగాడు శ్రేయస్ అయ్యర్‌కు కూడా విశ్రాంతి ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది. ఇక బౌలింగ్‌లో కూడా కుల్దీప్, చాహల్‌లలో ఒకరికి విశ్రాంతి ఇచ్చే ఛాన్స్ కనిపిస్తోంది. వీరి స్థానంలో అక్షర్ పటేల్ జట్టులోకి వచ్చే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. అక్షర్ పటేల్ ఈ సిరీస్‌లో ఒక్క మ్యాచ్ కూడా అడని విషయం తెలిసిందే. అంతేగాక ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యకు కూడా విశ్రాంతి ఇచ్చినా ఆశ్చర్యం లేదు. అతనికి బదులు ఒక బ్యాట్స్‌మన్‌ను ఆడించే అవకాశాలున్నాయి. సీనియర్ ఫాస్ట్ బౌలర్లు భువనేశ్వర్, బుమ్రాలకు కూడా విశ్రాంతి ఇచ్చే ఆలోచనలో కోహ్లి ఉన్నట్టు సమాచారం. ఇదే జరిగితే మహ్మద్ షమి, శార్దూల్ ఠాకూర్ బరిలోకి దిగడం తథ్యం.

బ్యాటింగ్ మెరుగు పడాల్సిందే...

సిరీస్‌లో భారత్ బ్యాటింగ్ అంతం మాత్రంగానే సాగుతుందని చెప్పాలి. ఓపెనర్ శిఖర్ ధావన్, కెప్టెన్ విరాట్ కోహ్లి తప్ప మిగతావారు ఆశించిన స్థాయిలో బ్యాట్‌ను ఝుళిపించలేక పోతున్నారు. చివరి ఓవర్లలో భారత బ్యాట్స్‌మెన్ వేగంగా పరుగులు రాబట్టలేక పోతున్నారు. ఈ విషయం చివరి మూడు వన్డేల్లో స్పష్టంగా కనిపించింది. ఐదో వన్డేలో చివరి పది ఓవర్లలో భారత బ్యాట్స్‌మెన్ 55 పరుగులు మాత్రమే నమోదు చేశారు. ఈ క్రమంలో మూడు వికెట్లను సైతం కోల్పోయారు. సీనియర్ ఆటగాడు మహేంద్ర సింగ్



ధోని వేగంగా ఆడడంతో విఫలమవుతున్నాడు. గతంలో విధ్వంసక బ్యాటింగ్‌తో ప్రకంపనలు సృష్టించిన ధోని ఈసారి మాత్రం ఆ జోరును కొనసాగించడంలో వైఫల్యం చెందాడు. కనీసం చివరి మ్యాచ్‌లోనైనా ధాటిగా ఆడాల్సిన అవసరం ఉంది. పాండ్య కూడా మెరుగ్గా ఆడక తప్పదు. భువనేశ్వర్‌తో పాటు టైలెండర్లు బ్యాట్‌ను ఝుళిపించాలి. అప్పుడే జట్టుకు మరింత మెరుగైన స్కోరు లభిస్తోంది.

పరువు కోసం...

ఇప్పటికే సిరీస్‌ను కోల్పోయిన సౌతాఫ్రికా కనీసం చివరి మ్యాచ్‌లోనైనా మెరుగైన ఆటను కనబరచాలనే పట్టుదలతో ఉంది. ఐదో వన్డేలో ఘోరంగా ఓడిన సఫారీ జట్టు చివరి మ్యాచ్‌లో గెలవాలనే లక్ష్యంతో ఉంది. ఈ మ్యాచ్‌లో గెలవడం ద్వారా టి–20 సిరీస్‌కు ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావాలని భావిస్తోంది. కిందటి మ్యాచ్‌లో బ్యాటింగ్ వైఫల్యం జట్టును వెంటాడింది. ఈ మ్యాచ్‌లోనైనా కీలక ఆటగాళ్లు స్థాయికి తగ్గ ఆటను కనబరచాలని జట్టు కోరుకుంటుంది. కెప్టెన్ మార్క్రామ్ మెరుగ్గానే ఆడుతున్న భారీ స్కోరును నమోదు చేయలేక పోతున్నాడు. స్టార్ ఆటగాడు డివిలియర్స్ కూడా కిందటి మ్యాచ్‌లో విఫలమయ్యాడు. ఈ మ్యాచ్‌లోనైనా అతను బ్యాట్‌కు పని చెప్పాల్సిన అవసరం ఉంది. డేవిడ్ మిల్లర్, డుమిని, క్లాసెన్ తదితరులతో బ్యాటింగ్ బలంగానే ఉంది. అయితే కీలక సమయంలో ఒత్తిడికి గురై వికెట్లను కోల్పోవడం జట్టుకు ప్రతికూలంగా మారింది. ఈ మ్యాచ్‌లో మాత్రం సమష్టిగా పోరాడి విజయం అందుకోవాలని సౌతాఫ్రికా భావిస్తోంది.



భారత జట్టులో మార్పులు!

దక్షిణాఫ్రికా గడ్డపై తొలి సిరీస్ కైవసం చేసుకున్న కోహ్లి సేన చివరి వన్డేలో మార్పులతో బరిలోకి దిగనుంది. నేడు సెంచూరియన్‌లో జరిగే చివరి వన్డేలో నాలుగు మ్యాచ్‌లకు బెంచ్‌కే పరిమితమైన ఆటగాళ్లను ఈ వన్డే ద్వారా అవకాశం కల్పించాలని టీమిండియా సారథి కోహ్లి యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వన్డేల సిరీస్ మెగియగానే మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభంకానుంది. ఈ సిరీస్‌ను దృష్టిలో పెట్టుకొని జట్టులోని పలువురు ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చి కొత్త ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలన్న ఆలోచనలో కోహ్లి ఉన్నాడు. ఒకవేళ బెంచ్‌కే పరిమితమైన ఆటగాళ్లకు చోటు కల్పిస్తే ఏ మేరకు రాణిస్తారో, ఈ ప్రయోగం ఎంత వరకు ఫలితమిస్తుందో వేచి చూడాలి. అక్షర్ పటేల్, శార్దూల్ ఠాకూర్‌లు తుది జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ అదే జరిగితే శ్రేయస్ అయ్యర్, చాహల్‌లకు విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉంది. కాగా మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్ ఈ నెల 18 నుంచి ప్రారంభంకానుంది.

చెలరేగిపోతున్న స్పిన్ ద్వయం..

భారత స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, యాజువెంద్ర చహాల్‌లు జోరుగా చెలరేగిపోతున్నారు. స్వదేశం, విదేశం అనే తేడా లేకుండా ఎంతటి బ్యాట్స్‌మెన్‌ను అయినా తిప్పేస్తున్నారు. బౌన్సీ పిచ్‌లపైనా గింగిరాలేస్తున్నారు. దక్షిణాఫ్రికా ఐదు వన్డేల్లో కుల్‌దీప్, చాహల్ జంట 4.92 ఎకానమీ రేట్‌తో 30 వికెట్లు పడగొట్టింది. సొంతగడ్డపైనైనా, విదేశాల్లోనైనా ఓ ద్వైపాక్షిక సిరీస్‌లో భారత స్పిన్నర్ల అత్యుత్తమ ప్రదర్శన ఇదే. తర్వాతి అత్యుత్తమం 27 వికెట్లు. 2006లో స్వదేశంలో ఇంగ్లాండ్‌పై ఆరు వన్డేల్లో ఈ ప్రదర్శన చేశారు. కాగా దక్షిణాఫ్రొకాతో జరిగిన ఐ వన్డేల్లో కుల్దీప్ యాదవ్ 16 వికెట్లు కూల్చగా, చహల్ 14 విట్లు కూల్చి కల్దీప్‌తో పోటీపడుతున్నాడు.

ఊరిస్తున్న మరో రికార్డు..

భారత జట్టును మరో రికార్డు ఊరిస్తోంది. ఈ సిరీస్ ముందు వరకూ సఫారీ గడ్డపై ఒక సిరీస్‌లో అత్యధికంగా రెండు వన్డేలు(రెండు సందర్భాల్లో) మాత్రమే గెలిచిన భారత్.. తాజా సిరీస్‌లో ఐదో వన్డే విజయంపై కన్నేసింది. ఆఖరి వన్డేను విజయంతో ముగిస్తే సఫారీల సొంత గడ్డపై అత్యధిక వన్డే విజయాలు సాధించిన తొలి భారత జట్టుగా విరాట్ సేన నిలుస్తుంది. అదే క్రమంలో విదేశీ ద్వైపాక్షిక సిరీస్‌లో ఐదు వన్డేలను మూడోసారి మాత్రమే గెలిచిన అరుదైన ఘనతను సొంతం చేసుకుంటుంది. అంతకుముందు 2013లో జింబాబ్వేతో వారి గడ్డపై ఐదు వన్డేల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన భారత్.. 2017లో శ్రీలంకతో వారి దేశంలో జరిగిన ఐదు వన్డేల సిరీస్‌ను కూడా వైట్‌వాష్ చేసిన సంగతి తెలిసిందే.

అరుదైన రికార్డుకు చేరువలో ధోని

టీమిండియా మాజీ సారథి మహేంద్రసింగ్ ధోని వన్డేల్లో 10,000 పరుగుల మార్క్‌కు 33 పరుగుల దూరంలో ఉన్నాడు. దక్షిణాఫ్రికాతో సిరీస్ ప్రారంభానికి ముందు ధోని వన్డే పరుగులతో 9,898 ఉన్న ధోని ఈ సీరిస్‌లో ఆడిన ఐదు వన్డేలలో కలిసి 69 పరుగులు మాత్రమే చేశాడు. కాగా అతను ఆడిన నాలుగో వన్డేలో 42 పరుగులు మినహా పెద్దగా ఆకట్టుకోలేదు. ప్రస్తుతం ధోని వన్డేల్లో చేసిన పరుగులు సంఖ్య 9,967. ఒకవేళ రేపటి మ్యాచ్‌లో ధోని పదివేల మార్కును చేరితే ఆ ఘనత సాధించిన నాలుగో భారత ఆటగాడిగా ధోని నిలుస్తాడు. ఇదిలా ఉండగా మరో నాలుగు క్యాచ్‌లు అందుకుంటే వికెట్ కీపర్‌గా మూడొందల వన్డే క్యాచ్‌లు పట్టిన తొలి భారత వికెట్ కీపర్‌గా ధోని రికార్డు సృష్టిస్తాడు.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.